అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 18-06-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 169 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



బెంగాల్‌లో ఘోర రైలు ప్రమాదం

'కాంచనజంగ'ను ఢీకొన్న గూడ్స్ రైలు

- లోకో పైలట్ సహా 15 మంది మృతి
- 60 మందికి గాయాలు
- సిగ్నల్ జంపింగే కారణమంటున్న అధికారులు
- రైల్వే మంత్రి రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్
- కొనసాగుతున్న సహాయక చర్యలు



కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రైలు ప్రమాదంలో పదిహేను మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 60 మంది గాయపడ్డారు. అసోంలోని సిల్చార్ నుండి కొల్‌కతాలోని సెల్దాకు వెళుతున్న కాంచనజంగ ఎక్స్‌ప్రెస్‌ను న్యూ జల్పాయిగురి స్టేషన్‌కు 11 కిలోమీటర్ల దూరంలో ఓ గూడ్సు రైలు వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ఘటనలో గూడ్సు రైలు బోగీలు చెల్లాచెదురు కాగా ఎక్స్‌ప్రెస్ రైలుకు చెందిన మూడు బోగీలు పట్టాలు తప్పాయి. ఉదయం సుమారు తొమ్మిది గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చునని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణీకులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ సంస్థల సిబ్బంది కృషి చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ రైలు బోగీల్లో ఒకటి గాలిలో వేలాడుతూ కన్పిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ మృతుల కుటుంబాలకు 10 లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారాన్ని ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున అందజేస్తారు.


> సిగ్నల్ జంప్ కారణంగా ప్రమాదం జరిగిందని రైల్వే బోర్డు సీఈఓ జయ వర్మ సిన్హా తెలిపారు. కాగా నిర్వహణా లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని కాంగ్రెస్ విమర్శించింది. దీనికి బాధ్యత వహించి రైల్వే మంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ డిమాండ్ చేశారు. 'నిర్వహణా లోపం కారణంగానే రైలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాక్‌లపై ఒత్తిడి పెరుగుతోంది. భద్రతా చర్యలు చేపట్టడం లేదు. ఒడిషా రైలు ప్రమాదం నుండి ప్రజలు తేరుకోకముందే ఈ ప్రమాదం చోటుచేసుకుంది' అని ఆయన తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైలు న్యూ జల్పాయిగురి స్టేషన్ నుండి బయలుదేరిన కొద్దిసేపటికే దానిని రంగపాని స్టేషన్ సమీపంలో వెనుక నుండి గూడ్సు రైలు బలంగా ఢీకొంది. దీంతో గూడ్సు రైలు బోగీలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఎక్స్‌ప్రెస్‌కు చెందిన మూడు బోగీలు పట్టాలు తప్పాయి.

రెడ్ సిగ్నల్ వేసినా గూడ్సు రైలు లోకో పైలట్ పట్టించుకోకపోవడం వల్లనే ప్రమాదం జరిగిందని ప్రాథమిక విచారణలో తేలినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రమాదంలో మరణించిన వారిలో గూడ్సు రైలు లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్, ఎక్స్‌ప్రెస్ రైలు గార్డు కూడా ఉన్నారు. ప్రమాదం నేపథ్యంలో న్యూ జల్పాయిగురి, సిలిగురి జంక్షన్, బగ్‌డోగ్రా, అలువాబరి మార్గాల్లో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేశారు. ప్రమాదం కారణంగా ఆ మార్గంలో అనేక రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఉత్తర బెంగాల్, దేశంలోని ఈశాన్య ప్రాంతాల ...13లో

కరెంటుపై ధరల పిడుగు

- చైనా, రష్యాపై అమెరికా ఆంక్షల ఎఫెక్ట్
- రాష్ట్ర ప్రాజెక్టులపైనా ధరల ప్రభావం
- సోలార్ ప్లాంట్ల నిర్మాణాల నిలిపివేత?
- ప్రాజెక్టుల వ్యయం పెరుగుతుందని మొత్తుకుంటున్న కాంట్రాక్టర్లు



భారీగా పెరిగిన కాపర్, అల్యూమినియం ధరలు

"బొగ్గు వినియోగం తగ్గించాలి. సోలార్, విండ్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించాలి. ప్రపంచం కాలుష్య కాసారంలోకి దిగజారుతుంది. భూతాపం పెరగకుండా, రక్షణ చర్యలు చేపట్టాలి" అగ్రరాజ్యం అమెరికా వల్లించే సుద్దపూస మాటలు ఇవి. దానికి ప్రధాని మోడీ తానా తందానా అంటూ, మీ నొప్పికి మేం మందు రాస్తాం అంటూ ప్రపంచవేదికలపై 'ఆహా...ఓహో' అనే ఉపన్యాసాలు దంచి కొడుతున్నారు. 2070 నాటికి దేశంలో కర్బన ఉద్గారాలు లేకుండా చేయాలని కంకణం కట్టుకున్నట్టు ప్రకటించారు. అదే సమయంలో అగ్రరాజ్యం అమెరికా విద్యుదుత్పత్తికి అత్యవసరమైన రాగి, అల్యూమినియం ధాతువుల ధరల్ని అమాంతం పెంచేసి, పర్యావరణ సూక్తుల వ్యాపారానికి నాంది పలికింది. ఎదురుచెప్పే ధైర్యం లేని కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని నోరెళ్లబెట్టి చూస్తూ, వీలైతే జనానికిచ్చే సబ్సిడీల్లో కోత పెడతామంటున్నది. చైనా, రష్యా వంటి దేశాల రాగి, అల్యూమినియం దిగుమతులపై అమెరికా సామ్రాజ్యవాదం ఆంక్షలు విధించి, అంతర్జాతీయ వ్యాపారంలో తానే రారాజుగా నిలవాలని కాంక్షిస్తుంది. దానికి ప్రధాని మోడీ 'జీ హుజూర్' అంటూ అడుగులకు మడుగులొత్తుతున్నారు. అంతిమంగా కరెంటు ఖరీదై, జనంపైనే ఆర్థికభారాలు పడేపరిస్థితులు ఏర్పడుతున్నాయి.



ఎస్ఎస్ఆర్ శాస్త్రి

థర్మల్ విద్యుత్కేంద్రాల వల్ల కాలుష్యం పెరుగుతుందనీ, అందువల్ల ప్రత్యామ్నాయ ఇంధన వినియోగాలవైపు మళ్లాలని అగ్రరాజ్యం అమెరికా అంతర్జాతీయ వేదికలపై సూక్తులు వల్లిస్తున్న విషయం తెలిసిందే. అమెరికా ఆడమన్నట్టు ఆడుతున్న దేశ ప్రధాని నరేంద్రమోడీ 2070 నాటికి దేశంలో కర్బన ఉద్గారాలు లేకుండా చేస్తామని హామీ కూడా ఇచ్చారు. అందుకోసం సోలార్, విండ్, అణువిద్యుత్ వంటి ప్రత్యామ్నాయాలు చూసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించారు. ఫలితంగా దేశంలో పునరుత్పాదక ఇంధనాలకు ప్రాధాన్యత ఏర్పడింది. దీన్ని ఆసరా చేసుకున్న అగ్రరాజ్యం అమెరికా హఠాత్తుగా విద్యుత్‌రంగానికి అత్యవసరమైన రాగి (కాపర్), అల్యూమినియం ఖనిజాల ధరల్ని అమాంతం పెంచేసింది. అంతర్జాతీయంగా కాపర్, అల్యూమినియం ఖనిజాలు దక్షిణ అమెరికాలోని చిలీలో అధికంగా ఉన్నాయి. ప్రపంచం తవ్విన రాగి సరఫరాలో చిలీ దేశంలోనే మూడింట ఒక వంతు వాటా ఉంది. మరోవైపు చైనా నుంచి ఎగుమతి అయ్యే రాగి, అల్యూమినియంపై అమెరికా వాణిజ్య ఆంక్షలు విధించింది. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని సాకుగా చూపుతూ కాపర్ ఎగుమతుల్లో అగ్రగామిగా ఉన్న రష్యాపైనా అమెరికా ఆంక్షలు విధించింది. దీనితో ప్రపంచ దేశాలు తప్పనిసరై అమెరికా నుంచే రాగి, అల్యూమినియం ...13లో

పరోక్షభారం

- ఎన్ జానయ్య, వైస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్
- తెలంగాణరాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీరెడ్కో)



కాపర్, అల్యూమినియం ధరల పెంపు సోలార్ విద్యుదుత్పత్తిపై పరోక్షంగా ఉంటుంది. రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్‌లో అతి స్వల్పంగానే కాపర్‌ను వినియోగిస్తారు. ఇండ్ల వైరింగ్‌పై మాత్రం ఆర్థిక భారం పెరుగుతుంది. కరెంటు వైరింగ్‌లో తప్పనిసరిగా కాపర్‌ను వినియోగిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో 0.5 మెగావాట్ నుంచి 4 మెగావాట్ల వరకే గృహ వినియోగానికి ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన స్కీం ద్వారా సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 6వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి ఉంది. కొత్త కేంద్రాల నిర్మాణంపై పెరిగిన ధరల భారం ఉంటుంది. అది యూనిట్ ధర నిర్ణయంపై ప్రభావం చూపొచ్చు.

ఐపీఎస్‌ల బదిలీలు

28 మందికి స్థాన చలనం

- పలువురు ఎస్పీలకు కొత్తగా జిల్లాల బాధ్యతలు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో భారీ ఎత్తున ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 28 మంది సూపరింటెండెంట్ స్థాయి అధికారులకు స్థాన చలనం కలిగింది. కాగా, గత ప్రభుత్వ హయాంలో నియమితులైన కొందరు ఎస్పీలకు అంతగా ప్రాధాన్యత లేని విభాగాలకు బదిలీ చేసి మరికొందరు ఎస్పీలకు కొత్తగా జిల్లాల బాధ్యతలను అప్పగించారు. బదిలీ అయిన అధికారుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

అధికారి పేరు	ప్రస్తుత పోస్టింగ్	కొత్త పోస్టింగ్
అశోక్ కుమార్	ఎస్పీ, మంచిర్యాల	ఎస్పీ, జగిత్యాల
సన్‌ప్రీత్ సింగ్	ఎస్పీ, జగిత్యాల	ఎస్పీ, సూర్యపేట
రాహుల్ హెగ్డే	ఎస్పీ, సూర్యపేట	ట్రాఫిక్ డీసీపీ, హైదరాబాద్
ఎల్. సుబ్బారాయుడు	ట్రాఫిక్ డీసీపీ,	హైదరాబాద్ డీజీపీ ఆఫీస్
టి. శ్రీనివాస్‌రావు	డీసీపీ, బాలానగర్	ఎస్పీ, గద్వాల
రితిరాజ్	ఎస్పీ, గద్వాల్	ఏసీబీ జేడీ
డి.వి శ్రీనివాస్‌రావు	డీసీపీ, మేడ్చల్ ట్రాఫిక్	ఎస్పీ, ఆసిఫాబాద్
కె. సురేశ్ కుమార్	ఎస్పీ, ఆసిఫాబాద్	డీసీపీ బాలానగర్
జానకీ ధరావత్	డీసీపీ, సౌత్ ఈస్ట్ సిటీ	ఎస్పీ, మహబూబ్‌నగర్
హర్షవర్ధన్	ఎస్పీ, మహబూబ్‌నగర్	ఎస్పీ, టీజీసీఎస్‌బీ
విశ్వజిత్ కంపాటీ	ఎస్పీ, టీజీసీఎస్‌బీ	ఎస్పీ, సీఐడీ
బి. రాజేశ్	ఎస్పీ, ఎస్ఐబీ	డీసీపీ, శంషాబాద్
కె. నారాయణ రెడ్డి	డీసీపీ, శంషాబాద్	ఎస్పీ, వికారబాద్
ఎన్. కోటిరెడ్డి	ఎస్పీ, వికారబాద్	డీసీపీ, మేడ్చల్
నితికాపంత్	డీసీపీ, మేడ్చల్	కమాండెంట్, 2వ బెటాలియన్
పీజేపీసీ ఛటర్జీ	కమాండెంట్,2వ బెటాలియన్	డీజీపీ ఆఫీస్
శరత్ చంద్ర పవార్	ఎస్పీ, టీజీఎన్‌స్‌బీ	ఎస్పీ, నల్గొండ
జి. చందన దీప్తి	ఎస్పీ, నల్గొండ	ఎస్పీ, సికింద్రాబాద్ రైల్వే
షేక్ సలీమా	ఎస్పీ, సికింద్రాబాద్ రైల్వే	డీసీపీ, సెంట్రల్ జోన్, వరంగల్
ఎం.ఎ బారీ	డీసీపీ, సెంట్రల్ జోన్,వరంగల్	డీజీపీ ఆఫీస్
డా.పాటిల్ సంగ్రాంసింగ్	వెయిటింగ్	ఎస్పీ, సెంట్రల్ ఫర్ గుడ్ గవర్నెన్స్
పి. సాయి చైతన్య	వెయిటింగ్	ఎస్పీ, టీజీఎన్‌స్‌బీ
సాధన పెరుమాల్	డీసీపీ, టాస్క్‌ఫోర్స్‌సిటీ	డీసీపీ, నార్త్‌జోన్, సిటీ
రోహిణి ప్రియదర్శిని	డీసీపీ, నార్త్‌జోన్, సిటీ	కమాండెంట్, డిచ్‌పల్లి బెటాలియన్
బి. రామ్ ప్రకాశ్	కమాండెంట్,డిచ్‌పల్లి బెటాలియన్	డీజీపీ ఆఫీస్
బి. రాజ మహేంద్ర నాయక్	ఎస్పీ, ఇంటెలిజెన్స్	డీసీపీ, జనగాం
పి. సీతారాం	డీసీపీ, జనగాం	డీజీపీ ఆఫీస్
ఎ. భాస్కర్	ఎస్పీ, టీజీఎన్‌స్‌బీ	డీసీపీ, మంచిర్యాల



జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

- నలుగురు మావోయిస్టులు మృతి
- మరో ఇద్దరి అరెస్ట్

రాంచీ : జార్ఖండ్‌లోని ఛైబాసాలో భద్రతా దళాలతో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మహిళ సహా నలుగురు మావోయిస్టులు మరణిం చారు. మరో ఇద్దరు ...3లో

నీట్ అవకతవకలపై విచారణ జరపాలి

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

- విద్యార్థుల ఆందోళనలకు పరిష్కారం చూపాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని
- ఈనెల 20న ధర్నాలు, ప్రదర్శనలకు పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)లో జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)-సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నష్టపోయిన విద్యార్థులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటన విడుదల



చేశారు. మోడీ నాయకత్వంలోని బీజేపీ/ఎన్డీయే పాలనలో ఉన్నత చదువుల కోసం నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల్లో అవకతవకలు, లీకేజీలు సర్వసాధారణంగా మారాయని విమర్శించారు. విద్యార్థుల జీవితాలు గందరగోళమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్‌కు సంబంధించి బీహార్, గుజరాత్‌లలో ప్రశ్నాపత్రాలు లీక్ చేశారనీ, పెద్దఎత్తున ...7లో

గుడిసెవాసులపై దాడులు ఆపాలి

- బచ్చన్నపేటలో పేదలపై పోలీసుల నిర్బంధం తగదు : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ

వివరాలు 13లో



రాయ్‌బరేలీకే రాహుల్‌గాంధీ


వయనాడ్‌లో ప్రియాంకా గాంధీ పోటీ

న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్, రాయ్‌బరేలీ స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ ఎంపీగా కొనసాగనున్నట్టు ప్రకటించారు. రెండు నియోజకవర్గాల్లో ఒక సీటును వదులుకోవాల్సి రావడంతో ఆయన వయనాడ్ ...13లో

గర్భిణికి ప్రసవం..పరీక్షకు సహకారం...మరవలేనివి

ఆర్టీసీ మహిళా సిబ్బంది, కానిస్టేబుల్ సురేష్‌కు సీఎం అభినందనలు

విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్ష





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిండు గర్భిణికి ప్రసవం చేసిన ఆర్టీసీ మహిళా సిబ్బందిని, యూపీఎస్సీ పరీక్షా కేంద్రానికి ఓ యువతిని సకాలంలో చేర్చిన ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. ఎక్స్(ట్విట్టర్) వేదికగా వారిపై ప్రశంసలు కురిపించారు. విధి నిర్వహణలో కూడా వారు ఇలాగే మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. వివరాల్లోకి వెళ్తే.... ఊరెళ్దామని కరీంనగర్ బస్టాండ్‌కు వచ్చిన ఓ నిండు గర్భిణి పురుటి నొప్పులు పడుతుంటే ఆర్టీసీ మహిళా సిబ్బంది చీరలు అడ్డుపెట్టి ప్రసవం చేశారు. 108 వాహనం వచ్చే లోపే సాధారణ డెలివరీ చేసి తల్లి, బిడ్డను ఆస్పత్రికి తరలించారు. దీంతో వీరిపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై పత్రికల్లో వచ్చిన వార్తలను చూసి సీఎం స్పందించారు. "కరీంనగర్ బస్టాండ్‌లో గర్భిణికి కాన్పు చేసి మానవత్వం చాటుకున్న మహిళా సిబ్బందికి నా అభినందనలు. మీరు సకాలంలో స్పందించడంతో తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. విధి నిర్వహణలో కూడా మీరు ఇలాగే మంచి పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు. మరో ఘటనలో రాజేంద్రనగర్ కానిస్టేబుల్ మానవత్వం చాటుకున్నారు. మహావీర్ కాలేజీలో యూపీఎస్సీ పరీక్షా కేంద్రం ఉన్న ఓ యువతి ఆర్టీసీ బస్సులో మైలార్‌దేవ్‌పల్లి వద్ద దిగింది. అక్కడికి పరీక్షా కేంద్రం చాలా దూరంలో ఉండటం, సమయం మించిపోతుండటంతో హైరానా పడింది. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్ ఆమె ఆందోళనను గుర్తించి పరీక్షా కేంద్రానికి సకాలంలో చేర్చారు. స్థానికులు తీసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సీఎం స్పందించారు. "వాహనాల నియంత్రణ మాత్రమే తన డ్యూటీ అనుకోకుండా సాటి మనిషికి సాయం చేయడం తన బాధ్యత అని భావించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్‌కు నా అభినందనలు. అతని సహకారంతో సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకున్న సోదరి యూపీఎస్సీ పరీక్షలో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. ఆల్ ది బెస్ట్" అని పేర్కొన్నారు. రెండు సంఘటనల్లో ప్రభుత్వ సిబ్బంది సకాలంలో స్పందించి మానవత్వం చాటుకోవడాన్ని ప్రజలతో పాటు స్వయంగా సీఎం ప్రశంసించడం హాట్ టాపిక్‌గా మారింది.

డ్రింక్‌ప్రైమ్ ప్రీమియర్ లీగ్‌లో 'ఫైటర్ స్టార్స్' విజయం

నవతెలంగాణ - హైదరాబాద్



ఇంటర్ - అపార్ట్‌మెంట్, ఇంటర్ - లోకాలిటీ క్రికెట్ టోర్నమెంట్ అయిన డ్రింక్‌ప్రైమ్ ప్రీమియర్ లీగ్ (డీపీఎల్) 2024లో ఫైటర్ స్టార్స్ విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన ఫైటర్ స్టార్స్ జట్టుకు లక్ష బహుమతి అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలలో ఉన్న అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లు, క్రికెట్ క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న పది జట్లు పాల్గొన్నాయి. ఫైటర్ స్టార్స్ నుంచి అమెర్ జాంటీ, సన్ రైజర్స్ ఎలెవెన్ నుంచి నితీష్ బోయా ఉత్తమ బ్యాట్స్‌మెన్, బౌలర్‌గా నిలిచారు. ఒక్కొక్కరికి పది వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా డ్రింక్‌ప్రైమ్ సీఈవో, సహ వ్యవస్థాపకుడు విజయేందర్ రెడ్డి ముత్యాల మాట్లాడుతూ హైదరాబాద్‌లో డ్రింక్‌ప్రైమ్ ప్రీమియర్ లీగ్ నిర్వహించడం నిజంగా ప్రత్యేకమైనదన్నారు. ఈ టోర్నమెంట్‌కు అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనన్నారు. డ్రింక్‌ప్రైమ్ కమ్యూనిటీ కోసం అద్భుతమైన ఈవెంట్‌లను ప్లాన్ చేయనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా డ్రింక్‌ప్రైమ్ సహ వ్యవస్థాపకుడు మానస్ రంజన్ హెూటా మాట్లాడుతూ విజేత జట్టుకు అభినందనలు తెలిపారు. డ్రింక్‌ప్రైమ్ ప్రీమియర్ లీగ్ నిర్వహించేందుకు ముందుకు వచ్చినప్పుడు మా మదిలో ఉన్నది ఒక్కటేనన్నారు. అది మా కోసం ఎంతో చేసిన సంఘానికి ఎంతో కొంత తిరిగి అందించడమేనన్నారు. ఇది కేవలం క్రికెట్‌కు సంబంధించినది మాత్రమే కాదని, ఇది ఆటపై మాకున్న ప్రేమ ద్వారా ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడేనని తెలిపారు.

పసిపాపకు సిగరెట్, మద్యం తాగించిన తల్లి

నవతెలంగాణ - అస్సాం



మత్తు పదార్థాలకు చిన్న పిల్లలకును వీలైనంత దూరంగా ఉంచాలని ప్రభుత్వాలు తల్లిదండ్రులకు సూచిస్తున్నాయి. పిల్లలతో ఒకే గదిలో ఉన్నప్పుడు పొగ త్రాగకూడదు, మద్యం సేవించరాదని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నాయి. కానీ ఇక్కడ ఓ తల్లి అమ్మ తనాన్నే మరిచి 20 నెలల పాపకు బలవంతంగా సిగరెట్, మద్యం తాగించిన ఘటన అస్సాంలో వెలుగు చూసింది. సిల్చార్‌కు చెందిన ఓ మహిళ 20నెలల పసిబిడ్డకు సిగరెట్, మద్యం తాపిస్తూ వేధిస్తోందని స్థానికులు.. చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులకు సమాచారమిచ్చారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు హుటాహుటీన మహిళ నివాసానికి చేరుకుని బిడ్డను రక్షించారు. తదుపరి విచారణ కోసం తల్లిని అదుపులోకి తీసుకున్నారు. నివేదికల ప్రకారం, ఈ దుశ్చర్య గడిచిన బుధవారం(జూన్ 12) రాత్రి జరిగినట్లు తెలుస్తోంది. పసిపాపకు పొగ, మద్యం తాగించి తల్లి వేధిస్తున్నట్లు తెలియడంతో పోలీసులకు సమాచారం అందించి తగు చర్యలు తీసుకున్నట్లు చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బిడ్డను రక్షించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కస్టడీలో ఉన్నారని, సమగ్ర విచారణ జరిపాక తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

జీహెచ్‌ఎంసీలో దంచికొట్టిన వాన

రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు వర్షం

255 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం వాన దంచికొట్టింది. రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడింది. రాష్ట్రంలో సోమవారం రాత్రి పది గంటల వరకు 255కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైతే అందులో సగానికిపైగా జీహెచ్‌ఎంసీ పరిధిలోనే ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి ప్రొద్దటూర్‌లో అత్యధికంగా 7.35 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి, హైదరాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఒకటెండ్రు చోట్ల భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశముంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వాన పడింది. ఓవైపు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వర్షం పడినప్పటికీ మిగిలిన ప్రాంతాల్లో తీవ్ర ఉక్కపోత ఉంది. పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా నేరెళ్లలో అత్యధికంగా 42 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా కొండాపూర్‌లో 41.9 డిగ్రీలు, నల్లగొండ జిల్లా దామరచర్ల, మాడ్గులపల్లిలలో 41.7 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా పిప్పల్‌దరిలో 41.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు

ప్రొద్దుటూరు (రంగారెడ్డి)	7.35 సెంటీమీటర్లు
శంకర్‌పల్లి (రంగారెడ్డి)	7.10 సెంటీమీటర్లు
తాళ్లమడుగు (ఆదిలాబాద్)	6.98 సెంటీమీటర్లు
మొయినాబాద్(రంగారెడ్డి)	6.10 సెంటీమీటర్లు
గోల్కొండ(హైదరాబాద్)	5.80 సెంటీమీటర్లు
అసిఫ్‌నగర్(హైదరాబాద్)	5.70 సెంటీమీటర్లు

నీట్ సమస్యను పరిష్కరించరెందుకు? : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అతి పెద్ద సమస్యగా ముందుకొచ్చిన నీట్ సమస్యను పరిష్కరించేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఆయన ట్వీట్ చేశారు. నీట్ సమస్య సున్నితమైనదనీ, ఈ అంశం పరీక్ష రాసిన లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ప్రభావితం చేసిందని ఆయన గుర్తుచేశారు. నీట్ అవకతవకలపై వచ్చిన వార్తా క్లిప్పింగ్‌లను ట్వీట్‌తో జత చేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థగా ఎన్‌సీఈఆర్‌టీ : జైరాం రమేష్

నవతెలంగాణ-న్యూఢిల్లీ

2014 నుండి ఎన్‌సీఈఆర్‌టీ ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థగా పని చేస్తోందని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ఆరోపించారు. ఇది పెద్ద ఎత్తున రాజ్యాంగంపై దాడికి దిగుతోందని మండిపడ్డారు. నీట్ 2024 ఫలితాల్లో గ్రేస్ మార్కులపై ఎన్‌సీఈఆర్‌టీని నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్టీఏ) తప్పుపట్టిందని సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ చర్య ఎన్టీఏ సొంత వైఫల్యాల నుంచి దారి మళ్లించేందుకేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ వత్తిపరమైన సంస్థ కాదన్నది వాస్తవమని తెలిపారు. సవరించిన 11వ తరగతి పొలిటికల్ సైన్స్‌లో లౌకికవాదం అంశాన్ని తప్పుగా పేర్కొందని, రాజకీయ పార్టీల విధానాలను పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. లౌకికవాదం భారత గణతంత్ర రాజ్యానికి మూల స్తంభంగా పేర్కొన్న రాజ్యాంగ ప్రవేశికపై ఎన్‌సీఈఆర్‌టీ దాడికి దిగుతోందని మండిపడ్డారు. రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో లౌకికవాదం ముఖ్యమైన భాగమని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో స్పష్టం చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ లక్ష్యం పాఠ్య పుస్తకాలను రూపొందించడమని, రాజకీయ పార్టీల కరపత్రం, ప్రచారాలను తయారు చేయడం కాదని తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ అంటే 'నాగపూర్ లేదా నరేంద్ర కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్' కాదని ఎద్దేవా చేశారు. ఎన్టీఏ 1.0 ప్రభుత్వం తమకు అనుకూలంగా లేవని వాస్తవాలను విద్యార్థులకు బోధించకుండా దాచిపెట్టడం సిగ్గుచేటని టీఎంసీ నేత సాకేత్ గోఖలే విమర్శించారు. ఈ లాజిక్ ప్రకారం .. హింసాత్మక, అణచివేయబడిన అంశాలైన వరల్డ్ వార్ గురించి కూడా ప్రస్తావించకూడదని అన్నారు. నేరపూరిత వ్యక్తులు, తిరుగుబాటుదారులుగా బిజెపి, మోడీ చరిత్రకెక్కడం సిగ్గు చేటని, విద్యార్థుల నుండి వాస్తవాలను ఎందుకు దాచిపెడుతున్నారని తెలిపారు.

నీట్ ఫలితాలపై నమ్మకం లేకుంటే మళ్లీ పరీక్ష నిర్వహిస్తాం

బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'నీట్ పరీక్షాపత్రం లీక్ అవ్వలేదని ఎన్‌టీఏ చెబుతున్నది. మార్కుల కేటాయింపులో తప్పులు జరిగాయంటున్నది కాబట్టి చెక్ చేసి సరిచేయిస్తాం. అయినా, అభ్యర్థులకు నమ్మకం కుదరకుంటే వారికి రీ టెస్ట్ కండక్ట్ చేస్తాం. అంతేకాని బట్ట కాల్చి మీద వేయొద్దు' అని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఆరేండ్ల బాలికపై జరిగిన లైగింక దాడిని ఖండించారు. అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తి గంజాయి మత్తులో ఉన్నాడని తెలుస్తున్నదనీ, కాంగ్రెస్ పాలనలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని విమర్శించారు. పది రోజుల కిందనే నిందితుడు రైస్‌మిల్లులో చేరినట్టు తెలుస్తున్నదనీ, అక్కడ లేబర్ రికార్డులు కూడా మెయింటెన్ చేయడం లేదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి డబ్బులు పంపించే పనిలో ఉన్నారని ఆరోపించారు. సుల్తానాబాద్ ఘటనలోని నిందితునికి కఠిన శిక్ష విధించాలనీ, బాధిత కుటుంబానికి ఇల్లు, రూ.20 లక్షల పరిహారం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 8 నెలల్లో పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాల శాఖల్లో బిల్లులు ఇవ్వడం లేదనీ, స్థానిక ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు కూడా ఇవ్వటం లేదని చెప్పారు.

జమ్మూ కాశ్మీర్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జీగా కిషన్ రెడ్డి

నాలుగు రాష్ట్రాలకు ఇన్‌చార్జి, కో ఇన్‌చార్జిల నియామకం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నాలుగు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు బీజేపీ చీఫ్ జేపి నడ్డా పార్టీ తరపున ఎన్నికల ఇన్‌చార్జీలను నియమించారు. అందులో భాగంగా కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కాశ్మీర్ ఎన్నికల బాధ్యతలను కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి అప్పగించారు. ఈ మేరకు సోమవారం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు. మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్‌లో ఈ ఏడాది చివరలో ఎన్నికలు జరగనున్నాయి. సెప్టెంబర్‌లోగా జమ్మూ కాశ్మీర్‌లలో అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించాలని సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే.

దీంతో ఆయా రాష్ట్రాల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ తరపున ఎన్నికల బాధ్యతలను కేంద్ర మంత్రులు, సీఎం, మాజీ సీఎంలకు అప్పగిస్తూ బీజేపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఇందులో మహారాష్ట్రకు ఇన్‌చార్జి, కో ఇన్‌చార్జీలుగా కేంద్ర మంత్రులు భూపేంద్ర యాదవ్, అశ్వినీ వైష్ణవ్‌ను నియమించింది. హర్యానాకు ఇన్‌చార్జి, కో ఇన్‌చార్జీలుగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మాజీ సీఎం బిప్లవ్ కుమార్ దేవ్‌ను, జార్ఖండ్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జిగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహ ఇన్‌చార్జిగా అస్సాం సీఎం హేమంతా విశ్వ శర్మకు బాధ్యతలు అప్పగించింది. కాగా, జమ్మూ కాశ్మీర్‌కు కేవలం ఇన్‌చార్జినే నియమించిన హైకమాండ్, ఆ బాధ్యతలను కిషన్ రెడ్డికి మాత్రమే అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది.


రగిలిపోతున్న సంఘ్ పరివార్

మోడీ-షా ద్వయంపై ఆగ్రహం

ఓటమికి వారే కారణమని మండిపాటు

ఏకపక్ష నిర్ణయాలతో కొంప ముంచారని ధ్వజం

సంప్రదింపులకు స్వస్తి చెప్పారని ఆరోపణ



న్యూఢిల్లీ : సంఘ్ పరివార్ లోలోన రగిలిపోతోందా ? ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అందరి మనసుల్లో ఇదే ప్రశ్న తలెత్తుతోంది. ఎన్నికల ప్రచార సరళిని భగవత్ తప్పుపట్టారు. అది హుందాతనం కోల్పోయిందంటూ అసహనం వ్యక్తం చేశారు. మణిపూర్ ఘర్షణలను నివారించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశించే భగవత్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు కన్పిస్తోంది.

మోడీ తన ఎన్నికల ప్రచారంలో ముస్లింలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. సంఘ్ పరివార్ సైద్ధాంతిక భావజాలం నుండి ఆయన పూర్తిగా పక్కకు జరిగారన్న అభిప్రాయం వ్యక్తమైంది. ముస్లింలను చొరబాటుదారులని, అధిక సంతతి కలిగిన వారని మోడీ ఎత్తిపొడవడం బీజేపీకి రాజకీయంగా నష్టాన్నే కలిగించింది. పనిలో పనిగా ఆయన కాంగ్రెస్‌పై కూడా పలు అసత్య ఆరోపణలు చేశారు. మోడీ తన ఎన్నికల ప్రచారంలో విద్వేష ప్రసంగాలు చేసినప్పటికీ ఆర్ఎస్ఎస్ పెదవి విప్పలేదు. మోడీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యక్తమైన వ్యతిరేకతను ఆర్ఎస్ఎస్ ప్రచారకులు పసిగట్టే ఉంటారని, అందుకే వారు అంత క్రియాశీలకంగా వ్యవహరించలేదని పరిశీలకులు తెలిపారు.

భగవత్ చురకలు

అయితే ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విమర్శకులు తమ గళాలకు పదును పెట్టారు. బీజేపీకి లోక్‌సభలో కనీసం స్పష్టమైన మెజారిటీ కూడా దక్కకపోవడంతో భగవత్ వంటి ఆర్ఎస్ఎస్ ప్రముఖులు సైతం తమ అసంతృప్తిని, అసహనాన్ని బాహాటంగానే వ్యక్తపరిచారు. ఎన్నికల ప్రచారంలో గౌరవంగా వ్యవహరించలేదని, సంయమనాన్ని ప్రదర్శించలేదని భగవత్ వ్యాఖ్యానించారు. భగవత్ వ్యాఖ్యలు కేవలం మోడీనో, బీజేపీ కేంద్ర నాయకత్వాన్నో మాత్రమే ఉద్దేశించి చేసినవి కావని ఆర్ఎస్ఎస్ నేతలు ఆ తర్వాత వివరణలు ఇచ్చుకున్నారు. ప్రతిపక్షాలను విరోధులుగా ఆర్ఎస్ఎస్ చూడడం లేదని కూడా భగవత్ చెప్పారు. ప్రజాస్వామ్య రాజకీయ సంస్కృతికి ఆర్ఎస్ఎస్ ఈ విధంగా మద్దతు తెలపడం చాలా అరుదు. అహంకారం లేని నాయకుడే నిజమైన ప్రజా సేవకుడంటూ భగవత్ చేసిన వ్యాఖ్య ఎవరికి తగలాలో వారికే తగిలింది. తాను ప్రధానమంత్రిని కాదని, ప్రధాన సేవకుడినని మోడీ తనకు తానే చెప్పుకుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొనే భగవత్ ఆ వ్యాఖ్యలు చేశారని అర్థమవుతోంది.

వీరు సైతం...

భగవత్ వ్యాఖ్యలను అలా ఉంచితే ఇంద్రేష్ కుమార్ వంటి ఆర్ఎస్ఎస్ నేతలు మరింత తీవ్ర పదజాలంతో ప్రకటనలు చేశారు. గర్విష్టి పార్టీని శ్రీరాముడు నిలువరించాడని ఇంద్రేష్ దెప్పి పొడిచారు. మితిమీరిన విశ్వాసంతో వ్యవహరించిన బీజేపీ కార్యకర్తలకు ఈ ఫలితాలు నిజంగానే కళ్లెం వేశాయని సంఘ్ సిద్ధాంతకర్త రతన్ షర్దా 'ఆర్గనైజర్' పత్రికకు రాసిన వ్యాసంలో అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో సహకరించాల్సిందిగా బీజేపీ నాయకత్వం ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులను కోరలేదని ఆయన విమర్శించారు. భారత్ మరోసారి సంకీర్ణ రాజకీయాల ఊబిలోకి జారుకున్నదని ఆర్ఎస్ఎస్ నేత రాంమాధవ్ తెలిపారు. అట్టడుగు వర్గాల సమస్యలను పట్టించుకోకపోయినా ధనబలంతో గెలుస్తామని భావించిన వారందరికీ ఎన్నికల ఫలితాలు ఓ సందేశాన్ని అందించాయని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చెప్పారు. అభ్యర్థుల ఎంపిక తీరుపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆర్ఎస్ఎస్ నేతల విమర్శలన్నీ బీజేపీ కేంద్ర నాయకత్వాన్ని...ముఖ్యంగా మోడీ-షా ద్వయాన్ని లక్ష్యంగా చేసుకుని చేసినవేనని స్పష్టమవుతోంది. పార్టీలో విధాన నిర్ణయాలన్నింటినీ వీరిద్దరే తీసుకునే వారు. తమను సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ పలువురు నేతలు లోలోన తీవ్రమైన అసంతృప్తికి గురయ్యారు.

సుధీంద్ర కులకర్ణి ఏమన్నారంటే...

భగవత్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాలని ఒకప్పుడు సంఘ్ పరివార్‌లో క్రియాశీలక పాత్ర పోషించిన సుధీంద్ర కులకర్ణి అన్నారు. గత పది సంవత్సరాల కాలంలో ప్రధానిని ఆర్ఎస్ఎస్ చీఫ్ విమర్శించడం ఇదే మొదటిసారని ఆయన గుర్తు చేశారు. మోడీ ప్రచారం యావత్తూ అబద్ధాలతో సాగిందని, ఎక్కడా హుందాతనం కన్పించలేదని భగవత్ అభిప్రాయపడ్డారని తెలిపారు. మోడీ ప్రభుత్వ ఏకపక్ష పనితీరుపై పరివార్ చాలా కాలంగా అసంతృప్తితో ఉన్నదని చెప్పారు. మోడీ-షా ద్వయం ఆర్ఎస్ఎస్ నేతల అభిప్రాయాలకు ఎన్నడూ ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. వారు ఆర్ఎస్ఎస్‌తో చర్చలు జరపలేదని, సంస్థను గౌరవించలేదని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్‌పై బీజేపీ ఇంకెంత మాత్రం ఆధారపడబోదని నడ్డా చేసిన ప్రకటనపై కులకర్ణి నిప్పులు చెరిగారు. నడ్డా ప్రకటనలో ఆగ్రహించిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారని, అమేథీలో అయితే బీజేపీ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేశారని చెప్పారు. కొన్ని సంవత్సరాల క్రితం ముస్లిం పెద్దలతో భగవత్ సంప్రదింపులు మొదలు పెట్టారని, కానీ ప్రభుత్వం ఆయనకు మద్దతు తెలపలేదని అన్నారు. ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్‌తో అభిప్రాయబేధాలు ఉన్నప్పటికీ వాజ్‌పేయి, అద్వానీ వంటి నేతలు ఆయనను ఎల్లప్పుడూ గౌరవించేవారని కులకర్ణి గుర్తు చేశారు.

వారిది రెండు నాల్కల ధోరణి

ఆర్ఎస్ఎస్ రెండు నాల్కల ధోరణిని ప్రదర్శిస్తోందని సీనియర్ పాత్రికేయుడు ధీరేంద్ర కే ఝూ అభిప్రాయపడ్డారు. బీజేపీకి స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో ఆర్ఎస్ఎస్ నేతలు ఇప్పుడు దాని వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారని ఆయన తెలిపారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మణిపూర్ ఘర్షణలకు ఆజ్యం పోశారని, ఇప్పుడేమో ఆ ఘర్షణలపై భగవత్ ప్రభుత్వాన్ని నిందిస్తున్నారని, ఇది రెండు నాల్కల ధోరణి తప్పించి మరోటి కాదని విమర్శించారు. సాంస్కృతిక సంస్థగా వ్యవహరిస్తానని హామీ ఇచ్చిన మీదటే ఆర్ఎస్ఎస్‌పై నిషేధాన్ని ఎత్తివేశారని అంటూ ఇప్పుడేమో అది రాజకీయ సంస్థ మాదిరిగా పనిచేస్తోందని ఆరోపించారు.

టాప్ పోస్టుల్లో ఎవరో?

కేంద్రంలో కొద్ది నెలల్లో ఏర్పడనున్న ఖాళీలు

బ్యూరోక్రాట్ల నియామకం కోసం వేట

జులైలో బడ్జెట్ తర్వాతే నియామకాలు

విశ్వసనీయ వర్గాల వెల్లడి



న్యూఢిల్లీ : మరికొద్ది నెలల్లో కేంద్ర ప్రభుత్వంలోని అత్యున్నతస్థాయి పోస్టులు ఖాళీ కానున్నాయి. వాటిలో క్యాబినెట్ సెక్రెటరీ, హెూం సెక్రెటరీ, విదేశాంగ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, యూఎస్ఏలో భారత రాయబారి వంటి పదవులు ఇందులో ఉన్నాయి. ప్రధాని మోడీ తన ప్రిన్సిపల్ సెక్రెటరీ, జాతీయ భద్రతా సలహాదారు, మరో ఇద్దరు సలహాదారులను ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ)లో కొనసాగించిన విషయం విదితమే.

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రస్తుత ఐబీ డైరెక్టర్ తపన్ కుమార్ దేకా పదవీకాలం జూన్ 30తో ముగుస్తుంది. కాబట్టి, ఈ వారం పొడిగింపు ఇచ్చే అవకాశమున్నది. మోడీ 3.0 పరిపాలన మొదటి పూర్తి బడ్జెట్ తర్వాత చాలా ఇతర ఉన్నత పదవులకు సంబంధించిన నియామకాలు జరిగే అవకాశం ఉన్నది. ఇవి జులైలో కేంద్రం ప్రవేశపెట్టబోయే పూర్తి స్థాయి బడ్జెట్ తర్వాతనే జరగనున్నాయి. విదేశాంగ కార్యదర్శి పదవికి డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ విక్రమ్ మిస్రీ ముందు వరుసలో ఉన్నారు. అయితే అక్టోబర్‌లో ఒక సంవత్సరం పొడిగింపు ముగియనున్న ప్రస్తుత వినయ్ క్వాత్రా భారత రాయబారిగా యూఎస్‌కు పంపబడవచ్చు. లండన్‌లోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి కూడా వాషింగ్టన్‌లో పోస్ట్ కోసం పోటీలో ఉన్నారు.

ఇక తన మూడోసారి పొడిగింపుపై ఉన్న క్యాబినెట్ సెక్రెటరీ రాజీవ్ గౌబా.. ఈ ఏడాది ఆగస్టులో తన ప్రస్తుత పొడిగింపు పూర్తయిన తర్వాత రిలీవ్ కావాలని అభ్యర్థించినట్టు సమాచారం. ఆయన తర్వాత ఆ పదవిలో ఎవరిని ఉంచాలన్న దానిపై వేట కొనసాగుతున్నది. హెూం సెక్రెటరీగా మూడోసారి పొడిగింపుపై పదవిలో ఉన్న అజయ్ భల్లా కూడా ఈ ఏడాది ఆగస్టులో పదవీ విరమణ చేయనున్నారు. ప్రభుత్వం ఆయనను అదే పదవిలో లేదా మరేదైనా హెూదాలో కొనసాగించవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి.

జూలై 1 నుండి నూతన క్రిమినల్ చట్టాల అమలు

అందరినీ సంప్రదించామన్న కేంద్ర మంత్రి

ఏకపక్ష నిర్ణయమేనన్న కాంగ్రెస్

న్యూఢిల్లీ : నూతన క్రిమినల్ చట్టాలు వచ్చే నెల 1వ తేదీ నుండి అమలులోకి వస్తాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. అందరినీ సంప్రదించే ఈ చట్టాలు తీసుకొచ్చామని ఆయన చెప్పారు. నిర్ణయం తీసుకునే ముందు తమను సంప్రదించలేదంటూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. కాంగ్రెస్ మాత్రం ఇది ఏకపక్ష నిర్ణయమేనని పునరుద్ఘాటించింది. 146 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి పార్లమెంటులో ఈ చట్టాలను ఏకపక్షంగా ఆమోదింపజేసుకున్నారని ఆరోపించింది.



సంప్రదించాం కానీ స్పందన కరువు

ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, సీఆర్‌పీసీ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, ఎవిడెన్స్ చట్టం స్థానంలో భారతీయ సాక్ష్య చట్టాన్ని తీసుకొని వస్తున్నామని మేఘ్‌వాల్ చెప్పారు. 'తమను సంప్రదించలేదని కొందరు చెబుతున్నారు. ఇది నిజం కాదు. వలసవాదుల కాలం నాటి చట్టాలను మార్చాలని చాలా కాలం నుండి డిమాండ్ ఉంది. దీనికి సంబంధించిన ప్రక్రియ ఎప్పుడో మొదలైంది' అని ఆయన తెలిపారు. 'మేము ఎంపీలందరినీ సంప్రదించాం. అయితే ఉభయ సభలకు చెందిన 142 మంది సభ్యులు మాత్రమే స్పందించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఎమ్మెల్యేల నుండి సూచనలు కూడా కోరాము. వారిలో కేవలం 270 మంది మాత్రమే స్పందించారు. మేము విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపాము. కానీ ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలు తెలియజేయలేదు' అని వివరించారు.

ప్రతిపక్షాలు లేకుండానే...

చట్టాలను మార్చేందుకు ఉద్దేశించిన బిల్లులకు లోక్‌సభ గత సంవత్సరం ఆమోదం తెలిపింది. అయితే పార్లమెంటులో జరిగిన భద్రతా వైఫల్యంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలంటూ ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో 97 మంది ప్రతిపక్ష సభ్యులను సభ నుండి సస్పెండ్ చేశారు. ప్రతిపక్షాలు లేకుండానే బిల్లులను ప్రభుత్వం సభలో ఆమోదింపజేసుకుంది. రాజ్యసభలోనే ఇదే తంతు నడిచింది. బిల్లులపై సభలో సుమారు ఆరు గంటల పాటు చర్చ జరిగింది. ఆ సమయంలో పెద్దల సభలో ప్రతిపక్ష సభ్యులెవరూ లేరు. ప్రతిపక్ష స్థానాలు పూర్తిగా ఖాళీగా ఉండడాన్ని గమనించిన ప్రభుత్వం సభలో బిల్లులను ఆమోదింపజేసుకొని ఊపిరి పీల్చుకుంది.

న్యాయ వ్యవస్థ గొంతు నులమడమే : కాంగ్రెస్

మేఘ్‌వాల్ వాస్తవాలను కప్పిపెడుతున్నారని చండీఘర్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ విమర్శించారు. చట్టాలను అమలు చేయడమంటే భారత న్యాయ వ్యవస్థ గొంతు నులమడమే అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ చట్టాలలోని కొన్ని నిబంధనలు భారత రిపబ్లిక్‌కు పునాది అయిన పౌర స్వేచ్ఛపై దాడి చేస్తున్నాయని విమర్శించారు. వీటి అమలును కొంతకాలం నిలిపివేయాలని మనీష్ తివారీ డిమాండ్ చేశారు.



జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

అరెస్టయ్యారు. చనిపోయిన మావోయిస్టుల్లో ఒక జోనల్ కమాండర్, ఒక సబ్-జోనల్ కమాండర్ ఉన్నారు. చైబాసా (పశ్చిమ సింఘ్‌భుమ్)లోని కొల్హాన్ అడవుల్లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఉదయం ఎదురు కాల్పులు ప్రారంభమయ్యాయని, ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ నష్టం జరిగిందని పోలీసులు తెలిపారు. మావోయిస్టుల మృతిని చైబాసా ఎస్పీ అశుతోష్ శేఖర్ ధృవీకరించారు. 'ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన నలుగురు మావోయిస్టుల్లో ఒకరు జోనల్ కమాండర్. మరొకరు సబ్-జోనల్ కమాండర్. ఇంకొకరు ఏరియా కమాండర్. మిగిలిన మావోయిస్టు మహిళ' అని ఎస్పీ వివరించారు. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత ఇద్దరు మావోయిస్టులను భద్రతా దళాలు పట్టుకున్నాయని, వారిలో ఒకరు ఏరియా కమాండర్ కాగా రెండో వ్యక్తి కరడుకట్టిన మహిళా మావోయిస్టు అని చెప్పారు. సంఘటనా స్థలంలో మావోయిస్టుల మృతదేహాలతో పాటు పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు, రోజువారీగా ఉపయోగించే కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

గువా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు జరుపుతుండగా ఓ పొదలో కూర్చున్న మావోయిస్టులు విచక్షణారహితంగా కాల్పులు ప్రారంభించారని, భద్రతా దళాలు కూడా ఎదురు కాల్పులు జరిపాయని పోలీసు వర్గాలు తెలిపాయి. కాగా సంఘటనా స్థలం నుండి దట్టమైన అడవుల్లోకి పరారైన మావోయిస్టుల కోసం గాలింపు కొనసాగుతోంది. ఎన్‌కౌంటర్‌లో కొందరు మావోయిస్టులకు బులెట్ గాయాలైనట్లు తెలుస్తోంది. పశ్చిమ సింఘ్‌భుమ్ జిల్లాలోని సరండా అటవీ ప్రాంతం మావోయిస్టుల కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా ఉంటోంది. అక్కడ భద్రతా దళాలు నిరంతరం గాలింపు చర్యలు జరుపుతుంటాయి. వారం రోజుల క్రితం కూడా ఈ ప్రాంతం నుండి పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

అల్లర్లను బోధించటం దేనికి?

కొన్నింటిని సెలెక్టివ్‌గా ప్రస్తావించడం సరికాదు

పాఠ్యపుస్తకాల్లో కొన్ని అంశాల సవరింపులపై ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్



న్యూఢిల్లీ : ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ డి.పి సక్లానీ గుజరాత్ అల్లర్లు, బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత జరిగిన హింసను 12వ తరగతి పొలిటికల్ సైన్స్ పాఠ్యపుస్తకం నుంచి తొలగించటాన్ని సమర్థించారు. కొన్నింటిని సెలెక్టివ్‌గా ప్రస్తావించటం మంచిది కాదని నిపుణుల కమిటీ భావించిందని ఆయన అన్నారు. "మనం పాఠశాల పాఠ్యపుస్తకాల్లో అల్లర్ల గురించి ఎందుకు బోధించాలి? మనం సానుకూల పౌరులను సృష్టించాలనుకుంటున్నాం. హింసాత్మక, అణగారిన వ్యక్తులను కాదు. అయోధ్య విభాగంలోని సవరణలు నిపుణుల అభిప్రాయంపై ఆధారపడి ఉన్నాయి. వివాదంపై సుప్రీంకోర్టు 2019 తీర్పునకు అనుగుణంగా ఉన్నాయి" అని ఆయన చెప్పారు. అయోధ్య అంశానికి సంబంధించి 12వ తరగతి పుస్తకంలోని 8వ అధ్యాయంలో నాలుగు నుంచి రెండు పేజీల వరకు కుదించారు. గత వారం మార్కెట్‌లోకి వచ్చిన ఈ సవరించిన పాఠ్యపుస్తకం మాత్రం బాబ్రీ మసీదు పేరును ప్రస్తావించలేదు. దానిని "మూడు గోపురాల నిర్మాణం" అని పిలుస్తూ, గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి అయోధ్య వరకు బీజేపీ రథయాత్ర, కరసేవకుల పాత్ర, డిసెంబర్ 6, 1992న బాబ్రీ మసీదు కూల్చివేత నేపథ్యంలో మత హింస, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలనతో సహా మునుపటి వెర్షన్ నుంచి చెప్పే వివరాలను తొలగించింది.

బాబ్రీ మసీదు కూల్చివేత, 2002 గుజరాత్ అల్లర్ల తరువాత జరిగిన మత హింసకు సంబంధించిన కంటెంట్‌ను విస్మరించటంపై ఆయన మాట్లాడుతూ.. "మన దేశంలో చాలా మతపరమైన అల్లర్లు జరిగాయి. కొన్నింటిని సెలెక్టివ్‌గా పేర్కొనటం మంచిది కాదనీ, పాఠశాలల్లో చరిత్రను వాస్తవాలు చెప్పటానికే బోధిస్తున్నారనీ, దానిని యుద్ధభూమిగా మార్చకూడదని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది" అని తెలిపారు. బాబ్రీ మసీదు కూల్చివేతకు దారితీసిన సంఘటనలు, దాని తదనంతర పరిణామాలపై ఇతర వివరాలను ఎందుకు వదిలిపెట్టారని అడిగిన ప్రశ్నకు.. "కొత్త కంటెంట్‌ను (సుప్రీంకోర్టు తీర్పుపై) ప్రవేశపెట్టాల్సిన అవసరం లేదు" అని ఆయన అన్నారు.

మంత్రివర్గంలోకి కల్పనా సోరెన్

ఇప్పటికే రాహుల్‌ను కలిసిన జార్ఖండ్ మాజీ సీఎం భార్య

రాంచీ : కొత్తగా ఎన్నికైన జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) ఎమ్మెల్యే కల్పనా సోరెన్ ముఖ్యమంత్రి చంపాయ్ సోరెన్ నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గంలో చేరనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. కల్పన తన పార్టీ నిర్ణయం గురించి తెలియజేయటానికి గత వారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీని కలిశారు. జార్ఖండ్‌లో ప్రస్తుతం జేఎంఎం, కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాన్ని నడుపుతున్నది. అక్కడ ఈ ఏడాది చివర్లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన తర్వాత ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిన కల్పనా సోరెన్ భర్త హేమంత్ సోరెన్ జైలులో ఉండటంతో.. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల సమయంలో కల్పనా జేఎంఎం పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా ఎదిగారు. ఆమె ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రచారానికి నాయకత్వం వహించనున్నారు.

దేశ భవిష్యత్‌తో మోడీ ఆటలు

పేద పిల్లలను విద్యకు దూరం చేస్తున్న బీజేపీ

నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి

నేడు హైదరాబాద్ స్టూడెంట్స్ మార్చ్

విద్యార్థి సంఘాల నాయకుల వెల్లడి

స్టూడెంట్స్ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశ భవిష్యత్తుతో ప్రధాని మోడీ ఆటలాడుతున్నారని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు విమర్శించారు. విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సంయుక్త విలేకర్ల సమావేశం నిర్వహించారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న స్టూడెంట్స్ మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ పేదలకు విద్యను దూరం చేసేందుకు బీజేపీ పలు రకాల కుట్రలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలనీ, సుప్రీంకోర్టు జడ్జి చేత విచారణ జరిపించి నీట్ అవకతవకల బాధ్యులపై చర్యలు తీసుకోవాలనీ, పేపర్ లీక్‌పై ప్రధాని మోడీ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేసి నీట్ నిర్వహణను రాష్ట్రాలకు అప్పగించి బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం తలపెట్టిన స్టూడెంట్ మార్చ్‌లో పెద్ద ఎత్తున పాల్గొనాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.

ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా తదితర బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఇలాంటి అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. వీటిపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు కానీ, కేంద్రంలోని బీజేపీ సర్కార్ కానీ చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా రాష్ట్రంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు హిమాయత్‌నగర్ సర్కిల్ నుంచి లిబర్టీ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు స్టూడెంట్స్ మార్చ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అప్పటికీ కేంద్రంలోని బీజేపీ సర్కార్ స్పందించకుంటే రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇండ్ల వద్ద, వారి కార్యక్రమాల వద్ద నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ వ్యవహారంపై ప్రధాని మోడీ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధర్మంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి హేతుబద్ధత లేదనీ, దాని బోర్డులో ఎవరున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్‌లో బీజేపీ చేసిన కుట్రతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని తెలిపారు. విద్యారంగం పట్ల మొదట్నుంచి నిర్లక్ష్యంగా ఉంటున్న బీజేపీ విద్యాకాషాయీకరణపైనే శ్రద్ధ చూపిస్తున్నదని విమర్శించారు.

డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్ మాట్లాడుతూ నీట్ వ్యవహారంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యారంగంపై మాట్లాడేందుకు సమయం లేని బీజేపీ నాయకులకు విద్వేష రాజకీయాల గురించి మాట్లాడేందుకు మాత్రం సమయముందని ఎద్దేవా చేశారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే నీట్ లీక్ పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాధితుల పక్షాన అన్ని రాజకీయ పార్టీలు నిలబడాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా కాకుండా ప్రధాని మోడీ పీఆర్వోగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పీడీఎస్‌యూ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ఏబీవీపీ, సంఘ్ పరివార్ శక్తులతో నింపడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఏఐవైఎఫ్ కార్యదర్శి ధర్మేందర్ మాట్లాడుతూ ఏజెన్సీని సమూలంగా ప్రక్షాళన చేయాలని కోరారు. పీవైఎల్ కార్యదర్శి ప్రదీప్ మాట్లాడుతూ ఆవుల అక్రమ రవాణాపై మాట్లాడే శ్రద్ధ ఉన్న బీజేపీ నాయకులకు లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబ సభ్యుల మనోవేదన వినిపించడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకురాలు చందన రెడ్డి, ఎస్ఎఫ్ఐ జాయింట్ సెక్రెటరీ అశోక్ రెడ్డి, హైదరాబాద్ అధ్యక్షులు లెనిన్, డీవైఎఫ్ఐ హైదరాబాద్ అధ్యక్షులు హష్మీ తదితరులు పాల్గొన్నారు.

హర్యానాలో మారుతున్న సమీకరణాలు

కాంగ్రెస్‌ను వీడనున్న కిరణ్ చౌదరి

బీజేపీలో చేరే అవకాశం

చండీగఢ్ : హర్యానాలో రాజకీయ సమీకరణాలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే కిరణ్ చౌదరీ.. హస్తం పార్టీని వీడి బీజేపీలోకి రానున్నట్టు సమాచారం. దీపేందర్ హుడా ద్వారా ఖాళీ అయిన హర్యానా రాజ్యసభ స్థానానికి కిరణ్ చౌదరిని బీజేపీ పోటీకి దించే అవకాశం కనిపిస్తున్నది. కొంత కాలంగా బీజేపీ ఆమెతో టచ్‌లో ఉన్నప్పటికీ పార్టీలో ఎలా వినియోగించుకోవాలన్నదానిపై మాత్రం నిర్ణయం తీసుకోలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రాజ్యసభ ఎన్నికల్లో ఆమెను పోటీకి దింపాలని నిర్ణయం తీసుకున్నారనీ, కాంగ్రెస్‌కు తగిన సంఖ్యాబలం లేనందున పోటీ చేసే అవకాశం లేదని చెప్పాయి.కిరణ్ చౌదరీ.. దివంగత బన్సీ లాల్ కోడలు, భివానీ-మహేంద్రగఢ్ లోక్‌సభ నియోజకవర్గంలోని తోషమ్ సెగ్మెంట్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహేంద్రగఢ్‌లో బీజేపీ అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తున్న సందర్భంగా ప్రధాని మోడీ బన్సీలాల్‌ను హర్యానాకు చెందిన 'వికాస్ పురుష్' అని కొనియాడారు. కాగా, ఇక్కడ కాంగ్రెస్ జాట్ ఓట్లను చీల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదనీ, ఆ ప్లాన్‌లో ఇప్పుడు కిరణ్ కూడా భాగమయ్యే అవకాశమున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

ఈవీఎం స్వతంత్ర వ్యవస్థ

దానిని అన్‌లాక్ చేయటానికి ఓటీపీ అవసరం లేదు

ముంబయి ఎన్నికల అధికారి వెల్లడి



ముంబయి : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)ను అన్‌లాక్ చేయటానికి వన్-టైమ్ పాస్‌వర్డ్ అవసరం లేదని ముంబయి వాయువ్య లోక్‌సభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారిని తెలిపారని పీటీఐ తెలిపింది. నియోజకవర్గం నుంచి కొత్తగా ఎన్నికైన ఎంపీ రవీంద్ర వైకర్ బంధువు జూన్ 4న ఈవీఎంను అన్‌లాక్ చేయటానికి ఓటీపీని జనరేట్ చేయటం కోసం ఓట్ల లెక్కింపు కేంద్రానికి ఫోన్‌ను తీసుకెళ్లినట్టు వచ్చిన వార్తాపత్రిక కథనంపై సదరు అధికారి స్పందించారు. " ఈవీఎం అనేది స్వతంత్ర వ్యవస్థ. దానిని అన్‌లాక్ చేయటానికి ఓటీపీ అవసరం లేదు" అని రిటర్నింగ్ అధికారి వందనా సూర్యవంశీ విలేకరుల సమావేశంలో చెప్పినట్టు పీటీఐ వివరించింది. "ఇది ప్రోగ్రామబుల్ కాదనీ, వైర్‌లెస్ కమ్యూనికేషన్ సామర్థ్యాలు లేవని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల రోజున కౌంటింగ్ కేంద్రానికి మొబైల్ ఫోన్ తీసుకెళ్లాడన్న ఆరోపణలపై వైకర్ బంధువు మంగేష్ పాండిల్కర్‌పై పోలీసులు బుధవారం కేసు నమోదు చేసిన విషయం విదితమే. మంగేశ్ పండిల్కర్‌పై కేసు నమోదైన తర్వాత పోలీసులు కౌంటింగ్ కేంద్రం నుంచి సెక్యూరిటీ కెమెరా ఫుటేజీని సేకరించారు. ఆ ప్రాంతంలోకి ఫోన్ తీసుకెళ్లేందుకు అతడికి అనుమతి లేదని విచారణలో తేలింది. జోగేశ్వరి అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన డేటా ఎంట్రీ ఆపరేటర్ దినేష్ గురవ్ వ్యక్తిగత ఫోన్ అనధికార వ్యక్తి వద్ద దొరికిందనీ, ఈ విషయంలో చర్యలు తీసుకుంటున్నామని సూర్యవంశీ చెప్పారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గానికి చెందిన వైకర్.. జూన్ 4న శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాక్రే)కి చెందిన అమోల్ కృతికర్‌ను ఓడించి ముంబై నార్త్-వెస్ట్ సీటును గెలుచుకున్నారు. తొలుత కృతికర్ గెలిచినట్టు కనిపించగా.. గెలుపు ఓట్ల తేడా తక్కువగా ఉన్నందున ఓట్లను రీకౌంటింగ్ చేయాలని వైకర్ డిమాండ్ చేశారు. ఈవీఎంలతో పోలైన ఓట్లను తిరిగి లెక్కించగా, వైకర్‌తో పోలిస్తే కృతికర్‌కు ఒక ఓటు ఎక్కువ ఉన్నట్టు తేలింది. అయితే, పోస్టల్ బ్యాలెట్లను మళ్లీ తనిఖీ చేయటం ద్వారా వైకర్ 48 ఓట్ల ఆధిక్యంలో నిలిచారు. దీంతో వైకర్‌ను చివరికి విజేతగా ప్రకటించారు. అయితే, ఫలితాల తర్వాత కృతికర్‌తో పాటు ఓడిపోయిన ఇతర అభ్యర్థులు కౌంటింగ్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు.

అన్ 'వాల్యూ ఎడ్యుకేషన్'

సంపాదకీయం

నాడు పాఠశాల విద్యలో గుణాత్మక మార్పుకు దోహదపడటమే ప్రధాన లక్ష్యంగా...కులమతాలకు అతీతంగా మానవతా విలువలకు పట్టంకట్టే 'వాల్యూ ఎడ్యుకేషన్'ను సృష్టించింది ఎన్సీఈఆర్టీ (జాతీయ విద్యా పరిశోధన మండలి). కానీ, నేడు అదే ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో అహేతుక మార్పులను తలపెడుతోంది. తాజాగా ఎన్‌సీఈఆర్‌టీ మార్కెట్‌లోకి విడుదల చేసిన 12వ తరగతి రాజనీతి శాస్త్రంలో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మార్పులు చేసింది. అయితే దీనిపై ఎన్సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీ స్పందిస్తూ.."దేశంలో గుజరాత్, బాబ్రీ సహా ఎన్నో అల్లర్లు జరిగాయి. వాటన్నింటిని విద్యార్థులకు ఎందుకు బోధించాలి. పెద్దయ్యాక ఎలాగు తెలుసుకుంటారు. ఏడాదికోసారి సిలబస్ సవరిస్తూ ఉంటాం. అది సహజ ప్రక్రియ. దానికెందుకింత గగ్గోలు" అని ప్రశ్నించారు. వాస్తవానికి తాజాగా సవరించిన పాఠ్యాంశాలే ఎక్కువ ప్రమాదకరంగా ఉన్నాయి. చరిత్రను వక్రీకరిస్తూనే వారి చర్యను సమర్థించుకున్న సక్లానీ వ్యాఖ్యలు విద్యావేత్తలను, మేధావులను మరింత నిర్ఘాంతపరుస్తున్నాయి.

1528లో మీర్ బాబరు బాబ్రీ మసీదును నిర్మించారు అని పూర్వ పాఠంలో ఉండగా, దానిని శ్రీరాముని జన్మభూమిలో 1528లో ఇది నిర్మాణమైందంటూ సవరించింది ఎన్‌సీఈఆర్‌టీ. బాబ్రీ మసీదు అని రాయాల్సి వచ్చిన చోట 'మూడు గుమ్మటాల కట్టడం' అని పేర్కొంది. అంతే కాదు అయోధ్య గురించి గతంలో నాలుగు పేజీలు ఉన్న పాఠాన్ని రెండు పేజీలకు కుదించింది. హిందువుల పూజల కోసం మసీదు తలుపులు తెరవాలని 1986లో ఫైజాబాద్ జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలు మత హింసకు దారితీశాయని పూర్వ పాఠంలో ఉండగా, దాన్నంతా దాదాపుగా తొలగించారు. ఆలయ నిర్మాణానికి అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పును పూర్తి పాఠంగా కొత్తగా చేర్చారు. ఇలా కత్తిరింపులు, కుదింపులు చేసి సవరించిన 12వ తరగతి రాజకీయ శాస్త్ర పాఠ్య పుస్తకం మార్కెట్‌లోకి రాగానే గగ్గోలు రేగింది. ప్రజల సులోచనాలను పగలగొట్టడం, వారి కళ్లకు గంతలు కట్టడం, మెదడుకు పదును పెట్టే అంశాలను తుడిచిపెట్టడం వంటివన్నీ అటువంటి ఏలికలకే సాధ్యం. విద్యార్థులను పరిపూర్ణ విజ్ఞాన వంతులుగా చేసే చదువును ఉత్తమ ప్రమాణాలతో తీర్చిదిద్దాల్సిన ఎన్సీఈఆర్‌టీ చాకచక్యం, ప్రభు పక్షపాతం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది.



'చరిత్రను విస్మరించే వారు చరిత్రను నిర్మించలేరు' అని అన్న బాబాసాహెబ్ అంబేద్కర్ మాటలు అక్షర సత్యాలు. గతకాలపు చరిత్రను తుడిచేసి, తమకనుకూలమైన చరిత్రను తిరగరాయించుకునే వాళ్లు నియంతలు. వీళ్లంతా హీన చరితులుగా కాలగర్భంలో కలిసిపోతారు. ఇది చరిత్ర చెబుతున్న పాఠం. చెరిపేస్తే చరిత్ర చెరిగిపోదు. చరిత్ర పునాది మీదనే వర్తమానం, భవిష్యత్తు కొనసాగుతుంది. ఈ భవిష్య గమనాలను తమ ఆలోచనల చుట్టూ తిప్పుకోవాలని ప్రయత్నిస్తున్న వాళ్లు గత కాలపు వాస్తవాలపై మసిపూసే పనికి పూనుకుంటున్నారని సక్లానీ వ్యాఖ్యలు మరోసారి రుజువు చేస్తున్నాయి.

ఇప్పటికే జాతిపిత మహాత్మాగాంధీ, విప్లవ వీరుడు భగత్ సింగ్ నిర్వహించిన జాతీయోద్యమ సంఘటనలను, వారి జీవిత విషయాలను సిలబస్ నుండి తొలగించింది. మనదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఏ పాత్రలేని బీజేపీ, సంఘ్ పరివారం, కీలక భూమిక పోషించిన వారిని చరిత్ర నుండి తొలిగించే పనికి సిద్ధమైంది. క్రమేనా హంతకుల చరిత్రను, ఉదాత్త నాయకులుగా సిలబసులో ప్రవేశపెట్టినా ఆశ్చర్యం పడవలసింది లేదు. విజ్ఞానం, సంస్కృతి, సంప్రదాయాలు ఆదాన ప్రదానాలతో భిన్నత్వంలో ఏకత్వంగా జీవిస్తున్న నేటి సమాజాన్ని మత ప్రాతిపదికన విడదీయాలన్న ఆలోచనలో భాగమే ఈ చర్యలన్నీ. ఈ వికృత చేష్టకు పాల్పడుతున్న వారి పన్నాగాలను పసికట్టి, పనిపట్టవలసివుంది!

విద్యలో కాషాయీకరణ, మతోన్మాద ధోరణులు పెరగడమంటేనే హీన సంస్కృతిని పెంచి పోషించడమే. ఒక ప్రగతిశీల రాజ్యం అవతరణకు శాస్త్రీయ దృక్పథం గల ప్రజలు అవసరం. అందుకే శాస్త్రీయ పురోగతిని సాధించడం మన రాజ్యాంగ లక్ష్యాలలో ఒకటిగా నిర్దేశించుకున్నాం. కానీ ఏడున్నర దశాబ్దాలుగా లక్ష్యానికి చేరువ కాలేకపోతున్నాం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగడం సమాజానికి ప్రమాదం. ఇలాంటి అనుచిత మార్పులు నాణ్యమైన విద్యా పునాదుల్లేని నవతరాన్ని తయారు చేస్తాయనడంలో సందేహం లేదు. అసత్యాలు, అర్ధసత్యాల్నే పాఠాలుగా నిర్ణయిస్తే సమకాలీన ప్రపంచంతో మన పిల్లలు ఎలా పోటీ పడగలరు? దేశ భవితకు చుక్కానులుగా ఎలా ఎదుగుతారు?

"నేడు భారతదేశం అజ్ఞానం, మత ఛాందసం, మతోన్మాదాల అగాధంలోనూ, అన్ని రకాల జడ పదార్థాల పూజల్లోనూ మునిగిపోయి ఉంది. ఈ గందరగోళ పరిస్థితి నుంచి దేశాన్ని ఏ శక్తి బయటపడేయగలదు? మన జీవితంలో ఇబ్బంది పెడుతున్న సమస్యలన్నింటినీ ఒక్క దెబ్బతో ఏ శక్తి పరిష్కరించగలదు? అంటే... అదే విజ్ఞాన శాస్త్రం" అని సర్ సి.వి.రామన్ చెప్పిన మాటలు అప్పటికంటే నేటి పాలకులు, ముఖ్యంగా ఎన్సీఈఆర్‌టీ బుర్రకు ఎక్కించుకోవాల్సిన అవసరం ఉంది.

> "నేడు భారతదేశం అజ్ఞానం, మత ఛాందసం, మతోన్మాదాల అగాధంలోనూ, అన్ని రకాల జడ పదార్థాల పూజల్లోనూ మునిగిపోయి ఉంది. ఈ గందరగోళ పరిస్థితి నుంచి దేశాన్ని ఏ శక్తి బయటపడేయగలదు? మన జీవితంలో ఇబ్బంది పెడుతున్న సమస్యలన్నింటినీ ఒక్కదెబ్బతో ఏ శక్తి పరిష్కరించగలదు? అంటే... అదే విజ్ఞాన శాస్త్రం" అని సర్ సి.వి.రామన్ చెప్పిన మాటలు అప్పటికంటే నేటి పాలకులు, ముఖ్యంగా ఎన్సీఈఆర్‌టీ బుర్రకు ఎక్కించుకోవాల్సిన అవసరం ఉంది.



కమ్యూనిస్టు పార్టీ తీర్చిదిద్దిన వ్యక్తి, తిరిగి తాను కమ్యూనిస్టు పార్టీని ఉన్నతంగా తీర్చేందుకు తన జీవితకాలాన్ని ధారపోయటమే రుణం తీర్చుకోవటమంటే! అప్పుడే ఆ జీవితానికి సార్థకత, సమాజానికి మేలూ కలుగుతాయి. అలాంటి వ్యక్తిత్వాలనే మనం స్మరించుకుంటాం. ప్రేరణ నింపుకుంటాం. అందుకు నిలువెత్తు ఉదాహరణ కామ్రేడ్ మోటూరు హనుమంతరావు. ఎమ్మెచ్ అని అందరం పిలుచుకుంటుంటే 'మెమరబుల్ హ్యూమనిస్టు' నిఖార్సయిన కమ్యూనిస్టు మదిలో కదలాడుతాడు. కమ్యూనిస్టులు చేయలేని పనంటూ ఏదీ ఉండదు. అలసిన బిడ్డను ఎత్తుకోవడం నుండి సామాన్య కార్యకర్తను ఓదార్చేవరకు, చట్టసభలో గళమెత్తడం నుంచి అజ్ఞాతంలోనూ అలుపెరుగని పోరాటపు ధీరత్వం వరకూ అన్నీ చేస్తాడు. ఎం.హెచ్.లో అవన్నీ చూస్తాము. ఉద్యమాలకు మార్గదర్శిగా అతివాద, మితవాద అన్యధోరణులను ఎండగట్టిన సైద్ధాంతిక నిబద్ధుడాయన. అంతేకాదు, అక్షరాల రూపశిల్పిగా ప్రజాగొంతుకను ప్రతిధ్వనింపజేసిన రచనాకోవిదుడు. ప్రజలను చైతన్యపరిచిన మహా వక్త. నిరతము ఉద్యమ ఆలోచనకు పదునుపెట్టినకర్త. ఆయనను తలుచుకుంటే మనస్సునిండా చైతన్యం ప్రవహిస్తుంది! అందుకే వర్ధంతి రోజున ఈ స్మరణ.

ఘాటైన సమాధానం

కామ్రేడ్ సుందరయ్య అస్తమించిన తర్వాత జలగం వెంగళరావు మాట్లాడుతూ సుందరయ్య లేరు గనుక మార్క్సిస్టు పార్టీ పని అయిపోయిందని, అల్ప సంతోషం పొందారు. అందుకు కామ్రేడ్ యం.హెచ్ ఎలా ఘాటైన సమాధానం చెప్పారో చూడండి! "ఏకో నారాయణ అంటూ పదవుల కోసం కుక్షింభరులవలే ఏ ఇందిరాగాంధీనో, రాజీవ్ గాంధీనో పట్టుకొని వేలాడడం కంటే పరమార్థం లేని వెంగళరావుకు, ఆయన పార్టీకి అంతకు మించి బుర్ర పని చేయదు. కనుచూపు ఆనదు. కామ్రేడ్ సుందరయ్య గారు లాంటి మహా పురుషుడు ఆశించింది, నిర్మించిందీ తన చుట్టూ తిరిగే పార్టీని కాదు. మార్క్సిజం, లెనినిజం అన్న మానవాళి విముక్తి సిద్ధాంతాన్ని, విశ్వసత్యాన్ని, అంతర్జాతీయతను ఆయన శిరోధార్యంగా భావించి ఈ పార్టీని నిర్మించడానికి దోహదం చేశాడు. ఆయన ఆశయం పోయేది కాదు. ఆయన పార్టీ పోయేది కాదు. ఆయన ఒక వ్యక్తి కాదు, ఉద్యమం. నాటికీ, నేటికీ, భవిష్యత్‌కు అదే అనుసరణీయం."

- పాటూరు రామయ్య

విప్లవజ్వాల

తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం ఒక పరీక్ష. ఆ పోరాటంలో దెబ్బలకు దడిచి రహస్యాలు చెప్పి పార్టీకి నష్టం కల్గించే వాళ్ళను ఆయన క్షమించలేదు. వారిని పార్టీలోకి తీసుకోమని (నాటి) కేంద్ర కంట్రోల్ కమిషన్ చెప్పినా ఫార్మల్‌గా తీసుకున్నా అటువంటి వారిని పరాయి వారుగానే చూసేవారు. గడ్డు పరీక్షలకు నిలువలేని వాడు విప్లవకారుడు కాలేడు. ఆ విశ్వాసమే చివరి వరకు ఆయన దృక్పథంలో మెదిలేది. మార్క్సిజం యొక్క స్వచ్ఛతని, సత్యాన్ని ఆయన పాటించేవారు. మూడో పేజీలోని సంపాదకీయాలు - వజ్రపు తునకలు, పోరాట జ్వాలలు, సైద్ధాంతిక వేదికలు. ఆ పేజీ కోసమే ప్రతి ఒక్కరు ఎదురుచూసేవారు, చదివేవారు. వాడి వేడి పదజాలంతో సంపాదకీయాలు ఉండేవి. ఆ ఘనత సంపాదకుడైన ఎంహెచ్‌దే. ఆ పదునైన భాష, రాజకీయ విజ్ఞత అనితర సాధ్యం. ఆయన దీర్ఘకాలం జైళ్ళలో గడిపారు. కాల్పులకు గురైనారు. అయినా విప్లవజ్వాల మరింత ప్రజ్వరిల్లిందేగాని వారి విప్లవ స్థైర్యాన్ని చెక్కుచెదరనివ్వలేదు.

- నండూరి ప్రసాదరావు

కనిపించని కళాకారుడు, సాహితీవేత్త

వర్గ నైశిత్యం, రాజకీయ పరిణతి, వాస్తవిక దృక్పథం ఇవన్నీ కలిస్తే కామ్రేడ్ ఎం.హెచ్. ఆశయం, అక్షరం, ఆచరణ, అనుభవం అన్నీ కలగలసిన అరుదైన నాయకుడు ఎం. హెచ్. ప్రత్యక్ష రాజకీయాలలో క్రియాశీల పాత్ర వహిస్తూనే ప్రతి అక్షరాన్ని ప్రత్యర్థులపై పిడుగుపాటుగా, కార్యకర్తల అవగాహనకు వెలుగుబాటగా మలచిన మహాశిల్పి ఎం.హెచ్. తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ వైభవ ప్రాభవాలకు విచ్ఛిన్నాలకు, పునరుజ్జీవానికి సాక్షీభూతంగా నిలిచిన నిన్నటి తరం నేత, నేటి తరం మార్గదర్శి ఎం.హెచ్.

కార్మికవర్గ పోరాటం అనేక రంగాలలో జరుగుతుందని అందులో అతి భీషణ భాగం సైద్ధాంతిక రంగంలో వుంటుందని లెనిన్ అంటారు.. దీర్ఘకాలంపాటు అజ్ఞాతవాసాలు, కారాగృహక్లేశాలు అనుభవించి కాకలుతీరిన కామ్రేడ్ ఎమ్.హెచ్. పాలకవర్గాలపైనా మితవాద, ఉగ్రవాద విచ్ఛిన్నాల పైనా సైద్ధాంతికంగానూ అంతే తీవ్రంగా పోరాడారు. అన్యవర్గ సిద్ధాంతాల బండారం కళ్లకు కట్టి చూపారు గనకే రెండు మహావిచ్ఛిన్నాల తర్వాత కూడా రాష్ట్రంలో పార్టీ పునాదులు కాపాడగలిగారు. పార్టీ రాజకీయ కర్తవ్యాలను, పత్రికా ధర్మాలను ఎలా సమతుల్య పరచాలనే దానిపై ఆయనకు ఎప్పుడూ స్పష్టత వుండేది.

ఎం.హెచ్ కనిపించని కళాకారుడు. తెలుగు సాహిత్య సాంస్కృతిక పునర్వికాసానికి కమ్యూనిస్టుపార్టీ జరిపిన కృషిలో ఆయన ఒక ముఖ్యపాత్రదారి. మిక్కిలినేని, నాజర్, సాలార్, కర్నాటి తదితర సీనియర్ కళాకారులందరి రచనల్లో ఆయన ప్రస్తావన కనిపిస్తుంది.

దిగంబర కవిత్వంపైనా, విరసం పైనా ఆయన విశ్లేషణలు అందరికీ తెలిసినవే. ప్రజానాట్యమండలి పునరుద్ధరణలో ముఖ్యపాత్ర వహించిన ఎం.హెచ్ సదా దానికి సలహాలు సూచనలు చేస్తుండేవారు. రచనా శక్తి, కళాత్మక ప్రతిభ కలవారు ఎవరు కనిపించినా కనిపెట్టి ప్రోత్సహించేవారు. ఉదయంగారు కూడా బుర్రకథలు చెప్పడం యాదృచ్ఛికం కాదు.

- తెలకపల్లి రవి

ఆచరణ, అన్వయింపు

1952లో అవిభక్త మద్రాసురాష్ట్ర శాసనసభకు గుంటూరు జిల్లా రేపల్లె నియోజకవర్గంలో అప్పటి మంత్రి కల్లూరి చంద్రమౌళిని ఓడించి ఎన్నికైన నాటి నుండి ఇటీవల రాజ్యసభ సభ్యత్వం పూర్తయ్యేవరకూ చట్ట సభలలోనూ, కార్యక్షేత్రంలోనూ, పత్రికలలోనూ ఈ సిద్ధాంతాలను బోధించడం ఆచరించడం, అన్వయించడమే దినచర్యగా దాదాపు 53 సంవత్సరాలు గడిపిన ఎంహెచ్ తొలితరం కమ్యూనిస్టు నాయకులలో ఒకరు.

- వార్త సంపాదకీయం (20.06.2001)



23వ వర్ధంతి

కొత్తతరం నిర్మాత

మోటూరు హనుమంతరావు సంపాదకులుగానే కాదు ప్రముఖ రచయిత, అనువాదకులు, రాజకీయ విశ్లేషకులు అన్నింటికన్నా మించి స్వార్థరహిత రాజకీయ నాయకులు. ఆర్గనైజర్ కూడాను. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా విచ్ఛిన్నాలను ఎదుర్కొని పార్టీని నిలబెట్టారు. పార్లమెంటేరియన్‌గా ప్రజల తరుపున అసెంబ్లీ, పార్లమెంట్‌లో పోరాడారు. కళలు, సాహిత్యంపై ఆయనకు తిరుగులేని పట్టు ఉంది. ఆ విధంగా విభిన్న రంగాల్లో ఆరితేరిన సవ్యసాచి విప్లవోద్యమాల నిర్మాణంలో కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుల్లో ఒక్కరు.

సంపాదకుడిగా జర్నలిస్టు రంగంలో అనేక మంది 'యువతీ యువకులను ఆయన ప్రోత్సహించారు. ప్రజాశక్తి దినపత్రికగా మారిన తర్వాత విద్యార్థి రంగంలో ఉన్న అనేక మంది కార్యకర్తలను గుర్తించి వారిని సంపాదకవర్గంలోకి తీసుకుని నిపుణులుగా మారేలా పదునుపెట్టారు. ఇప్పటి వరకు సంపాదకులుగా బాధ్యతలు నిర్వహించిన పాటూరు రామయ్య, వి ఆర్ బొమ్మారెడ్డి, ఎస్.వినయ కుమార్, తెలకపల్లి రవి, ఎస్.వెంకట్రావు లాంటి ఎందరో ఆయన మార్గదర్శకంలో రాటుతేలిన వారే. ఎమ్.హెచ్‌ను సన్నిహితంగా ఎరిగిన అనేకమంది జర్నలిస్టుల గుండెల్లో ఆయన ఇప్పటికీ సజీవంగా ఉన్నారు.. ముఖ్యంగా వారికి ఆత్మవిశ్వాసం కల్పించి నిలబెట్టడంలో ఆయన పాత్ర వెలలేనిది. తప్పులు చేస్తే సున్నితంగా మందలించేవారు.. కార్యకర్తలు, సిబ్బందిపట్ల ప్రేమాభిమానాలు ప్రదర్శించేవారు. చిన్నా పెద్దా తేడాలేకుండా అందరితో సన్నిహితంగా మెలిగేవారు.

- వి. శ్రీనివాసరావు

కమ్యూనిస్టు రచయితగా, సంపాదకులుగా...

1948లో కార్యదర్శివర్గ సభ్యుడైనప్పటి నుండే ఎంహెచ్ తీర్మానాలు, డాక్యుమెంట్లు, ప్రకటనల ముసాయిదాలను తయారుచేసే బాధ్యత చేపట్టారు. స్టాలిన్ యుగంవంటి పుస్తకాలను అనువదించారు. 1948లో ప్రజాశక్తి నిషేధానికి గురైన తర్వాత ప్రారంభమైన జనతా పత్రికకు తొలి సంపాదకీయాన్ని ఎంహెచ్ రాశారు. తరువాత ఆయనే జైల్లో పడ్డారు. 1953 జూన్‌లో తణుకులో జరిగిన పార్టీ రాష్ట్ర మహాసభ కామ్రేడ్ ఎంహెచ్‌ను రాజకీయ సంపాదకునిగా ఎన్నుకొన్నది. ఆ విధంగా ఆనాటి నుండి వారపత్రికలైనా, దినపత్రికలైనా అవి ఎంహెచ్ పేర నడచినా నడవకపోయినా, ఆయన జైల్లో వున్నా, రహస్యంగా వున్నా, శాసనసభ్యుడిగా వున్నా, పార్టీ కార్యదర్శిగా వున్నా విశాలాంధ్రకు, జనశక్తికి, ప్రజాశక్తికి రచనలు చేస్తూ, సంపాదకీయాలు రాస్తూ వచ్చారు. విశాలాంధ్ర సంపాదకుడిగా వుంటూనే పార్టీలో రివిజనిజానికి వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటం జరిపారు. ఆ పోరాట ఫలితం సంపాదకులుగా ఆయన పనికి కూడా తీవ్రమైన అంతరాలు కలుగజేసింది... భారత్-చైనా సరిహద్దు ఘర్షణలు సందర్భంగా అరెస్టయిన తర్వాత 1963లో జైలునుండి బయటకు వచ్చిన ఎంహెచ్ సంపాదకత్వంలో జనశక్తి పత్రిక ప్రారంభమైంది. పార్టీలో ప్రారంభమైన ఉగ్రవాదం జనశక్తిని కూడా తన్నుకుపోవడంతో ఎడాపెడా ధోరణులను అధిగమించి ప్రజల వర్గపోరాట సాధనంగా మళ్ళీ ప్రజాశక్తిని 1968 జూలై 27న వార పత్రికగా పునరుద్ధరించారు. పార్టీ కార్యదర్శిగానే వుంటూ ప్రజాశక్తి వారపత్రికలో ఎంహెచ్ "కంచుకాగడా", "పలుకులూ ములుకులు", "తీరుతెన్నులు" వంటి శీర్షికలతో అనేక వ్యాసాలు, వ్యాఖ్యానాలు రాశారు. సైద్ధాంతిక విషయాలపై ఆయన రాసిన సంపాదకీయాలు కరకుకరవాలాల్లా వర్గ శతవులను చీల్చి చెండాడేవి. గుంటూరు జిల్లా కార్యదర్శి బాధ్యతల్నుంచి పొలిట్ బ్యూరో సభ్యత్వం వరకు వివిధ కీలక బాధ్యతలు నిర్వహించిన కామ్రేడ్ ఎంహెచ్‌కు ప్రజాప్రతినిధిగాను అపారమైన అనుభవం ఉండడం అరుదైన విశేషం. 1952 - 55 మధ్య ఎమ్మెల్యేగా 1978 - 84 మధ్య శాసనమండలి సభ్యుని గాను 1988 - 94 మధ్య రాజ్యసభ సభ్యునిగాను ఆయన ప్రతిభావంతంగా కృషి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలోనూ, మితవాద అతివాద పోకడలనుండి పార్టీని రక్షించుకోవడంలోనూ పార్టీ పత్రికను, రచనా వ్యాసాంగాన్ని సాధనంగా చేసుకుని అనేక చారిత్రక మూలమలుపుల్లో పార్టీ కేడర్లో సైద్ధాంతిక అవగాహన కల్పించడంలోనూ ఎంహెచ్ చూపిన నైపుణ్యం, చొరవ, పట్టుదల ఆయన త్యాగపూరితమైన, క్రమశిక్షణాయుతమైన జీవితం నేటికీ ఏనాటికీ ఆదర్శప్రాయం. ఆయన చూపిన బాటలో చివరి వరకు పయనించడమే ఎం.హెచ్‌కు మనమిచ్చే నిజమైన నివాళి.

- ఎస్. వెంకట్రావు

రాజీపడని మానవీయుడు

ఎట్టి పరిస్థితుల్లోనూ తాను సరైనదని నమ్మిన మార్గాన్ని విడిచిపెట్టకుండా తన బాధ్యతలను నిర్వర్తించడమే గాక పార్టీ శ్రేయోభిలాషుల్లో ఆత్మవిశ్వాసాన్ని కలిగించి విప్లవ కారునిగా, అందులో సంపాదకునిగా తన బాధ్యతలు ఆదర్శవంతంగా నిర్వహించి అభిమాన పాత్రులయ్యారు. మహాత్ముల గురించి ఒక మాట చెపుతూంటారు. అవసరం వచ్చినప్పుడు శరాఘాతంగా మాట్లాడాలి. అలాగే అవసరమైనప్పుడు కుసుమ కోమల స్పర్శతో ఒప్పించే ప్రయత్నమూ చేయాలి. ఆ రెండూ హనుమంతరావు గారి రచనల్లో ఆసక్తి గల వారు సులువుగానే గ్రహించవచ్చు. అంటే వివాదాల్లో నిక్కచ్చిగా, రాజీపడని పద్ధతుల్లో నడుస్తూ వ్యక్తిగత సంబంధాల్లో ఆత్మీయతకు, అనురాగాలకు అవకాశం కల్పించడం కూడా మానవీయ నైజం.

- సి. రాఘవాచారి

తుదివరకూ పోరాటం

ఏ ప్రజల శ్రమమీద మనం ఇంతగా ఎదిగామో, వారి రుణం తీర్చుకోవాలన్న జ్ఞానం మామూలు మనుషులకి చాలా ఆలస్యంగా కలగొచ్చు. కానీ అసాధారణ మానవులకు మాత్రం విద్యార్థి దశ నుండే ప్రజలందరికీ సుఖశాంతులనిచ్చే వ్యవస్థ కావాలనే ఆరాటం మొదలవుతుంది. మరో ప్రపంచ నిర్మాణం కోసం ఓ యోధుడిగా పోరాడాలనే గమ్యం ఏర్పడుతుంది. అలాంటి గమ్యం ఏర్పరచుకున్నా - తుదికంటా అందరూ నిలబడలేరు. వివిధ కారణాలవల్ల ప్రయాణం నుండి పక్కకు తప్పుకుంటారు. జీవితాంతం తాను నమ్మిన ఆశయం కోసం ప్రయాణం చేసేవారే ధన్యజీవులు. వయసు మీద పడిపోతుందికదా ఇంక రిటైర్ అవకూడదా అని అడిగితే "ఉద్యోగులకు రిటైర్‌మెంట్ ఉంటుంది. కాని ఆశయాలకూ, ఆచరణకూ, నిబద్ధతకూ రిటైర్‌మెంట్ వుండదు. ఓపికున్నంత వరకూ ప్రజల కోసం పనిచేయటంలోనే విశ్రాంతి వుంది. ఇదే మాకు ఆనందం కూడా" అన్నారు. అయితే తుది క్షణం వరకూ ప్రజల కోసం ఆరాటపడటం అనేది ప్రజల మనుషులకే సాధ్యపడుతుంది.

- పి. చంద్రశేఖర్ ఆజాద్

విలీనం వద్దు..!

- ఉమ్మడి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 21 మున్సిపాలిటీలను.. గ్రేటర్‌లో విలీనం చేసేందుకు యత్నం
- ఉన్నవాటిని యథాతథంగానే ఉంచాలంటున్న ప్రజలు
- ఇప్పటికే సౌకర్యాలు లేవు.. భారాలతో చస్తున్నామని ఆవేదన
- మున్సిపాలిటీల కేంద్రీకరణతో అభివృద్ధికి దూరమయ్యే ప్రమాదం
- కలిపే ఆలోచన వద్దంటున్న రాజకీయ పార్టీల నేతలు

మున్సిపాలిటీల విలీనం ప్రజల సంక్షేమానికి విఘాతం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

గ్రేటర్ హైదరాబాద్‌ను విస్తరిస్తూ.. ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం ఇటీవల ప్రణాళికలు రూపొందించింది. గ్రేటర్ హైదరాబాద్ ఆదాయాన్ని ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతంలోని మున్సిపాలిటీల అభివృద్ధికి వినియోగించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజానీకం మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేయొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే గ్రామాలుగా ఉన్న తమ ఊర్లను మున్సిపాలిటీలుగా మార్చి తమపై పన్నుల భారం మోపారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పుడు మున్సిపాలిటీలను గ్రేటర్‌లో కలిపితే పట్టణ అభివృద్ధి విషయం పక్కనపెడితే.. తమ జీవన స్థితిగతులు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రతిపక్షాలు సైతం మున్సిపాలిటీల విలీనంపై వస్తున్న వాదనాలను వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలను ప్రోత్సహించొద్దని డిమాండ్ చేస్తున్నారు. అధికార పార్టీనేతలూ ప్రభుత్వ ఆలోచన కరెక్టు కాదన్న అభిప్రాయంలో ఉన్నారు.

నగర శివారులోని ఏడు కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు రెడీ అయినట్టు తెలుస్తోంది. ఈ మేరకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. గ్రేటర్ విస్తీర్ణంపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టారు.

ఈ నేపథ్యంలోనే పురపాలక శాఖ, జీహెచ్ఎంసీలపై మూడు నెలల క్రితం సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగు రోడ్డు లోపలున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు భౌతిక స్థితిగతులపై నివేదికలు అందజేయాలని గతంలోనే సంబంధిత అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అయితే లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో ఆ పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఎన్నికల ముగియడంతో మున్సిపాలిటీల విలీనం మళ్లీ తెరపైకి వచ్చింది. కాగా, ఇటీవల సంబంధిత అధికారులు విలీనంపై ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. దీని ఆధారంగా సోషల్ మీడియాలో, వార్తా పత్రికల్లో వస్తున్న కథనాలతో అటు ప్రజల్లోనూ, రాజకీయ పార్టీ నేతల్లోనూ గందరగోళం నెలకొన్నది.

కలపడం పై తర్జనభర్జలను

శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలను విలీనం చేయడంతో పాటు మణికొండ లేదా నార్సింగిలో సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించాలన్న ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. జల్‌పల్లి, శంషాబాద్, తుక్కుగూడ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్‌లో వీటితోపాటు బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌ను విలీనం చేయనున్నారు. ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం, పెద్దఅంబర్‌పేట్, తుర్కయంజాల్ మున్సిపాలిటీలు, బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లను ఎల్బీనగర్ జోనల్ పరిధిలో కలుపనున్నట్టు తెలుస్తోంది.



సమస్యలపై ఫిర్యాదులకే దిక్కులేదు..

రంగారెడ్డి జిల్లాలో 16 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందుల్లో కొన్ని జీహెచ్ఎంసీ పరిధి దాటిన వెంటనే ఉన్న శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కొన్నింటికి మాత్రమే ప్రస్తుతం వివిధ మార్గాల ద్వారా ఆదాయం లభిస్తోంది. నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలు, జవహర్‌నగర్, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్లు మాత్రమే ఫైనాన్షియల్‌గా నిలదొక్కుకుంటున్నాయి. నగర శివారులోని ఇబ్రహీంపట్నం, శంషాబాద్, తుర్కయంజాల్, ఆదిభట్ల మున్సిపాలిటీలతో పాటు బడంగ్‌పేట్, మీర్‌పేట్, కార్పొరేషన్లు నిధులలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరికొన్ని మున్సిపాలిటీలు స్ట్రీట్ లైట్ల బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నాయి. రహదారులు సక్రమంగా లేవని తుక్కుగూడ, శంషాబాద్, ఆదిభట్ల మున్సిపాలిటీలు, మీర్‌పేట్, బండ్లగూడ జాగీర్, బడంగ్‌పేట్‌ల్లోని ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. ఇలాంటి పరిస్థితిల్లో మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేస్తే ఈ సమస్యలను పట్టించుకునే దిక్కు ఉంటుందా అని ఆందోళన చెందుతున్నారు. పాలనా సౌలభ్యం ఉన్న పరిస్థితిలోనే సమస్యలు ఇలా ఉంటే.. జీహెచ్ఎంసీలో విలీనమైతే ఇక అంతే సంగతులని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కోల్పోయే ప్రమాదం

మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేస్తే... శ్రామిక నిరుద్యోగంతో పాటు రాజకీయ నిరుద్యోగం కూడా పెరిగే అవకాశం ఉందని ప్రతిపక్షాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. గ్రేటర్ విలీనంలో ఒక్కో మున్సిపాలిటీలో ఒకటి లేదా రెండు కార్పొరేటర్ స్థానాలు దక్కే అవకాశం ఉంటుంది. దాంతో ఎక్కువ మందికి ప్రాతినిధ్యం దక్కే అవకాశం లేదని రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఎక్కువ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉన్నందున అందుబాటులో ఉండి పనులు చేయగులుగుతున్నామని పలువురు కార్పొరేటర్లు చెబుతున్నారు. విలీనమైతే ఒకరికో, ఇద్దరికో పదవులు దక్కుతాయని, మిగతా వారంతా ఏమైపోవాలంటూ ప్రశ్నిస్తున్నారు. కలిపే ఆలోచన మానుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం అన్ని కోణాల్లో ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాగ్దానాలను వెంటనే అమలు చేయాలి

- ఒకేసారి రుణమాఫీ చేయాలి
- గ్యారంటీల విషయంలో పోరాటాలు నిర్వహిస్తాం : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-చిట్యాలటౌన్

కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికలకు ముందు వాగ్దానం చేసిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ కేంద్రంలోని స్థానిక మేకల లింగయ్య భవనంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు లేవనే సాంకేతిక కారణాలు చూపి అమలు చేయడం లేదని అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో చేసిన తప్పులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేయకుండా రెండు లక్షల రుణమాఫీని ఒకేసారి అమలు చేయాలని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసాను అమలు చేయాలని, వడ్లకు దొడ్డు, సన్నాలు అని తేడా లేకుండా క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణాల వల్ల మహిళలు పడే ఇబ్బందులు అధిగమించడానికి బస్సుల సంఖ్యను పెంచి అన్ని స్టాపుల్లో బస్సులు ఆపాలని సూచించారు.

ప్రజల ఆగ్రహానికి గురి కాకముందే మౌలికపరమైన సమస్యలను పరిష్కరించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే రాబోయే రోజుల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, నాయకులు శీల రాజయ్య, చంద్రమౌళి ఉన్నారు.



'నీట్'పై మోడీ నోరు విప్పాలి

- కృష్ణానది నీటి వాటాలు తేల్చాలి :సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-పెన్‌పహాడ్

నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై ప్రధాని మోడీ నోరు విప్పాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌పై నీట్ అవకతవకలు నీలి నీడలను కమ్మాయన్నారు. రాష్ట్రం విడిపోయి పదేండ్లు గడచినా కృష్ణా నది నీటి వాటాలు తేల్చడం లేదని, న్యాయంగా తెలంగాణకు రావాల్సిన నీటిని అందించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం శ్రామికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదన్నారు. దేశాన్ని కార్పొరేట్ల చేతిలో పెట్టి సామాన్య ప్రజలను లూటీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టుల్లో.. విద్యుత్ కొనుగోలు విషయంలో పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సమగ్ర విచారణ జరపడానికి జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే దానిని కేసీఆర్ వక్రీకరించడం సరికాదని, న్యాయవ్యవస్థను ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని అన్నారు. మెదక్‌లో మత ఘర్షణలకు తావివ్వకుండా.. ఇటీవల జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని, ఏకకాలంలో రుణమాఫీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, నాయకులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, వీరబోయిన రవి, వేల్పుల వెంకన్న, మండల కార్యదర్శి రణపంగ కృష్ణ తదితరులు ఉన్నారు.

నేడు పీజీఈసెట్ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంఈ/ఎంటెక్‌తోపాటు ఎంఫార్మసీ, ఎంఆర్క్, ఫార్మా-డీ(పీబీ) కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఈనెల 10 నుంచి 13 వరకు నిర్వహించిన పోస్టు గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్) రాతపరీక్షల ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాద్‌లోని జేఎన్టీయూ హైదరాబాద్‌లో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, జేఎన్టీయూహెచ్ వీసీ బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జేఎన్టీయూహెచ్ రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు విడుదల చేస్తారని పీజీఈసెట్ కన్వీనర్ ఎ అరుణకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఈసెట్‌కు రాష్ట్రవ్యాప్తంగా 22,712 మంది దరఖాస్తు చేయగా, వారిలో 20,626 (90.82 శాతం) మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు.

రేపు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాక

- 'సెల్యూట్ తెలంగాణ' పేరుతో భారీ ర్యాలీ : డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర మంత్రులుగా పదవులు స్వీకరించిన తర్వాత బుధవారం తొలిసారి జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తెలంగాణకు రాబోతున్నారనీ, వారి రాకను పురస్కరించుకుని సెల్యూట్ తెలంగాణ పేరుతో బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు భారీ నిర్వహిస్తామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ ర్యాలీలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ముఖ్యనేతలు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణలో 8 ఎంపీ సీట్లను గెలిపించినందుకు తెలంగాణ ప్రజలకు, రాష్ట్రానికి రెండు మంత్రి పదవులు కేటాయించిన మోడీ సర్కారుకు కృతజ్ఞతలు తెలిపేందుకు అదే రోజు రాష్ట్ర కార్యాలయం వద్ద అభినందన సభను నిర్వహిస్తామన్నారు. కేంద్ర మంత్రులకు స్వాగతం పలికేందుకు రాష్ట్రంలోని ఏడు మోర్చాల కమిటీలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయని చెప్పారు. సభ అనంతరం మంత్రులు భాగ్యలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహిస్తారన్నారు. తెలంగాణలో 88 ఎమ్మెల్యే సీట్లు దక్కించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

- ధాన్యం కొనుగోళ్ల తరహాలో చేనేత వస్త్రాల కొనుగోళ్లు ఉండాలి
- చేనేతను నిర్వీర్యం చేసిన కేంద్రం : చేనేత సంఘం రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు శాంతికుమార్, మురళీధర్



నవతెలంగాణ -నల్లగొండ

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, వాటిని బలోపేతం చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వనం శాంతికుమార్, గంజి మురళీధర్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి చూపిస్తున్న చేనేత రంగాన్ని కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాలు ప్రకటించకపోగా కాస్తో కూస్తో చేనేతకు ఉపయోగపడే హ్యాండ్లూమ్ బోర్డును, పవర్‌లూమ్ బోర్డును, మహాత్మాగాంధీ బున్కర్ యోజన పథకాన్ని రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత రంగంపై జీఎస్టీ విధించి మరింత ఇబ్బందులకు గురిచేసిందన్నారు. 2013 ఫిబ్రవరిలో జరిగిన సహకార సంఘాల ఎన్నికల ఐదు సంవత్సరాల కాలపరిమితి ముగిసినా.. ఎన్నికలు జరపకుండా పర్సనల్ ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలలకు ఒకసారి పర్సనల్ ఇన్‌చార్జీల నియామకాన్ని పొడిగించుకుంటూ ఇప్పటికి తొమ్మిది సార్లు పొడిగించడం వల్ల సహకార సంఘాలు నిర్వీర్యమైపోతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్ని సహకార సంఘాలకు బడ్జెట్లో నిధులు కేటాయించి సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సహకార సంఘాల, మాస్టర్ వీవర్స్ దగ్గర కోట్లాది రూపాయల విలువ కలిగిన వస్త్రాల నిల్వలు పేరుకుపోయా యని, మగ్గాలు నడపలేక చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాల తరహాలోనే చేనేత వస్త్రాల కొనుగోళ్లను ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్ ఫండ్, చేనేత మిత్ర పథకాలకు నిధులు కేటాయించి షరతులు లేకుండా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫారాలకు చేనేత వస్త్రాలు అందజేసి కార్మికులకు పని కల్పించి ఆదుకోవాలని కోరారు. చేనేత కార్మికులకు వర్క్ షెడ్‌తో కూడిన ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. చేనేత సహకార సంఘాలకు, చేనేత కార్మికుల బ్యాంకు రుణాలు మాఫీ చేసి వెంటనే 80 శాతం సబ్సిడీ ద్వారా రూ.2లక్షల రుణాలు ఇవ్వాలని కోరారు. చేనేత రంగ అభివృద్ధికి బడ్జెట్లో రూ.2000 కోట్లు కేటాయించి ఖర్చు చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, చేనేత కార్మిక సంఘం నాయకులు రాపోలు రాములు, రాపోలు వెంకన్న, కర్నాటి శ్రీరంగం, గడ్డం దశరథ, వలిగొండ మధు, బొల్లు రవీంద్ర కుమార్, శివ తదితరులు ఉన్నారు.

రైతులకు చేరువయ్యేలా భూ పరిపాలనలో మార్పు తేవాలి

- కొత్త మండలాల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి
- తహశీల్దార్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానం :రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటికి వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతులకు మరింతగా చేరువయ్యేందుకు భూ పరిపాలనలో సమగ్రమైన మార్పులు తేవాలని తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని టీజీటీఏ కార్యాలయంలో సోమవారం ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో తహశీల్దార్లు ఎదుర్కొంటున్న సమస్యలు, ధరణి, భూ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ పూర్వ వీఆర్ఏ, వీఆర్ఓల న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులను చిన్నాభిన్నం చేసిన జీఓ నం.317ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానానికి స్వస్తి పలికి పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తేవాలన్నారు. అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు దూర ప్రాంతాలకు బదిలీ అయిన తహశీల్దార్లు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ ఇబ్బందులు పడుతున్నారనీ, వీరిని పూర్వ స్థానాలకు బదిలీ చేయాలని కోరారు. రెవెన్యూ శాఖలో పని చేస్తున్న అర్హులైన తహశీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అద్దె వాహనాల ఛార్జీలను పెంచడంతో పాటు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలనీ, కొత్తగా ఏర్పడ్డ మండలాల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని మంత్రికి విన్నవించారు. రెవెన్యూ శాఖలో అధికారాల వికేంద్రీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. భూవివాదాల సత్వర పరిష్కారం కోసం రెవెన్యూ కోర్టులు, అప్పిలేట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శులు రమేష్ పాక, అరేటి రాజేశ్వర్, సెక్రటరీ జనరల్ పూల్ సింగ్ చౌహాన్, మహిళా విభాగం అధ్యక్షురాలు పి.రాధ, కోశాధికారి శ్రీనివాస్ శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే మెదక్‌లో సంఘ్‌పరివార్ దాడులు

- అల్లర్లకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి
- బాధితులకు ఆర్థిక సహాయం అందించాలి : అవాజ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బక్రీద్ సందర్భంగా మెదక్‌లో పథకం ప్రకారమే సంఘ్ పరివార్ మూకలు మత కలహాలు సృష్టించి అల్లర్లకు పాల్పడ్డారని అవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి దాడుల మూలంగా ముస్లింలు ఆస్తులతో పాటు వారి జీవనాధారాలను ధ్వంసం చేశారని తెలిపారు. అల్లర్లకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవనోపాధి కోల్పోయిన వారికి ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బక్రీద్ ముందు నుంచి గోరక్షక దళాల పేరుతో ముస్లింలపై దాడులు చేయటానికి సంఘ్ పరివార్ ప్రణాళికలు రూపొందించుకున్నదని తెలిపారు. అందులో భాగంగానే ముస్లింల దగ్గర ఉన్నవి ఆవులు కావు, మగపశువులే అని పశువుల డాక్టర్లు, పోలీసులు చెప్పారనీ, వాటిని కూడా గోశాలకి తరలిస్తామని పోలీసులు చెప్పారనీ, అంతటితో ఆగితే విధ్వంసం అల్లర్లు జరిగేవి కాదని పేర్కొన్నారు. సంఘ్ పరివార్ లక్ష్యం గోవులను రక్షించడం కాదనీ, అల్లర్లు సృష్టించడమేనని స్పష్టం చేశారు. ఆ మూకలు కావాలనే మదర్సాల్లోకి, ముస్లింల ఇళ్లలోకి చొరబడి దాడులకు పాల్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇళ్లల్లోకి అక్రమంగా చొరబడుతున్న మూకలను అడ్డుకుంటే హిందువులపై దాడి చేశారంటూ దుష్ప్రచారం చేయటమేంటని ప్రశ్నించారు. గాయపడిన ముస్లింలకు చికిత్స చేస్తున్న ఆస్పత్రిపై దాడి చేసి విధ్వంసం సష్టించారని తెలిపారు.

ముస్లింలకు చెందిన షాపులను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. విధ్వంసానికి గురైన ఆస్పత్రి కూడా ముస్లింలది కావటమే గమనార్హమని తెలిపారు. ఈ ఘటనలన్నీ ఒక పథకం ప్రకారం జరిగినవే అని స్పష్టం చేశారు. గో రక్షణ పేరుతో ముస్లింల ఆస్తులనీ, జీవనాధారమైన షాపులని విధ్వంసం చేయడం, అల్లర్లు సష్టించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు సంఘ్ పరువార్ మూకలు ప్రయత్నించాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా లేక పోవటం వలన అల్లరి మూకలు రెచ్చిపోయారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర పోలీస్ యంత్రాంగం అప్రమత్తం కావాలనీ, మత విద్వేషాలు రెచ్చగొట్టే అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

ఐటీ కంపెనీల్లో కార్మిక చట్టాల సడలింపును ఖండిస్తున్నాం

- కేంద్ర బీజేపీ ప్రభుత్వ బాటలోనే రాష్ట్ర సర్కారు : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ఐటీ కంపెనీల్లో నాలుగేండ్ల పాటు కార్మిక చట్టాల అమలును సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని ఖండిస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు. కార్మిక చట్టాల మినహాయింపు, లేబర్ కోడ్‌ల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కర్నాటకలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం మినహాయింపు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. కనీస వేతనాలు పెంచకుండా యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గటం, మోడీ సర్కారు తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని పత్రికలకు లీకులివ్వడం, ఐటీ పరిశ్రమలకు కార్మిక చట్టాల నుంచి మినహాయింపునివ్వడం వంటి చర్యలను చూస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ బాటలోనే తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు పయనిస్తున్నదని అర్థమవుతున్నదని విమర్శించారు. పని వేళలు, పని ప్రదేశంలో భద్రత, రవాణా సౌకర్యాలు, వేతనాలు, మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించి షరతులను అమలు చేయాలనే నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. సౌకర్యాల కల్పన అమలుపై ఐటీ పరిశ్రమల్లో కార్మిక శాఖ తనిఖీలు చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. రాత్రి షిఫ్టుల కారణంగా మహిళలు ఎక్కువగా అసౌకర్యానికి గురవుతున్నారనీ, అందుకే చాలామంది షిఫ్ట్ డ్యూటీలను ఇష్టపడరని తెలిపారు. కంప్యూటరైజేషన్, పరిశ్రమల్లో అధునాతన యంత్రాలు ఆవిష్కరణ జరిగినపుడు పనిగంటలు తగ్గాలిగానీ పెరగడమేంటని ప్రశ్నించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటమే ఏకైక మార్గమనీ, అందుకు కార్మికవర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



పోలవరం విషయంలో జగన్ తప్పులు చేశారు

- చంద్రబాబు విమర్శ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు అనేక సంక్షోభాలను ఎదుర్కొందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. సీఎం బాధ్యతలు చేపట్టిన అనంతం ఆయన తొలసారి పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్పిల్‌వే, కాపర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్ పనుల పురోగతి వివరాలను జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..పోలవరం ప్రాజెక్టు కోసం నేను పడిన కష్టాన్ని జగన్ బూడిదలో పోసిన పన్నీరు చేశారు. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి ఆటంకాలు కాకూడదనే ఉద్దేశంతో తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేలా ఆనాడు కేంద్రాన్ని ఒప్పించాను. ప్రాజెక్టు మొదలుపెట్టిన దగ్గర నుంచి ఎన్నో సంక్షోభాలు ఎదురయ్యాయి. జాతీయ ప్రాజెక్టుగా విభజన చట్టంలో చేర్చడంలో టీడీపీ హయాంలోనే 72 శాతం ప్రాజెక్టును పూర్తిచేశాం..15 లక్షల క్యూసెక్కులు స్పిల్‌వేపై డిశ్చార్జ్ అవుతాయని అన్నారు. రాజకీయాల్లో ఉండదగని వ్యక్తి వచ్చి రాష్ట్రానికి శాపంగా మారారు. వైసీపీ ప్రభుత్వం రాగానే రివర్స్ టెండరింగ్ చేపట్టారు. ఏజెన్సీపాటు సిబ్బందినీ మార్చారు. డయాఫ్రమ్ వాల్‌ను గత ప్రభుత్వం కాపాడుకోలేదు. పోలవరం విషయంలో జగన్ క్షమించరాని తప్పులు చేశారు. ఈ ప్రాజెక్టుపై నేను వందసార్లు సమీక్షించాను. 30 సార్లు సందర్శించా..రూ.446 కోట్లతో మరమ్మతులు చేసినా బాగవుతుందనే పరిస్థితి లేదు. సమాంతరంగా డయాఫ్రమ్ వాల్ కడితే రూ.990 కోట్లు ఖర్చవుతుంది. గతంలో ప్రాజెక్టు నిర్మాణం కొనసాగి ఉంటే 2020 చివరినాటికి పూర్తయ్యేది. పోలవరం పూర్తికి నాలుగు సీజన్లు కావాలని, అన్నీ సవ్యంగా జరిగితేనే నాలుగేండ్లు పడుతుందని అధికారులు అంటున్నారని చెప్పారు. ఎలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండకూడదో ఇదొక కేస్ స్టడీ..రూ. వేల కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది. అప్పుడే ప్రాజెక్టు చేపడితే తక్కువ ఖర్చుతో పూర్తయ్యేది. ప్రస్తుతం ప్రాజెక్టు వ్యయం పెరిగింది. నష్టం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి. ఏజెన్సీని మార్చవద్దని కేంద్రం రాష్ట్రానికి చెప్పింది. అలాగే మార్చితే ప్రాజెక్టుకు జవాబుదారీతనం ఉండదని చెప్పారు. ఏజెన్సీలను మార్చడమే ప్రాజెక్టు ఆలస్యానికి కారణం. దీనికి బాధ్యత ఎవరు తీసుకుంటారు ? ప్రజలనే కాదు, మీడియాను, ప్రతిపక్ష నేతగా నన్ను కూడా ఇక్కడికి రానీయలేదు. ప్రస్తుతం ప్రాజెక్టు అంతా క్లిష్టంగా మారిపోయింది..ఈ చిక్కుముడులు అన్నీ విప్పే ప్రయత్నం చేస్తున్నాం..ఈ ప్రాజెక్టు ద్వారా నదుల అనుసంధానం చేసి రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలని కలలు కన్నా. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి చెందిన ప్రాజెక్టు ఇది అని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

భూముల ధర పెంపునకు కసరత్తు..!

- నేటి నుంచి కార్యాచరణ ప్రారంభం
- క్షేత్రస్థాయిలో ధర ఆధారంగా లెక్కింపు
- ఆగస్టు 1 నుంచి అమలయ్యేలా నిర్ణయం

నవతెలంగాణ-సిటీబ్యూరో

వ్యవసాయ, వ్యవసాయేతర ధరలను పెంచేందుకు సర్కార్ సిద్ధమైంది. తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నాయి.. ఇప్పటికే భూముల మార్కెట్ విలువను పెంచే కసరత్తు ప్రారంభమైంది. ఆదాయం పెంచుకోవడానికి గల మార్గాలపై ప్రభుత్వం ఇటీవల సమీక్షించింది. వివిధ ప్రాంతాల్లో భూముల ధరలను ఎంత మేర పెంచాలో సూచించాల్సిందిగా ఇప్పటికే అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం ప్రభుత్వ ధర.. ప్రయివేటు విలువల ఆధారంగా కొత్త మార్కెట్ విలువను నిర్ణయించనున్నారు. ఈ పెరిగిన ధరలతో కలిపి ఆగస్టు 1వ తేదీ నుంచి కొత్త మార్కెట్ ధరలు అమలు చేసేందుకు కసరత్తు సాగుతోంది.



హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో నేషనల్ హైవేలు, స్టేట్ రోడ్డులు, పారిశ్రామిక వాడలు, కమర్షియల్ జోన్లు, గ్రామీణ ప్రాంతాలను ఆనుకుని ఉన్న నివాస ప్రాంతాలు, ఖాళీ స్థలాలకు ప్రాంతాల వారీగా మార్కెట్ విలువను నిర్ణయించనున్నారు. జోనల్ డెవలప్‌మెంటల్, అర్బన్ డెవలప్‌మెంటల్ అథారిటీల ప్రణాళికలను పరిగణనలోకి తీసుకుంటారు. ఆ తర్వాత వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ప్రస్తుతం ఏ మేరకు ఆదాయం సమకూరుతుంది..? భూముల విలువలు ఏ మేరకు పెంచే అవకాశం ఉందనే వివరాలు సేకరిస్తోంది.

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖదే పైచేయి

ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకూర్చడంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ముందు వరుసలో నిలుస్తోంది. అయితే, వ్యవసాయ భూములు, ప్లాట్లు, స్థలాల మార్కెట్ ధరకు.. రిజిస్ట్రేషన్ విలువకు పొంతన లేదని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ధరలను సవరించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, అడిషనల్ కలెక్టర్, ఆర్డీఓ, పంచాయతీ, సర్వే, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన కార్యాచరణ మొదలవుతుంది. జిల్లా రిజిస్ట్రార్, మార్కెట్ వ్యాల్యూ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లు ఈ కమిటీని సమన్వయం చేస్తారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రస్తుతం ఉన్న ధరలను పరిశీలించి పెంచాల్సిన ధరలను నివేదిస్తారు.

2021-2022లో పెంపు

2021-2022లో అప్పటి ప్రభుత్వం వ్యవసాయ, వ్యవసాయేతర భూముల మార్కెట్ విలువను ఎంత పెంచింది..? ప్రభుత్వానికి ఎంత రాబడి వచ్చింది..? అనే అంశాలను కూడా పరిశీలిస్తుంది. ప్రాంతాన్ని బట్టి భూముల రేట్లు 40 నుంచి 50శాతం వరకు పెరిగే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. అలాగే ప్రస్తుతం వసూలు చేస్తున్న 7.5శాతం రిజిస్ట్రేషన్ ఫీజును కూడా మార్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

ప్రాంతాల ఆధారంగా నిర్ణయం

ప్రాంతాల ఆధారంగా ధరల పెంపుపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో జాతీయ, రాష్ట్ర రహదారులు వెళ్లే ప్రాంతాలు, వ్యాపారపరంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ధరలు ఎక్కువగా పెరగనున్నట్టు తెలుస్తోంది. కాగా, మరోసారి 20 నుంచి 50 శాతం వరకు భూముల ధరలు పెరిగే అవకాశమున్నట్టు తెలుస్తుండగా అదేస్థాయిలో ప్రభుత్వానికి ఆదాయం కూడా లభించనుంది.

ఇదీ షెడ్యూల్..

ఈ నెల 18వ తేదీన కమిటీ తొలి సమావేశం జరుగుతుంది. 23వ తేదీ నాటికి మార్కెట్ విలువ సవరణ ప్రక్రియ పూర్తి చేసి, 25న కొత్త ధరల ప్రతిపాదనలతో భేటీ అవుతారు. 29న ధరల సవరణకు కమిటీ ఆమోదం తెలిపాక జూలై 1వ తేదీన అభ్యంతరాల స్వీకరణకు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. జూలై 15వ తేదీ నాటికి వచ్చే అభ్యంతరాలను 20వ తేదీ వరకు పరిష్కరించి 24న తుది ఆమోదం కోసం కమిటీకి సమర్పిస్తారు. ఆపై 31వ తేదీన ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆగస్టు 1 నుంచి సవరించిన భూముల మార్కెట్ విలువలను అమలు చేయనున్నారు.



నీట్ పేపర్ లీకేజీ ఘటనలో నిందితులను శిక్షించాలి


- డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్

నవతెలంగాణ-భూపాలపల్లి

దేశంలో జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శ్రామిక భవనంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్ష లీకేజీపై కేంద్రం స్పందించ కుండా, ఎవరైతే గ్రేస్ మార్కులు పొందారో వారి స్కోర్ కార్డులు రద్దు చేసి, వారికి మళ్ళీ రీ ఎగ్జామ్ నిర్వహిస్తామనడం అంటే నీట్ అవకతవకలను పక్కదారి పట్టించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షపై ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయకుండా ఎన్‌టీఏ ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. పరీక్ష కంటే ముందు రోజు బీహార్‌లోని పాట్నాలో 13మందిని పేపర్ లీకేజీ విషయంలో అరెస్టు చేశారని గుర్తు చేశారు. హర్యానాలో ఒకే సీరియల్ నెంబర్ కలిగిన ఎనిమిది మంది విద్యార్థులకు టాప్ ర్యాంకులు వచ్చాయన్నారు. రాజస్థాన్, గుజరాత్‌ల్లో కూడా ఇలాంటి లీకేజీ అంశాలు ముందుకొచ్చాయని, వాటిపై విచారణ ఎందుకు జరపట్లేదని ప్రశ్నించారు. పరీక్షకు హాజరైన 24 లక్షల మంది విద్యార్థులకు రీ-ఎగ్జామ్ నిర్వహించి, ఎన్‌టీఏను రద్దు చేయాలన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భుక్య నవీన్, ఎ శ్రీకాంత్, జిల్లా నాయకులు కవిత, అప్సర్, సరిత, దేవేందర్, సుజాత, స్వాతి, రాకేష్, జ్ఞానేశ్వర్, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

'హమాలీ' కుటుంబానికి న్యాయం చేయాలి

- పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా
- ఇసుక ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన కార్మికుడు



నవతెలంగాణ-మోతె

ఇసుక ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన హమాలీ కార్మికుని కుటుం బానికి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం తోటి కార్మికులు, కుటుంబీకులు, గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ఎదుట, రహదారిపై పెద్దఎత్తున ధర్నా చేశారు. సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన హమాలీ కార్మికుడు మంద ఉపేందర్(32) ఆదివారం రాత్రి తుమ్మలపల్లి నుంచి మామిళ్లగూడెం వెళ్లే రోడ్డు మార్గంలో ఇసుక ట్రాక్టర్ ఢీకొని మృతి చెందాడు. కార్మికులు, కుటుంబీకుల ధర్నాతో ఖమ్మం సూర్యాపేట రహదారి మార్గంలో వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న సూర్యాపేట డీఎస్పీ రవి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి వచ్చి మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు పట్టాలివ్వాలి : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గండ్ర జ్యోతి

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ప్రజా పాలన, సంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టి.. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు గండ్ర జ్యోతి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు పట్టాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద భాస్కర్ గడ్డ వద్దనున్న డబుల్ బెడ్‌రూమ్ లబ్దిదారులతో కలిసి జాతీయ రహదారిపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 500 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించినట్టు తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి మున్సిపాలిటీ పరిధిలో చైర్మెన్, వైస్ చైర్మెన్, ఫ్లోర్ లీడర్ సమక్షంలో ఇండ్లను కేటాయించామని అన్నారు. కానీ ఆ ఇండ్ల పట్టాల పంపిణీలో జాప్యంతో అర్హులైన నిరుపేదలు వారం రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. ఎన్నికల కోడ్ పేరుతో జాప్యం చేస్తూ నిరుపేద లబ్దిదారులను నిరాశ, నిస్పృహలకు గురి చేస్తున్నారని అన్నారు. రోజు కూలి నాలీ చేసుకుని జీవనం సాగించే నిరుపేద లబ్దిదారులకు వెంటనే ఇండ్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకోవాలని కోరారు. లేదంటే తామే క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి లబ్దిదారులతో గృహప్రవేశాలు చేయిస్తామని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్‌పై కుంభకోణాలంటూ నిందలు మోపుతూ కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కాగా ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి సముదాయిం చగా వెంటనే ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కటకం జనార్దన్, మున్సిపల్ చైర్మెన్ వెంకటరాణి సిద్ధు, మున్సిపల్ వైస్ చైర్మెన్ గండ్ర హరీష్ రెడ్డి, కౌన్సిలర్ ఎడ్ల మౌనిక, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్దిదారులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్పీకర్ పదవిపై ఉత్కంఠ.. తమ దగ్గరే ఉండాలనుకుంటున్న బీజేపీ

ఢిల్లీ : ఈ నెల 24 నుంచి 18వ లోక్‌సభ కార్యకలాపాలు మొదలు కానున్నాయి. ఈ సందర్భంగా లోక్‌సభకు ఎన్నికైన నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ తర్వాత స్పీకర్ ఎన్నిక జరగనుంది. ఈ క్రమంలో ఆ స్థానంలో ఎవరు కూర్చుంటారోననే చర్చ నడుస్తోంది. ఎన్డీఏ కూటమికి నేతత్వం వహిస్తోన్న బీజేపీ.. స్పీకర్ పదవిని తనవద్దే అట్టిపెట్టుకోవాలని చూస్తోందని సమాచారం. మోడీ 3.0 ప్రభుత్వ ఏర్పాటులో టీడీపీ, జేడీయూ కీలకంగా మారిన విషయం తెలిసిందే. దీంతో ఆ రెండు పార్టీలు ఆ పదవిని ఆశించినట్లు వార్తలు వచ్చాయి. అయితే బీజేపీ మిత్రులకు డిప్యూటీ పోస్టు ఇవ్వాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే డిప్యూటీ స్పీకర్ పదవి తమ కూటమికి ఇవ్వకపోతే.. స్పీకర్ పోస్టుకు తమ అభ్యర్థిని దింపాలని విపక్ష 'ఇండియా' యోచిస్తున్నట్ల సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.అధికార పార్టీకి ఉన్న సంఖ్యాబలం ప్రకారం దానికి చెందిన వ్యక్తే స్పీకర్‌గా ఉంటారని జేడీయూ నేత కేసీ త్యాగి వెల్లడించారు. "దీనిపై ఎన్డీయే భాగస్వాములు మొదట చర్చలు జరుపుతాయి. ఒకసారి అందరి ఆమోదం లభించిన తర్వాత మేం అభ్యర్థిని నిలబెడతాం. ఆ వ్యక్తికి కూటమి పార్టీలన్నీ మద్దతు తెలుపుతాయి" అని టీడీపీ పేర్కొంది. అయితే ప్రస్తుత సమాచారం ప్రకారం.. స్పీకర్ పదవి బీజేపీ వద్దే ఉంటే, రాజస్థాన్ కోటా స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఓం బిర్లాకు మరోసారి అవకాశం ఇవ్వొచ్చన్న అంచనాలూ ఉన్నాయి.

మండుతున్న టమాటా ధరలు

- కిలో రూ.80కి పైనే

ఢిల్లీ: వర్షాకాలం ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఎండలు దంచికొడుతూనే ఉన్నాయి. దీంతో టమాటా దిగుబడులు భారీగా తగ్గాయి. మార్కెట్లో సరిపడినంత స్టాక్ లేకపోవడంతో పలు చోట్ల టమాటా ధరలు మండుతున్నాయి. తీవ్రమైన వేడిగాలుల వల్ల గత ఇరవై రోజుల్లో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో టమాటా ధరలు రెండింతలు పెరిగి కిలోకు రూ.50కి వద్ద స్థిరపడ్డాయి. తెలంగాణలో కిలో టమాటా ధర రూ.80కిపైగా పలుకు తోంది. సరఫరా కొరతతో జులైలో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారవచ్చని తెలుస్తోంది.

వర్సిటీల్లో అన్నీ ఖాళీలే...

తెలంగాణ వచ్చాక నియామకాల ఊసేలేదు

- బోధనా సిబ్బందిలో 70 శాతం పోస్టులు ఖాళీ
- అటకెక్కిన యూనివర్సిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు
- రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో బిల్లు
- విశ్వవిద్యాలయాల్లో పాత పద్ధతిలోనే నియామకాలు!
- రాష్ట్ర ప్రభుత్వం సమాలోచన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టుల్లో దాదాపు 70 శాతానికిపైగా ఖాళీగా ఉన్నాయి. 12 విశ్వవిద్యాలయాల పరిధిలో మొత్తం 2,825 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో 873 (30 శాతం) మంది ప్రొఫెసర్లు మాత్రమే పనిచేస్తున్నారు. 1,977 (70 శాతం) ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో 1267 ప్రొఫెసర్ పోస్టులుంటే, వాటిలో 376 మాత్రమే పనిచేస్తున్నారు. ఏకంగా 891 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం.

ఇక కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)లో 409 ప్రొఫెసర్ పోస్టులుంటే, 86 మంది మాత్రమే ఉద్యోగంలో ఉన్నారు. దాదాపు 323 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పరిస్థితి ఆ రెండు విశ్వవిద్యాలయాలకే పరిమితం కాలేదు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉన్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారిగా 2013లో విశ్వవిద్యాలయాల్లో నియామకాల ప్రక్రియ సాగింది. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత వర్సిటీల్లో నియామకాల ప్రక్రియను ప్రభుత్వం చేపట్టకపోవడం గమనార్హం. ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకపోగా, పరిశోధనలు నామమాత్రంగానే సాగుతున్నాయన్న విమర్శ ఉన్నది. ప్రొఫెసర్ పోస్టుల ఖాళీలతో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గ్రేడ్‌లోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తక్కువ గ్రేడ్‌ను కేటాయించడం వల్ల వర్సిటీల ప్రతిష్ట మసకబారుతున్నది. ఇంకోవైపు విశ్వవిద్యాలయాల అభివృద్ధికి ప్రభుత్వం సరిపోయినన్ని నిధులను కూడా గత పదేండ్లలో కేటాయించలేదు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకపోగా, మెరుగైన వసతులను కల్పించడం లేదు. విశ్వవిద్యాలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లుపై ఏం చేద్దాం?

రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల పరిధిలో 1,551 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. వాటిలో మొదటి విడతలో 1,061 పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతి ఇస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం 2017, నవంబర్ 25న ఉత్తర్వులను జారీ చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ పోస్టులను భర్తీ చేయలేదు. గతంలో విశ్వవిద్యాలయం యూనిట్‌గా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లను విడుదల చేసి నియామకాల ప్రక్రియను చేపట్టే విధానం ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ విధానాన్ని తొలగించి తెలంగాణ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లును రూపొందించింది. అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపించింది. ఆ బిల్లు ద్వారా విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందన్న అభిప్రాయం ప్రొఫెసర్ల నుంచి వచ్చింది. దీంతో ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపించారు. అయితే ఇప్పటి వరకు ఆ బిల్లును రాష్ట్రపతి ఆమోదించలేదు, తిరస్కరించలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో విశ్వవిద్యాలయం యూనిట్‌గా పాత పద్ధతిలోనే నియామకాలు చేపట్టేందుకు రేవంత్ సర్కార్ సమాలోచన చేస్తున్నట్టు తెలిసింది. తెలంగాణ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లును వెనక్కి తీసుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ అంశంపై న్యాయ నిపుణులతో సంప్రదించిన తర్వాత గవర్నర్‌తో ప్రత్యేకంగా భేటీ కావాలని సీఎం నిర్ణయించినట్టు తెలిసింది. ఆ బిల్లును వెనక్కి తీసుకుంటే వర్సిటీల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగవంతమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించొచ్చని భావిస్తున్నది. ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తే మెరుగైన న్యాక్ గ్రేడ్ వచ్చే అవకాశమున్నది.

విశ్వవిద్యాలయాల వారీగా అధ్యాపక పోస్టుల వివరాలు

యూనివర్సిటీ	మంజూరైనవి	పనిచేస్తున్నది	ఖాళీలు	భర్తీచేసేవి
1. ఉస్మానియా	1267	376	891	415
2. కాకతీయ	409	86	323	136
3. డా॥బీఆర్ అంబేద్కర్	86	34	52	10
4. పొట్టి శ్రీరాములు	72	14	58	07
5. తెలంగాణ	152	61	91	59
6. మహాత్మాగాంధీ	70	35	35	34
7. శాతవాహన	63	16	47	40
8. పాలమూరు	95	21	74	63
9. జేఎన్‌టీయూహెచ్	410	169	241	186
10. జేఎన్ఎఫ్ఏయూ	55	17	38	15
11. ఆర్‌జీయూకేటీ	146	19	127	0
12. మహిళా	0	25	0	0
మొత్తం	2825	873	1977	1061

నిరుద్యోగులకిచ్చిన హామీలు అమలు చేయాలి

- పింఛన్లను వెంటనే పెంచి ఇవ్వాలి
- ఆశావర్కర్లు, అంగన్‌వాడీలకు జీతాలేవి?
- విద్యను కొందరికే పరిమితం చేసేందుకు బీజేపీ కుట్ర : మాజీ మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులు, ఫించన్ దారులు, ఆశావర్కర్లు, అంగన్ వాడీలను మోసం చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ' గ్రూప్ 1, గ్రూప్ 2 అభ్యర్థులు, నిరుద్యోగులు పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్ దగ్గరికి వెళ్లి సమస్యలు చెబితే అంతా ప్రభుత్వం చేతుల్లో ఉందని చెప్పారు. ప్రజా దర్బార్‌కు వెళ్లి అధికారుల కాళ్లమీద పడ్డా కనికరించడం లేదు. నిరుద్యోగులకు మాట ఇచ్చిన ప్రొఫెసర్ కోదండరామ్ దగ్గరికి వెళ్లినా స్పందన లేదు...' అని ఆయన విమర్శించారు. గ్రూప్ 1కు 1:50 కాకుండా 1:100 చొప్పున మెయిన్స్‌కు అవకాశం ఇవ్వాలనీ, .గ్రూప్ 2కు , గ్రూప్ 3కి 3 వేల ఉద్యోగాలు కలుపుతామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పరీక్షకు పరీక్షకు మధ్య 2 నెలల గ్యాప్ ఉండేలా చూడాలని సూచించారు. వరస పరీక్షలతో అభ్యర్థులు ఒత్తిడికి గురవుతున్నారనీ, ఇప్పటికే సంగీత అనే అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. 25 వేల పోస్టులతో డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతామన్న కాంగ్రెస్ అంతకు ముందు ప్రతి నెలా ఇచ్చే పింఛన్ కూడా ఇవ్వడం లేదని హరీశ్ రావు విమర్శించారు. ఇంట్లో అర్హులుంటే ఇద్దరికి పింఛన్ హామీని కూడా విస్మరించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సాధ్యమైంది ఇక్కడెందుకు కాదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే కాంగ్రెస్ సర్కార్ ఒక్కో పింఛన్ దారునికి రూ.12 వేలు బకాయి పడిందనీ, మొత్తం కలుపుకుని రూ.16 వేలివ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగులకిచ్చిన హామీ మేరకు రూ.6 వేలు ఇవ్వాలని కోరారు. పెండింగ్ పింఛన్లు చెల్లించి కొత్త పింఛన్లను మంజూరు చేయాలని కోరారు. ఆశావర్కర్లు, ఎన్ హెచ్‌ఎం ఉద్యోగులు తమ జీతాల కోసం హైదరాబాద్ కు వచ్చి ధర్నాలు చేస్తున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రతి నెలా 18న జీతాలిస్తూ ఒకటో తేదీన ఇస్తున్నట్టు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నదని ఎద్దేవా చేశారు. గ్రామపంచాయతీ పారిశుధ్య వర్కర్లకు ఐదు నెలలుగా జీతాలు లేవనీ, అంగన్ వాడీ టీచర్లకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదని చెప్పారు. కేసీఆర్ ఫోటో ఉందనే కారణంగా సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన 65 వేల చెక్కులను నిలిపేశారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. వాటిపై సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టి ఇవ్వాలని కోరారు. ఫోటో కారణంతో పేదలను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు.

కిషన్ రెడ్డి, బండి సంజయ్ స్పందించాలి

నీట్‌లో తెలుగు విద్యార్థులకు అన్యాయం జరగకుండా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ స్పందించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలనలో సంపద ఇప్పటికే కొందరి చేతుల్లోకి వెళ్లిందనీ, ఇక విద్య కూడా కొందరి చేతుల్లోకే వెళ్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏండ్ల తరబడి నిద్రాహారాలు లేకుండా నీట్ కోసం చదివిన విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. గ్రేస్ మార్కులు, పేపర్ లీకేజీలు ఈ ఆందోళనకు కారణమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 67 మందికి ఫస్ట్ ర్యాంకు ఎలా వస్తుంది? ఒకే సెంటర్లో రాసిన ఆరుగురికి 720 మార్కులెలా వచ్చాయి? అని ఆయన ప్రశ్నించారు. గ్రేస్ మార్కులు కలిపిన 1563 మంది పేర్లు, క్రైటీరియా బయటపెట్టాలని డిమాండ్ చేశారు. నీట్‌లో గ్రేస్ మార్కుల విధానమే లేనప్పుడు ఎలా కలిపారు? ఫలితాలను పది రోజులు ముందుకు జరిపి, పార్లమెంటు ఫలితాల రోజే ఎందుకు విడుదల చేశారు? ఈ అంశంపై లోతైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

వ్యూస్ కోసం నిజాయితీని దెబ్బతీయొద్దు

సంచలనాల కోసం మీడియా,సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానల్ లో తనపై కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ' వర్కింగ్ ప్రెసిడెంట్‌ను అవుతాననీ, కాంగ్రెస్‌లోకి, బీజేపీలోకి వెళ్తున్నానని ఏవేవో చెబుతున్నారు, దయచేసి ఇలాంటి తంబ్‌నెయిల్స్ పెట్టకండి, మీ లైక్స్ కోసం, వ్యూస్ కోసం ఒక నాయకుడి నిబద్ధతను, నిజాయితీని దెబ్బతీయొద్దు ... .' అని కోరారు. ఇలాంటివి మానుకోకపోతే లీగల్ చర్యలు తీసుకోడానికి వెనుకాడబోమని హరీశ్ రావు హెచ్చరించారు.

గ్రేట్ ప్లేస్ టు వర్క్ సర్టిఫికెషన్ పొందిన ఎల్అండ్‌టీ మెట్రో

- జూన్ 2024 నుంచి 2025 జూన్ వరకు..

నవతెలంగాణ-సిటీబ్యూరో



మధ్య స్థాయి సంస్థల కేటగిరీలో గ్రేట్ ప్లేస్ టు వర్క్‌గా ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ (ఎల్అండ్‌టీఎంహెచ్ఆర్ఎల్)కు గుర్తింపు లభించింది. పనిచేసే చోట సంస్కృతికి సంబంధించిన ప్రముఖ అంతర్జాతీయ ప్రాధికార సంస్థ గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును ప్రకటించింది. 2024 జూన్ నుంచి 2025 జూన్ వరకు ఈ సర్టిఫికేషన్ వర్తిస్తుంది. ఈ సందర్భంగా ఎల్అండ్‌టీ మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ ఎండీ అండ్ సీఈవో కేవీబీ రెడ్డి మాట్లాడుతూ.. 'గ్రేట్ ప్లేస్ టు వర్క్‌గా గుర్తింపు లభించడం మాకెంతో గర్వకారణం. మా విజయాలకు చోదకశక్తిగా ఉంటున్న ఉద్యోగుల కఠోర శ్రమ, అంకిత భావానికి ఈ సర్టిఫికేషన్ నిదర్శనం. పని ప్రదేశంలో పరిస్థితులను నిరంతరం మెరుగు పర్చేందుకు, మా ఉద్యోగుల ఎదుగుదల కోసం అవసరమైన అత్యుత్తమమైన అవకాశాలను కల్పించడానికి మేము కట్టుబడి ఉన్నాం. ఉద్యోగులే అత్యంత విలువైన సంపద అని ఎల్అండ్‌టీ మెట్రో విశ్వసిస్తుంది. పరస్పర సహకారం, గుర్తింపు, వృత్తిగత అభివృద్ధికి దోహదపడే సంస్కృతిని పెంపొంది స్తున్నందుకుగాను ఎల్అండ్‌టీ మెట్రో సీహెచ్ఆర్‌వో బినో జోస్ మాథ్యూను అభినందిస్తున్నాను. తమలోని సామర్థ్యాలను పూర్తి స్థాయిలో వినియోగించు కునేలా, కంపెనీ విజయంలో అర్థవంతమైన పాత్ర పోషించేలా ఉద్యోగులకు సాధికారత కల్పించేందుకు సంస్థ కట్టుబడి ఉంది' అని తెలిపారు.

బిజినెస్

రుణాల జారీలో 15శాతం వృద్ధి

- ఎస్‌బిఐ ఛైర్మన్ దినేష్ ఖరా అంచనా



ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రుణాల జారీలో 14-15 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఛైర్మన్ దినేష్ కుమార్ ఖరా అన్నారు. "సాధారణంగా మనం జిడిపి వృద్ధి రేటు, ద్రవ్యోల్బణం, దాని కంటే 2-3 శాతం అదనంతో కలుపుకుంటే 14 శాతం లేదా అంతకంటే ఎక్కువ సంఖ్య ఉంటుంది. ఈ నేపథ్యంలోనే 14-15 శాతం రుణాల్లో వృద్ధి అందుబాటులో ఉన్న అవకాశాలను సూచిస్తుంది. ఇది మా అవసరాలను తీర్చనుంది. ఈ స్థాయి వృద్ధి సంతోషాన్ని ఇస్తుంది." అని దినేష్ ఖరా తెలిపారు. డిపాజిట్ల విషయానికొస్తే గతేడాది 11 శాతం వృద్ధిని సాధించామన్నారు. డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచాలని తమపై ఎలాంటి ఒత్తిడి లేదన్నారు. తమ వద్ద రూ.3.5 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు అదనపు చట్టబద్ధమైన ద్రవ్య నిష్పత్తి (ఎస్‌ఎల్‌ఆర్)ను కలిగి ఉన్నామన్నారు. "మేము ఎల్లప్పుడూ డిపాజిట్లకు ప్రాధాన్యతనిస్తాము. అందుకే మేము ఇటీవల స్వల్పకాలిక డిపాజిట్ల కోసం వడ్డీ రేటును పెంచాము. ఎందుకంటే మెరుగుదల కోసం అవకాశాలు ఉన్నాయని మేము భావించాము. మేము మా డిపాజిట్ వృద్ధి రేటును కొంతవరకు మెరుగుపర్చుకోవాలి. ఈ సంవత్సరంలో మేము కనీసం 12-13 శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం." అని దినేష్ ఖరా తెలిపారు. ఎంపిక చేసిన డిపాజిట్లపై గత నెల ఎస్‌బిఐ వడ్డీ రేట్లను 75 బేసిస్ పాయింట్లు మేర పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఎం) గతేడాది స్థాయిలోనే 2-3 బేసిస్ పాయింట్లు పెరగొచ్చని దినేష్ ఖరా అన్నారు. ఎస్‌బిఐ మొండి బాకీల విషయానికి వస్తే.. నికర, స్థూల నిరర్థక ఆస్తుల్లోనూ తగ్గుదల కొనసాగుతోందన్నారు. అయినప్పటికీ.. సూక్ష్మ ఆర్థిక వ్యవస్థ పనితీరును అంచనా వేయలేము కాబట్టి.. ఎన్‌పిఎల భవిష్యత్తును అంచనా వేయలేమన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ఎస్‌బిఐ స్థూల నిరర్థక ఆస్తులు 54 బేసిస్ పాయింట్లు మెరుగై.. 2.24 శాతానికి, నికర ఎన్‌పిఎలు 10 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 0.57 శాతానికి పరిమితమయ్యాయి.

కెబిసి గ్లోబల్‌కు సిఆర్‌జెఐ కాంట్రాక్టు

KARDA CONSTRUCTIONS BUILDERS & DEVELOPERS (KBC GLOBAL LTD)

హైదరాబాద్ : కెబిసి గ్లోబల్ లిమిటెడ్ (ఇంతక్రితం కర్దా కన్‌స్ట్రక్షన్)కు సిఆర్‌జెఐ లిమిటెడ్ నుంచి సాఫ్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగానికి సంబంధించిన 20 మిలియన్ డాలర్ల (రూ.167 కోట్లు) విలువ చేసే సబ్ కాంట్రాక్ట్ దక్కినట్లు ఆ సంస్థ తెలిపింది. నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగంలోని సిఆర్‌జెఐ ఆఫ్రికాలో రైల్వేలు, ఫైవ్ స్టార్ హోటళ్లను నిర్మిస్తోంది. కెబిసి గ్లోబల్‌కు చెందిన కెన్యా అనుబంధ సంస్థ కర్దా ఇంటర్నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ద్వారా ఒప్పందం చేసుకోవడం ద్వారా ఆఫ్రికా మార్కెట్‌లో విస్తరణకు వీలు కలిగిందని కెబిసి గ్లోబల్ పేర్కొంది.

ఐటిసి ఇప్పీకి క్రికెట్ దిగ్గజాల ప్రచారం



హైదరాబాద్ : ఐటిసి లిమిటెడ్‌కు చెందిన ఇన్‌స్టాంట్ నూడుల్ అయినా సన్‌ఫీస్ట్ ఇప్పీకి క్రికెట్ దిగ్గజాలు రాహుల్ ద్రావిడ్, జస్ప్రీత్ బుమ్రా, సూర్య కుమార్ యాదవ్‌లను ప్రచారకర్తలుగా నియమించుకున్నట్లు ఆ సంస్థ తెలిపింది. వీరితో ఇప్పీ టాస్ క్యాంపెయిన్‌ను చేపట్టినటు ఐటిసి లిమిటెడ్ ఫుడ్ బిజినెస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కవితా చతుర్వేది పేర్కొన్నారు. ఈ నూతన ప్రచారాన్ని రాహుల్ ద్రావిడ్ ప్రారంభించారన్నారు.

పిన్‌కోడ్ యాప్‌లో పలు లోకల్ బ్రాండ్ స్టోర్లు

హైదరాబాద్ : ఫోన్‌పేకు చెందిన పిన్‌కోడ్ యాప్‌లో తాజాగా హైదరాబాద్‌లోని ప్రముఖ లోకల్ బ్రాండ్ స్టోర్లు జత అయ్యాయని ఆ సంస్థ తెలిపింది. నగరంలోని విజేత సూపర్ మార్కెట్, బాలాజీ గ్రాండ్ బజార్, అక్షయ కల్ప, ప్రోవిలాక్ మిల్క్, ప్రవర్ష డెయిరీ, గోదావరి కట్స్ లాంటి పలు బ్రాండ్లు ఇప్పుడు పిన్‌కోడ్‌లో అందుబాటులోకి వచ్చాయని పేర్కొంది. దీంతో తమ స్టోర్ ఫస్ట్ ఇ-కామర్స్ వేదికలో అనేక రకాలైన కిరాణా సరకులు, తాజా పండ్లు, కూరగాయలు, డెయిరీ ఉత్పత్తులు, ఇతర నిత్యావసర వస్తువులను అందుబాటులోకి తెచ్చామని పిన్‌కోడ్ సిఇఒ వివేక్ లోచబ్ తెలిపారు.

పసిడి దిగుమతుల్లో 210శాతం పెరుగుదల

- యుఎఇతో ఎఫ్‌టిఎ ఫలితం

న్యూఢిల్లీ : యుఎఇతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)తో ఆ దేశం నుంచి భారీగా పసిడి, వెండి దిగుమతులు పెరిగాయి. గడిచిన 2023-24లో బంగారం, వెండి దిగుమతులు 210 శాతం ఎగిసి 3.5 బిలియన్ డాలర్ల నుంచి 10.7 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో రాయితీ కస్టమ్స్ సుంకం రేట్లను సవరించాల్సిన అవసరం ఉందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిస్టియేటివ్ (జిటిఆర్ఐ) ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. భారత్ తన వాణిజ్య విధానాలను సమతుల్యం చేసుకోవడానికి, దేశీయ ఆదాయాన్ని కాపాడుకోవడానికి, విలువైన లోహాలు, ఆభరణాల దిగుమతిలో న్యాయమైన పోటీని నిర్ధారించడానికి ప్రభుత్వం కొన్ని చర్యలను అమలు చేయాలని జిటిఆర్ఐ ఫౌండర్ అజయ్ శ్రీవాస్తవా పేర్కొన్నారు.

సిడ్స్ ఫార్మ్ నూతన సిటిఒగా సునీల్ పొత్తూరి



హైదరాబాద్ : తెలంగాణా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోన్న డెయిరీ బ్రాండ్ సిడ్స్ ఫార్మ్ తమ నూతన చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సిటిఒ)గా సునీల్ పొత్తూరిని నియమించుకున్నట్లు ప్రకటించింది. కన్సల్టింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, స్ట్రాటజీ, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్‌లో సునీల్‌కు రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉందని పేర్కొంది. వ్యాపార నిర్వహణలో సునీల్‌కున్న అశేష అనుభవం, సాంకేతిక నేపథ్యం తమ సంస్థ ఆవిష్కరణలు, వద్ధి లక్ష్యం చేరుకోవడానికి తోడ్పడు లభించనుందని సిడ్స్ ఫార్మ్ వ్యవస్థాపకుడు కిశోర్ ఇందుకూరి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎయిరిండియా భోజనంలో బ్లేడ్..

న్యూఢిల్లీ : టాటా గ్రూపునకు చెందిన ఎయిరిండియా విమానంలో ప్రయాణికులకు అందించే భోజనంలో మెటల్ బ్లేడ్ వచ్చింది. దీనిపై బాధిత ప్రయాణికుడు ఫిర్యాదు చేశాడు. కాగా.. ఆ విషయం నిజమేనని ఎయిర్ ఇండియా చీఫ్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్ రాజేష్ డోగ్రా ధ్రువీకరించారు. ప్రయాణికుడి భోజనంలో గుర్తించిన మెటల్ వస్తువుపై వెంటనే దర్యాప్తు జరిపామన్నారు. కూరగాయలు కట్ చేసేందుకు ఉపయోగించే ప్రాసెసింగ్ మెషీన్ నుంచి ఆ మెటల్ వస్తువు వచ్చినట్లు తెలిసిందన్నారు. తమ క్యాటరింగ్ భాగస్వాములు ఏదైనా గట్టి కూరగాయలను తరిగే క్రమంలో జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు చేపడుతామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహిస్తామన్నారు.

20 నుంచి ఒప్పో ఎఫ్27 ప్రో విక్రయాలు

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో కొత్తగా ఒప్పో ఎఫ్27 ప్రో ప్లస్ 5జిని ఆవిష్కరించింది. వీటి అమ్మకాలను జూన్ 20 నుంచి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. ఇందుకోసం ప్రీఆర్డర్లను స్వీకరిస్తున్నట్లు పేర్కొంది.

6.7 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఆక్టా కోర్ మీడియా టెక్ 7050 ఎస్‌ఒసితో ఆవిష్కరించింది. 8జిబి ర్యామ్, 128జిబి లేదా 256 జిబి సహా 64 ఎంపి ప్రధాన కెమెరా, 2ఎంపి డెప్త్ కెమెరా, 8ఎంపి సెల్ఫీ కెమెరాతో విడుదల చేసింది. 128 జిబి వేరియంట్ ధరను రూ.27,999గా, 256జిబి ధరను రూ.29,999గా నిర్ణయించింది.

ఛత్తీస్‌గఢ్ ఒప్పంద భారం రూ.6 వేల కోట్లు



- ఇప్పటికీ ఈఆర్సీ ఆమోదమే లేదు
- ఇదీ సర్కారు వాదన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి ఏకసభ్య కమిషన్‌కు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షులు కే చంద్రశేఖరరావు (కేసీఆర్) రాసిన లేఖ రాజకీయ దుమారాన్ని రేపుతుంది. కమిషన్ ఏర్పాటే సరికాదనీ, జస్టిస్ నర్సింహారెడ్డి స్వచ్ఛందంగా విచారణ నుంచి తప్పుకోవాలని కేసీఆర్ తన లేఖలో పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిపై అధికార కాంగ్రెస్‌పార్టీ తీవ్రంగానే స్పందించింది. కమిషన్ విచారణకు సహకరించాలని కోరింది. అదే సమయంలో కేసీఆర్ లేఖ నేపథ్యంలో పలు అంశాలను పేర్కొంటూ ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇచ్చింది. దానిలో భాగంగానే ఛత్తీస్‌గఢ్ విద్యుత్‌తో తెలంగాణ విద్యుత్ సంస్థలు అంచనాలకు మించి నష్టపోయాయంటూ కొన్ని గణాంకాలను విడుదల చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి... ఒప్పందం ప్రకారం ఛత్తీస్‌గఢ్ కరెంటు ఒక్క యూనిట్ ధర రూ.3.90 మాత్రమే అని కేసీఆర్ చెబుతున్నప్పటికీ, అది పాక్షిక వాస్తవమేనని వివరణ ఇస్తున్నారు. "ఛత్తీస్‌గఢ్ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కొన్న విద్యుత్ 17,996 మిలియన్ యూనిట్లు. ఇప్పటివరకు చేసిన చెల్లింపులు రూ.7,719 కోట్లు. ఛత్తీస్‌గఢ్‌కు చెల్లించాల్సిన బకాయిలు రూ.1,081 కోట్లు. ట్రాన్స్‌మిషన్ లైన్ ఛార్జీలు రూ.1,362 కోట్లు. ఇవన్నీ లెక్కిస్తే ఒక్కో యూనిట్‌కు అయిన ఖర్చు రూ.5.64గా లెక్క కట్టారు. దీనిప్రకారం దాదాపు రూ.3,110 కోట్లు అదనపు భారం పడిందని విశ్లేషించారు. బకాయిల విషయంలోనూ రెండు రాష్ట్రాల మధ్య వివాదం ఇంకా తేలలేదనీ, కేవలం రూ.1,081 కోట్ల బకాయిలున్నాయని తెలంగాణ చెప్తుండగా, రూ.1,715 కోట్లు ఉన్నాయని ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సంస్థలు లెక్కలు చూపిస్తున్నాయి. బకాయిల వివాదంపై ఛత్తీస్‌గఢ్ విద్యుత్ సంస్థలు ఎలక్ట్రిసిటీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశాయి. "ఛత్తీస్‌గఢ్ విద్యుత్ 2017 చివరి నుంచి అందుబాటులోకి వచ్చింది. ముందునుంచీ అరకొరగానే సరఫరా అయ్యింది. ఎన్నడూ వెయ్యి మెగావాట్లు సాఫీగా రాలేదు.

అక్కడి నుంచి ఆశించిన సరఫరా తగ్గిపోవటంతో తెలంగాణ డిస్కంలు బహిరంగ మార్కెట్లో విద్యుత్తు కొనుగోలు చేయాల్సి వచ్చింది. దీంతో 2017 నుంచి 2022 వరకు పడిన అదనపు భారం రూ.2,083 కోట్లు" అని ప్రభుత్వ వర్గాలు లెక్కకట్టాయి. 2022 ఏప్రిల్ నుంచి ఈ విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. మరోవైపు ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్‌ను తెచ్చుకునేందుకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (పీజీసీఐఎల్)తో వెయ్యి మెగావాట్ల విద్యుత్ సరఫరాకు కారిడార్ బుక్ చేసుకోవాల్సి వచ్చింది. ఒప్పందం ప్రకారం విద్యుత్ తెచ్చుకున్నా, తెచ్చుకోకపోయినా పీజీసీఐఎల్‌కు సరఫరా ఛార్జీలు కట్టాల్సిందే. ఈ లెక్కన కరెంటు రాకున్నా అదనంగా కట్టిన చార్జీలు రూ.638 కోట్లు అని లెక్కతేల్చారు. కారిడార్ల బుకింగ్‌తోను అదనపు నష్టం వాటిల్లినట్టు ప్రభుత్వవర్గాలు చెప్తున్నాయి. కేవలం వెయ్యి మెగావాట్ల కారిడార్ సరిపోతుండగా, అనవసరంగా మరో వెయ్యి మెగావాట్ల విద్యుత్ సరఫరాకు అడ్వాన్సుగా కారిడార్ బుక్ చేశారనీ, ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ రాదని తెల్సి ఆ కారిడార్‌ను అర్థాంతరంగా రద్దు చేసుకున్నారని తెలిపారు. దీనితో పరిహారం కింద రూ.261 కోట్లు కట్టాలని పీజీసీఐఎల్ డిస్కంలకు నోటీసులు జారీ చేసిందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

అసలు ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందానికి తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఎస్ఈఆర్సీ) ఇప్పటి వరకు ఆమోద ముద్ర వేయనే లేదని తేల్చిచెప్తున్నారు. ఈఆర్సీ ఆమోదం లేకుండానే ఛత్తీస్‌గఢ్‌కు వేల కోట్ల రూపాయల్ని అడ్డదారి చెల్లింపులుగానే పరిగణించాలనే వాదనలు వినిపిస్తున్నారు.

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో విద్యుత్‌కు అంతరాయం
నిలిచిపోయిన బోర్డింగ్, చెక్‌ఇన్‌లు

న్యూఢిల్లీ : ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం దాదాపు అరగంట పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పలు ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన బోర్డింగ్, చెక్‌ఇన్ సౌకర్యాలపై ఇబ్బంది ఏర్పడింది.

టెర్మినల్ 2పై ఉన్న పలు విమానాల సర్వీసుల్లో జాప్యం తలెత్తింది. దీంతో వందలాది ప్రయాణికులు క్యూలలో నిలిచిపోయారు. ఏం జరుగుతోందో తెలియక ఆందోళనకు గురయ్యారు. అయితే ఢిల్లీలో నీటి సమస్యతో పాటు విద్యుత్ సమస్య కూడా మొదలైందని సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి.

విద్యార్థుల బ్యాగులు తనిఖీ చేయాలి

- డ్రగ్ తీసుకున్న మహిళలో మార్పు :

టీజీన్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య



హైదరాబాద్: ఇటీవల డ్రగ్స్ తీసుకున్న మహిళలో మార్పు కనిపించిందని, డ్రగ్స్ నిర్మూలనకు ఇక మీదట విద్యార్థుల బ్యాగులు తనిఖీ చేయాలని తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. కొన్ని నెలల కిందట డ్రగ్స్ తీసుకున్న మహిళకు పరీక్షల్లో పాజిటివ్ వచ్చిందని, తాజాగా నిర్వహించిన టెస్టుల్లో ఆమెకు నెగిటివ్ వచ్చిందని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ముఖ్యంగా స్కూల్స్, కాలేజీల్లో మత్తుపదార్థాల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పాఠశాలలు, కళాశాలలు పున్ణప్రారంభమైన నేపథ్యంలో యాజమాన్యాలకు ఆయన పలు సూచనలు చేశారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కుయువకుడి బలి

- ఈనెల 10న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం
- పరిస్థితి విషమించి మృతి
- మెదక్ జిల్లాలో ఘటన



నవతెలంగాణ-రామాయంపేట

ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పులపాలై ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు పరిస్థితి విషమించి మృతిచెందిన ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన భానుప్రసాద్(25) కొన్ని నెలలుగా ఆన్‌లైన్‌లో బెట్టింగ్స్ ఆడుతున్నాడు. పెద్దఎత్తున అప్పులు తెచ్చి బెట్టింగ్‌లో పెట్టి నష్టపోయాడు. దాంతో తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక.. మనస్తాపానికి గురై ఈనెల 10న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రామయంపేట ఎస్ఐ రంజిత్ తెలిపారు.

వర్షానికి కూలిన 200 ఏండ్లనాటి భారీ వృక్షం



నవతెలంగాణ- విలేకరులు

హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షాలు పడుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని జీహెచ్ఎంసీ సూచించింది. వర్షం, ఈదురుగాలుల ధాటికి చాలా ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. వాహనదారులు ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడ్డారు. టోలిచౌకి-గోల్కొండ ఎండీ లైన్స్‌లో 200 ఏండ్ల నాటి భారీ వృక్షం కూలింది. ఈ ఘటనలో ఒక వ్యక్తికి గాయాలు కాగా.. నాలుగు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, షేక్‌పేట, ఖైరతాబాద్, పంజాగుట్ట, లక్డీకపూల్, అమీర్‌పేట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, దిల్ సుఖ్ నగర్, మలక్ పేట,ఉప్పల్, కాప్రా, మేడ్చల్ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. ఈ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అలాగే పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్య నెలకొంది.

అస్తవ్యస్థ ఆర్థిక వ్యవస్థను సెట్ చేస్తున్నాం

- ఆశా వర్కర్ల గురించి మాట్లాడే హక్కు హరీశ్‌రావుకు లేదు:మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సెట్ చేస్తున్నామనీ, తాము చెప్పిన ప్రతీ మాటకు కట్టుబడి ఉన్నామంటూ మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి హరీశ్‌రావుకు కౌంటరిచ్చారు. ఏపీ సీఎం చంద్రబాబును ఉదాహరణగా తీసుకున్నారంటేనే.. హరీష్ రావు పరిస్థితేంటో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల ఆలోచనలనే ఇక్కడ అమలు చేస్తామనీ, ఏపీ ఆలోచనలు ఇక్కడెందుకు అమలు చేస్తామని ప్రశ్నించారు. 12 ఏండ్ల తర్వాత గ్రూప్ -1 పరీక్షను తమ ప్రభుత్వమే నిర్వహించిందని గుర్తు చేశారు.

త్వరలో జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని చెప్పారు. మూడు నెల్లు పరిపాలన చేయగానే ఎలక్షన్ కోడ్ వచ్చిందనీ, ఇప్పుడే కోడ్ ముగిసిందనీ, హామీలు అమలు చేస్తామని చెప్పారు. ఆశా వర్కర్ల గురించి మాట్లాడే హక్కు హరీష్ రావుకు లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో గుర్రాలతో ఆశా వర్కర్స్‌ను తొక్కించారని తెలిపారు. పెద్దపల్లిలో జరిగిన ఘటనపై విచారణ జరుగుతుందనీ, ఆ ఘటన జరగటం దురదృష్టకరమన్నారు. శాంతి భద్రతల విషయంలో తమ ప్రభుత్వం సీరియస్‌గా ఉందని తెలిపారు. మత ఘర్షణల విషయంలో సీరియస్‌గా ఉన్నామనీ, వాటి వెనక ఎవరి హస్తం ఉన్నా ఉక్కు పాదంతో అణిచేస్తామని ట్విట్టర్ వేదికగా శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

బక్రీద్ పండుగపూటా పస్తులే

- ఐదు నెలల నుంచి జీతాల్లేక కాంట్రాక్టు ఉద్యోగుల ఇక్కట్లు
- కనికరం చూపని ఉర్దూ అకాడమీ కార్పొరేషన్
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ ఉద్యోగుల వేడుకోలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉర్దూ అకాడమీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు బక్రీద్ పండుగపూటా పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. ఐదు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తమ రెక్కల కష్టాన్నైనా గుర్తించాలని వేడుకున్నా కార్పొరేషన్ మాత్రం వారి పట్ల కనికరం చూపట్లేదు. దీంతో ఉద్యోగులు కుటుంబ పోషణ కోసం ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో 142 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారు 15 నుంచి 30 ఏండ్లుగా పనిచేస్తున్నారు. వారు జిల్లా మైనార్టీ కార్యాలయాల్లో, గురుకుల పాఠశాలల్లో, వక్ఫ్ ట్రిబ్యునల్ కోర్టుల్లో, సబ్సిడీ లోన్ల మంజూరులో, రంజాన్, క్రిస్మస్ దుస్తుల పంపిణీల్లో గ్రూపు 1,2,3 శిక్షణా కేంద్రాల్లో, హరితహారం, ప్రజా పాలన, అన్ని రకాల ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్నారు. వారికి ప్రతినెలా రూ.5 వేల నుంచి రూ.8,500 వరకు మాత్రమే వేతనాలు అందుతున్నాయి. ఇవి కూడా సమయానికి రాక పోవటంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. డిసెంబర్ నుంచి ఇప్పటివరకు జీతాలు చెలించక పోవటం వల్ల ఉద్యోగులకు కుటుంబ పోషణ భారంగా మారింది. ఒక్కొక్క ఉద్యోగికి 5 నుంచి ఆరు నెలల వరకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఇంటి అద్దె, పిల్లల చదువులు, ఫీజులు, వైద్యం, నిత్యావసర వస్తువుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తున్నదని వారు ఆందోళన చెందుతున్నారు. వాటి కోసం ఉద్యోగులంతా అధికారులు చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. చివరకు సీఎంఓ కార్యాలయం నుంచి ఆదేశాలొచ్చినా.. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

పెండింగ్ జీతాలు ఇప్పించాలి

ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉన్నా కార్పొరేషన్ నిర్లక్ష్యం వల్ల పండుగ పూట పస్తులుండాల్సి వచ్చిందని తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమి కంప్యూటర్ కం లైబ్రరీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అఫ్సాన్ అబ్రార్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అఖిల్ వాపోయారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఇప్పటికైనా తక్షణం పెండింగ్ జీతాలను ఇప్పించాలని కోరారు. పండుగపూట పస్తులుండాల్సిన దుస్థితి వచ్చిందని వాపోయారు.

బీఆర్ఎస్ పార్లమెంటరీపార్టీ నేతగా కేఆర్ సురేష్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీపార్టీ నాయకుడిగా రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్‌రెడ్డిని నియమిస్తూ ఆపార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారంనాడాయన లోక్‌సభ, రాజ్యసభ సెక్రటరీ జనరల్స్‌కు లేఖలు రాసారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న రాజ్యసభ సభ్యులు కే కేశవరావు కాంగ్రెస్‌పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేశవరావు స్థానంలో సురేష్‌రెడ్డిని నియమిస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ నియామకం తక్షణం అమల్లోకి వస్తుందని తెలిపారు. 0

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నవతెలంగాణ-మియాపూర్



ఓయో రూమ్‌లోని ఆరో అంతస్తు నుంచి దూకి యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. మాదాపూర్ సీఐ జి.మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన సాయి (30) నగరంలో ఉంటూ సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఇటీవల ప్రిలిమ్స్ పరీక్ష రాసి మెయిన్స్‌కు సిద్ధం అవుతున్నాడు. ఆదివారం నలుగురు ఫ్రెండ్స్‌తో కలిసి మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని ఓయో రూమ్‌కి వెళ్లాడు. అయితే అర్ధరాత్రి ఓయో హోటల్ ఆరో అంతస్తుపై నుంచి దూకి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాదాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. సాయి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. యువకుడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రేపటినుంచి సివిల్ సర్వీసెస్‌పై ఉచిత వర్క్‌షాప్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో వచ్చే సంవత్సరంలో యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈనెల 19 (బుధవారం) నుంచి పదిరోజులపాటు ఉచిత వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్టు రెఫ్లెక్షన్ ఐఏఎస్ అకాడమి ప్రకటించింది. ఈ మేరకు ఆ అకాడమి డైరెక్టర్, చీఫ్ మెంటార్ గడియారం వివేకానంద సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఉన్న తమ అకాడమిలో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో సివిల్స్ పరీక్షా విధానం, జనరల్ స్టడీస్‌లోని అన్ని సబ్జెక్టులు, ఆప్షనల్ ఎంపిక, న్యూస్ పేపర్ చదవడం, నోట్స్ తయారు చేసుకునే విధానం వంటి అంశాలపై సీనియర్ అధ్యాపకులు సమగ్ర అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న డిగ్రీ పూర్తయిన అభ్యర్థులు తమ పేర్లను 9866079891 వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

నీట్ అవకతవకలపై విచారణ జరపాలి

(మొదటిపేజీ తరువాయి)

అవకతవకలు జరిగాయని తెలిపారు. ఈ పరీక్షలు రాసిన 24 లక్షల మంది విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలనుంచి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షలు రాశారని వివరించారు. న్యాయ విచారణకు ఆదేశించాలనీ కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 20న అన్ని జిల్లాకేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ ముద్రణాలయ సంస్థ డైరెక్టర్‌గా రమణకుమార్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సిహెచ్ రమణకుమార్ సోమవారం ప్రభుత్వ ముద్రణాలయ సంస్థ డైరెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించారు. ప్రభుత్వ ముద్రణాలయ సంస్థ డైరెక్టర్‌గా ఉన్న ఎస్ శ్రీనివాసాచారిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మోడల్ స్కూల్ అదనపు సంచాలకులుగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. శ్రీనివాసాచారిని రమణకుమార్ శాలువా కప్పి సన్మానించారు. ప్రభుత్వ ముద్రణాలయ సంస్థ నూతన డైరెక్టర్ రమణ కుమార్‌ను నవతెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ జనరల్ మేనేజర్ రఘు, సేల్ బుక్ ప్రింటర్స్ ప్రతినిధి బాల్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ డైరెక్టర్ శ్రీనివాసాచారికి వీడ్కోలు పలికారు.

ఆలంఖాన్ నివాసానికి సీఎం రేవంత్‌రెడ్డి

- కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి బక్రీద్ శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్వర్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి నవాబ్ ముజాహిద్ ఆలంఖాన్ నివాసానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం వెళ్లారు. బక్రీద్ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈసెట్ మొదటి విడతలో 8,982 మందికి సీట్ల కేటాయింపు

- ఇంజినీరింగ్ కోర్సుల్లో 70 శాతం ప్రవేశాలు
- సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 21

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీటెక్, బీఈ, బీ ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో రెండో ఏడాదికి లాటరల్ ఎంట్రీ ద్వారా 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నిర్వహించిన ఈసెట్ మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో సోమవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈసెట్ ప్రవేశాల కన్వీనర్, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసెట్‌లో 22,365 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈసెట్ కౌన్సెలింగ్‌లో 12,757 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారనీ, వారిలో 12,703 మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. 169 ఇంజినీరింగ్ కాలేజీల్లో 12,785 సీట్లుంటే, 8,951 (70 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. 3,834 (30 శాతం) సీట్లు మిగిలిపోయాయని తెలిపారు. 121 ఫార్మసీ కాలేజీల్లో 1,180 సీట్లుంటే, 31 (2.6 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని వివరించారు. 1,149 (97.4 శాతం) సీట్లు మిగిలిపోయాయని వివరించారు. ఈసెట్‌లో మొత్తం 13,965 సీట్లుంటే, 8,982 (64.32 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఈసెట్‌లో 4,983 (35.68 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయకపోవడం వల్ల 3,773 మంది అభ్యర్థులు సీట్లు పొందలేకపోయారని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 529 మంది సీట్లు పొందారని పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా ట్యూషన్‌ఫీజును చెల్లించాలని కోరారు. సీట్లు కేటాయించిన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే గడువు ఈనెల 21 వరకు ఉందని వివరించారు. ఇతర వివరాలకు https://tgecet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నవతెలంగాణ
నవ్యత తెలుగు దినపత్రిక
8
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
మంగళవారం | జూన్ 18, 2024 | www.navatelangana.com

యూరో కిడ్స్ పాఠశాల ప్రారంభోత్సవం



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ పరిధిలోని 134 డివిజన్ ప్రశాంత్ నగర్‌లో ఏర్పాటు చేసిన యూరో కిడ్స్ పాఠశాలను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్ డీసీసీ ప్రెసిడెంట్ హరివర్ధన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బండి అక్షితరెడ్డి, హరివర్ధన్‌రెడ్డిలతో కలిసి మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ.. ఆటపాటలతో చిన్నారులను అభివృద్ధి బాటలో నిలపాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో బండి రామిరెడ్డి, శ్రీకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు చంద్రశేఖర్, నక్క ప్రభాకర్‌గౌడ్, సీఎల్ యాదగిరి, బొబ్బిలి సురేందర్‌రెడ్డి, నాగేశ్వరరావు, బలవంత్‌రెడ్డి, రాజసింహారెడ్డి, ఆంజనేయులు గౌడ్, చిన్నారులు పాల్గొన్నారు.

రోగికి ఆర్థిక సాయం అందజేసిన కౌన్సిలర్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని ఆదిత్య ఆస్పత్రిలో హిమబిందు అనే మహిళ అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. కాగా విషయం తెలుసుకున్న మేడ్చల్ మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ రామన్న గారి మణికంఠ గౌడ్ రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని రోగి కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని ఎన్జీవోఎస్ కాలనీకి చెందిన వినయ్ సతీమణి హిమబిందు అనారోగ్యంతో ఆదిత్య ఆస్పత్రిలో చేరారు. ఆర్థికంగా పేదవారు కావడంతో ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్‌ను పలువురు అభినందనలు తెలిపారు.

అవిశ్వాస తీర్మానానికి నేటితో గడువు ముగింపు

- నేతల్లో నెలకొన్న స్తబ్ధత
- కోర్టు మెట్లెక్కనున్న అవిశ్వాస పంచాయితీ

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహ రెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం గడువు నేటితో ముగియనుంది. అవిశ్వాస తీర్మానంపై 16 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన కాపీ ఇచ్చి నేటితో 30 రోజులు గడుస్తున్నాయి. కలెక్టర్ ఈ 30రోజుల లోపల అవిశ్వాస తీర్మానానికి తేదీలను ఖరారు చేసి అవిశ్వాసం నిర్వహించాలి. కానీ కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నిర్వహణపై కలెక్టర్ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో అవిశ్వాసం లేనట్టేనని తెలుస్తోంది. గత నెల 16వ తేదీన మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డికి వ్యతిరేకంగా 16 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసి కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ 16 మంది కౌన్సిలర్ల సంతకాల వెరిఫికేషన్ కోసం తీర్మాన కాపీని మేడ్చల్ మున్సిపల్ కార్యాలయానికి పంపించారు. కౌన్సిలర్ సంతకాలు ఓకే అంటూ మున్సిపల్ కార్యాలయం నుంచి తిరిగి కలెక్టరేట్ అందాయి. అవిశ్వాస తీర్మానానికి ముహూర్తం చూసుకోవడమే ఆలస్యమంటూ కలెక్టర్ ఉత్తర్వుల కోసం



16 మంది కౌన్సిలర్లు ఎదురు చూశారు.

అడ్డుపడ్డ అగ్ర నేతలు

అవిశ్వాస తీర్మానం కోసం ముహూర్తం సైతం ఖరారు చేసుకొని కలెక్టర్ ఉత్తర్వులు కోసం ఎదురుచూస్తున్న 16 మంది కౌన్సిలర్ల ఆశలపై కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు అగ్రనేతలు అడ్డుపడడంతో కౌన్సిలర్ల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి తీరు నచ్చక ఆమెపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే కాంగ్రెస్‌కు చెందిన అగ్ర నేతలే అడ్డుపడడంతో 16 మంది కౌన్సిలర్లు షాక్‌కు గురయ్యారు. 16 మందిలో 13 మంది కౌన్సిలర్లు మున్సిపల్ చైర్ పర్సన్ తీరు నచ్చక బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వస్తే కాంగ్రెస్‌లో సైతం వారికి చుక్కెదురైందని విమర్శలు వినిపిస్తున్నాయి. అవిశ్వాసానికి పార్టీ సీనియర్లు సహకరించకపోవడంతో భవిష్యత్తు కార్యాచరణ ఎంటని కౌన్సిలర్లు ఆలోచనలో పడ్డారు.

కోర్టు మెట్లు ఎక్కనున్న పంచాయితీ

మేడ్చల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు అవిశ్వాసానికి సహకరించకపోవడంతో చివరి అస్త్రంగా కోర్టును ఆశ్రయించాలని 16 మంది కౌన్సిలర్ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. అవిశ్వాస తీర్మానానికి కావాల్సిన బలం కాంగ్రెస్ పార్టీకి ఉన్నప్పటికీ పార్టీకి చెందిన ఇద్దరు అగ్ర నాయకులు అడ్డుపడడంతో విధిలేక కోర్టు ద్వారా నైనా అవిశ్వాస తీర్మానాన్ని పెట్టించేలా కోర్టును ఆశ్రయించాలని సదరు కౌన్సిలర్లు అనుకుంటున్నట్టు తెలుసుస్తోంది.

మల్కాజిగిరి సమస్యలు తీర్చే బాధ్యత నాదే..



- ఎంపీ ఈటల రాజేందర్

నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి నియోజకవర్గంలో భూగర్భ డ్రయినేజీ, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ వంటి అనేక సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదేనని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం వినాయక నగర్ కార్పొరేటర్ రాజలక్ష్మి ఆధ్వర్యంలో మున్నూరుకాపు కల్యాణ మండపంలో ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజ్యలక్ష్మి ఈటలను సత్కరించారు. డివిజన్ పరిధిలో నెలకొన్న రైల్వే వంతెనెల సమస్యలు, కలుషిత చెరువులు, నాలాల సమస్యలను పరిష్కరించాలని ఈటలకు ఆమె వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదేనన్నారు. వచ్చే ఐదేండ్లలో మల్కాజిగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ఎంపీగా గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, మహిళలు, తెదేపా నాయకులు ఈటలను సత్కరించి వారి కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రవణ్ కుమార్, బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భాను ప్రకాష్, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీకే మహేష్, రాష్ట్ర బీసీ నాయకులు గణేష్ చారి, సీనియర్ నాయకులు వడ్డీ సుబ్బారావు, ఓం ప్రకాష్, నవీన్ , సాయి సురేష్, శ్రీకాంత్, నరసింహగౌడ్, జగదీష్, గోపాల్, నరేందర్, శివ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50వేలు విరాళం



నవతెలంగాణ-కీసర

మండల పరిధిలోని చీర్యాల గ్రామంలో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ సర్పంచ్ ధర్మేందర్ రూ.50 వేలు విరాళం అందజేశారు. సోమవారం ఆలయన్ని కట్టే మేస్త్రి తాతారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మేందర్ కుటుంబ సభ్యులకు ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరారు.

ప్లాటు స్థలం కబ్జా.. కేసు నమోదు



నవతెలంగాణ-ఘట్కేసర్

ప్లాటు స్థలాన్ని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపట్టిన ఓ వ్యక్తిపై కేసు నమోదైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ రాజు వర్మ తెలిపిన ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ సత్యసాయి నగర్‌లోని సర్వే నంబర్ 44, ప్లాటు నెంబర్ 241ను బోడుప్పల్ కార్పొరేషన్ దేవేందర్ నగర్ కాలనీకి చెందిన బండ శ్యామల 2013లో కొనుగోలు చేశారు. 100 గజాల విస్తీర్ణం కలిగిన ప్లాటు చుట్టూ కడీలు పాతి హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల పక్క ప్లాటు యజమాని సురేష్ 60 గజాల స్థలాన్ని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. అదేమిటని అడిగితే దిక్కున్న చోట చెప్పుకో అంటూ బెదిరింపులకు పాల్పడి దుర్భాషలాడినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ స్థలాన్ని తమకు ఇవ్వాలని, లేదంటే మొత్తం స్థలాన్ని కొనుగోలు చేయాలని కోరితే బెదిరింపులకు దిగినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పేదలను ఆపదలో ఆదుకోవడమే లక్ష్యం



- సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వై. సుందర్‌రావు
- డయాలసిస్ పేషెంట్‌కు ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ఘట్కేసర్

సామాజిక సేవే లక్ష్యంగా ఆపదలో ఉన్న నిరుపేదలను తమ సంస్థ ద్వారా ఆదుకుంటామని సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వై. సుందర్‌రావు తెలిపారు. సోమవారం ఘట్కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో డయాలసిస్ బాధితుడికి రూ.15 వేల చెక్కును అందజేశారు. వరంగల్ జిల్లా, పాలకుర్తి మండలం, ముత్తారం గ్రామానికి చెందిన గ్యార సోమయ్యకు రెండు కిడ్నీలు పాడై ఉప్పల్‌లోని టీఎక్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సుందర్‌రావు తమ సంస్థ ద్వారా రూ.15 వేలు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జంపాల రమేష్, సోమయ్య, ఐలయ్య, వీరారెడ్డి, దేవేందర్, లింగస్వామి, బంగారు బాబు, మల్లికార్జున రావు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎంపీ ఈటల రాజేందర్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-అల్వాల్

బీజేపీ పార్టీ మల్కాజిగిరి ఎంపీగా గెలుపొందిన ఈటల రాజేందర్‌ను వీబీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన సభలో పలువురు పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ అత్యధిక మెజార్టీతో మల్కాజిగిరి ఎంపీగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అజయ్ రెడ్డి, వికే. మహేష్, భాను, ప్రకాష్, మల్లికార్జున గౌడ్, రాజిరెడ్డి, మాణిక్యరెడ్డి, మాచర్ల శ్రీనివాస్, వినయ్ కుమార్, తదితరులున్నారు.

ఎస్సీ రిజర్వేషన్లు 20 శాతం పెంచాలి



- బైండ్ల కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి రామచందర్
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బైండ్ల కుల సంఘం కమిటీ ఎన్నిక
- అధ్యక్షుడిగా బైండ్ల రామచందర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్

నవతెలంగాణ-శామీర్‌పేట

ఎస్సీ రిజర్వేషన్ 15 నుంచి 20శాతం పెంచాలని బైండ్ల కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి రామచందర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామ పరిధిలోని సంగీత్ ఫంక్షన్ హాల్లో బైండ్ల కుల సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఏపూరి రామచందర్ ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బైండ్ల కుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కమిటీ గౌరవ సలహాదారులు బైండ్ల కుమార్, సంజీవరావు, నర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఎస్సీ సామాజిక వర్గంలో మాల, మాదిగ లాగా బైండ్ల కులాన్ని ప్రధాన కులంగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బైండ్ల కుల సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బైండ్ల రాంచందర్, ఉపాధ్యక్షులుగా బైండ్ల శంకర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్, సంయుక్త కార్యదర్శిగా ప్రశాంత్, కోశాధికారిగా నర్సింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమంలో బైండ్ల కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాములు, జనరల్ సెక్రటరీ యాదగిరి, కోశాధికారి రామకృష్ణ, శ్రీను సునీల్ రమేష్ బాల నర్సింహ, వికారాబాద్ రంగారెడ్డి సంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు, బైండ్ల కులస్తులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన ఎంపీ ఈటల



నవతెలంగాణ-సిటీబ్యూరో

నేరేడ్‌మెట్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఎంపీ ఈటల రాజేందర్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక 140 డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, పూర్వ విద్యార్థులైన పిట్టల భాస్కర్, ఉడుతల నవీన్, ఎల్లముల మల్లేష్ ఆధ్వర్యంలో ఎంపీకి వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు నీటి కొరత తీర్చేందుకు బోర్వెల్ సౌకర్యం కల్పించాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే పాఠశాల ప్రహరీ గోడ ఎత్తు తక్కువ ఉండడం వల్ల బయట వ్యక్తులు గోడదూకి లోపలికి వస్తున్నారని, స్కూల్లో పలు సమస్యలను సృష్టిస్తున్నారని చెప్పారు. దొంగల బెడద ఉన్నందున గోడ ఎత్తు పెంచాలని కోరారు. పాఠశాలలో కేవలం బాలికలకు మాత్రమే వాష్‌రూం సౌకర్యం ఉందని, బాలలకు సైతం వాష్‌రూంలు నిర్మించాలని, ఎంఓఎం బి పరిధిలో అసంపూర్తిగా ఆగిపోయిన బాలికల మరుగుదొడ్లు, అసంపూర్తిగా ఆగిపోయిన డైనింగ్ హాల్స్ పూర్తి చేయాలన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ మేరకు ఎంపీ సానుకూలంగా స్పందించారు.

రక్తదాన శిబిరం, భోజన ప్యాకెట్లు పంపిణీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జన్మదినం సందర్భంగా మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్‌లోని 200 మంది చిన్నారులకు భోజన ప్యాకెట్లు అందజేశారు. అలాగే ఎంఎల్ఆర్ఐటీ విద్యార్థులు 100 మంది రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని కళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, అరుంధతి హాస్పిటల్ డీన్ డాక్టర్ ఉదయ్ కుమార్, బాలాజీ తదితరులతో కలిసి ప్రారంభించారు. తమ కళాశాల విద్యార్థులు ముందుకొచ్చి రక్తదానం చేయడం ద్వారా ఈ రక్తం ఎంతో మంది పేద ప్రజలకు పలు శస్త్ర చికిత్సలకు ఉపయోగపడుతుందని, విద్యార్థులు ఈ సామాజిక సేవను భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాయిని ఉదయ్ రంజన్ గౌడ్, వాలంటీర్లు ప్రశాంత్, ఆర్యన్, నరేష్, లికిత, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఎమ్మెల్యే మర్రి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-అల్వాల్

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. సోమవారం అల్వాల్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్, డోలి రమేష్, అనీల్ కిషోర్ గౌడ్, మల్లేష్ గౌడ్, నరేందర్ రెడ్డి, శోభన్ బాబు, వెంకటేష్, మల్లేష్‌గౌడ్, వీరేష్, ప్రకాష్ గౌడ్, రాజు, సదానంద్, ఫరీద్, జామ సరిత, రమేష్, సులోచన, తదిరతులున్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్‌లోని శ్రీపద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయ షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణోత్సవం భక్తుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ మెంబర్లు సూచించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ మురళీధర్ రెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, నర్సింగ్‌రావు, వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ మెంబర్లు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బక్రీద్ వేడుకలు



కీసరలో..

- ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని జామా మసీదులో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు పాషా బాయ్, జాంగిర్, జలీల్, అంజత్, మహమూద్, పాల్గొన్నారు.



జవహర్‌నగర్‌లో..

జవహర్‌నగర్‌లో..

జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని పలు ఈద్గాలలో బక్రీద్ ఈదుల్ జూహ ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయి. వెంకటేశ్వర కాలనీ పాత ఈద్గా, వికలాంగుల కాలనీ నయా ఈద్గా, అంబేద్కర్ నగర్, మల్కారం, ఫరానగర్, అరుంధతి నగర్, వైయస్సార్ నగర్ ఈద్గా లలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థనలలో జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు ఎండీ పాషామియా, కార్యదర్శి కాలేష పాల్గొని అల్లా అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండి మంచి జరిగేలా కరుణించాలని ప్రార్థించామని తెలిపారు. ప్రార్థనలు ప్రశాంతంగా ముగిసినందున పూర్తి స్థాయిలో సహకరించిన పోలీస్ శాఖకు ధన్యవాదాలు తెలిపారు.

శామీర్‌పేటలో..

పండుగలు ఐకమత్యానికి ప్రతీకలని ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ పవిత్రమైనదని కాంగ్రెస్ పార్టీ తూంకుంట మున్సిపల్ ప్రచార కమిటీ చైర్మెన్ చిర్రబోయిన రామచందర్ యాదవ్ అన్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట, మూడు చింతపల్లి మండలాల్లో ముస్లిం నూతన వస్త్రాలు ధరించి మజీద్, దర్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాగా తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ ఛైర్మెన్ చిర్రబోయిన రామచందర్ యాదవ్ తూంకుంటలోని మజీద్‌కు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



శామీర్‌పేటలో..

నేడు డబిల్‌పూర్ రైల్వే గేట్ మూసివేత

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని డబీల్‌పూర్ గ్రామం వద్ద ఉన్న రైల్వే గేట్‌ను 24 గంటల పాటు మూసేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఇంజనీరు అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్ మరమ్మతుల కారణంగా రైల్వే గేట్‌ను ఒకరోజు మూసేస్తున్నామని ఇదుకు ప్రజలు సహకరించాలని కోరారు.

'వర్జిన్ కొబ్బరి నూనె'తో సున్నితమైన చర్మం

నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్జిన్ కొబ్బరి నూనె శిశువు చర్మానికి సున్నితంగా ఉంచుతుంది. తల్లి, బిడ్డ మధ్య మసాజ్, స్నాన సమయం వారి భావోద్వేగ బంధాన్ని బలోపేతం చేయడమే కాకుండా, శిశువు చర్మాన్ని తేమగా, పోషణగా ఉంచుతుంది. పారాచూట్ అడ్వాన్స్‌డ్ బేబీ మసాజ్ ఆయిల్, తల్లి పాలలో ఉండే వర్జిన్ కొబ్బరి నూనెతో సమృద్ధిగా ఉంటుంది. ఇది బిడ్డ మెరుగైన ఎత్తు, బరువు పెరగడంలో సహాయపడటానికి సురక్షితమైనదని వైద్యపరంగా నిరూపించబడింది. పోషకాలు గల నూనెతో మసాజ్ సాధారణ టచ్ థెరపీ కంటే ఎక్కువ ప్రయోజనాలను అందిస్తుంది. చర్మ పనితీరు, థర్మోగ్రూలేషన్‌ను మెరుగుపరుస్తుంది. అయితే పెరుగుదల, ఎముకల బలం, కండరాల అభివృద్ధి, నరాల అభివృద్ధిపై సానుకూల ప్రభావం చూపుతుంది.

నవతెలంగాణ

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్

మంగళవారం | జూన్ 18, 2024 | www.navatelangana.com

గ్రంథాలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జగద్గిరిగుట్ట 126 డివిజన్ షిరిడి హిల్స్‌లో నూతనంగా నిర్మించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గ్రంథాలయాన్ని జులై మొదటి వారంలో ప్రారంభించడానికి తలపెట్టారు. ఈ మేరకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను ముఖ్య అతిథిగా రావాల్సిందిగా ఎస్ఎస్ఎల్ 126 డివిజన్ అధ్యక్షుడు సిహెచ్ దాసు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చర్లపల్లి రాములు, ఆనంద్, దళిత సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా సోమవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యే తప్పకుండా వస్తానని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

డివిజన్ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేద్దాం



- పుప్పాల భాస్కర్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారం 129 డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శివ గుప్తా ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పడిన కమిటీ, భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బీఆర్ఎస్ పార్టీ స్థానిక అధ్యక్షులు పుప్పాల భాస్కర్‌ను కలిశారు. బస్తీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కమిటీ హాల్ విషయమై చర్చించగా పుప్పాల భాస్కర్ స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానందతో మాట్లాడి అతి తొందరలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్యనారాయణ గుప్తా, యాదయ్య, సుమలత, లక్ష్మీ , లలిత, షీలా దేవి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో ఏదో కళ దాగి ఉంటుంది

- నర్తన ఋషి, ప్రముఖ నాట్యాచార్యులు డాక్టర్. సప్పా దుర్గాప్రసాద్
- ఘనంగా శ్రీదేవి సంగీత నత్య నికేతన్ 15 వ వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రతి ఒక్కరిలో ఏదో కళ దాగి ఉంటుందని దానికి వెలికి తీసి ప్రదర్శిస్తే సమాజం గర్వించదగ్గ కళాకారుడు అవుతారని నర్తన ఋషి, ప్రముఖ నాట్యాచార్యులు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి సౌభాగ్యనగర్‌లో గల శ్రీదేవి సంగీత నత్య నికేతన్ 15వ వార్షికోత్సవ వేడుకలు ఆదర్శ్ నగర్ ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు డాక్టర్ బి.సురేంద్ర, డాక్టర్ పద్మ శ్రీధర్, ఆదర్శనగర్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య, నవజ్యోతి విద్యాసంస్థల చైర్మెన్ ఎం.ఇందిరారెడ్డిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ యాంత్రిక జీవనానికి అలవాటు పడిన ఎంతోమంది శాస్త్రీయ, సంగీతం, నాట్యం లాంటి కళలకు దూరమవుతున్నారన్నారు. ఇటువంటి ప్రదర్శనల వల్ల మనుషుల్లో మానసికోల్లాసం పెంపొందుతుందని తెలిపారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రముఖ నాట్యచారిని జి.అచ్యుతాంబ శిక్షణలో వందల మంది పిల్లలకు నాట్యం కళను గత 15 సంవత్సరాల నుంచి నేర్పించి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తున్నారని.. ఆమెను వారు అభినందించారు. నాట్య కళాకారిని జి.అచ్యుతాంబ మాట్లాడుతూ ప్రముఖ ఆలయాల, పండగ పర్వదినాల సందర్భంగా నాట్య ప్రదర్శనలు నేటికీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

వెస్ట్రన్ కల్చర్ (పాశ్చాత్య సంస్కృతి) నడుస్తున్న నేటి తరుణంలో కూడా సంగీతం, నాట్యకళను నలుగురికి పంచే ఉద్దేశంతో ఇంత ఘనమైన కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం ప్రతిభ కనబరచిన కళాకారులను సన్మానించి మెమొంటోలతో, పాటు ప్రశంసా పత్రాలు వారి చేతులమీదుగా అందజేశారు. అనంతరం ఆదర్శనగర్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుల ఏర్వ శంకరయ్య చక్కని ప్రదర్శన నిర్వహించినందుకు పిల్లలందరి గురుదక్షిణగా తాను ఐదు వేల రూపాయల నగదును అందించారు. పిల్లల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.



ఘనంగా బక్రీద్ వేడుకలు



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు మైనారిటీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం ఎమ్మెల్యే కేపీ. వివేకానంద బక్రీద్ పండుగలో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లాకు తన కొడుకును బలిచ్చేందుకు ఒక తండ్రి సన్నద్ధమవగా, వారి త్యాగాలకు మెచ్చిన అల్లా కొడుకుకు బదులుగా ఒక బక్రీని బలివ్వమని తెలుపగా.. నాటి నుంచి బక్రీద్ పండుగ ప్రారంభమైం దన్నారు. ముస్లిం సోదరులు అత్యంత ఆనందోత్సవాల మధ్య తమను తాము అల్లాకు సమర్పించుకుంటూ పేదవారికి సహాయం చేస్తూ నిర్వహించుకునే పండుగలలో ఒకటి బక్రీద్ అని ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ముస్లిం సోదరులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు మైనారిటీ నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కె.ఎం.ప్రతాప్ బక్రీద్ శుభాకాంక్షలు ..

కుత్బుల్లాపూర్ గ్రామం, గాంధీ నగర్, నందానగర్, వెంకటరామిరెడ్డి నగర్ చెందిన పలు కాలనీల, బస్తీల ముస్లిం సోదరులు సోమవారం రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ ని కలిసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ప్రవక్తల అచంచలమైన భక్తి, త్యాగ నిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందన్నారు. తమకు ఉన్న దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని చాటిచెపుతోందని ప్రతాప్ అభిప్రాయపడ్డారు. ముస్లిం సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ సిరాజ్, షేక్ బాబుమియా, షేక్ గౌస్, మహమ్మద్ మక్బూల్, మహమ్మద్ రషీద్ ఉన్నారు.



హిందూ ముస్లింల సోదర భావానికి ప్రతీక బక్రీద్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

హిందూ ముస్లింల సోదర భావానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని జగద్గిరిగుట్టకార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం బక్రీద్ పండగ పురస్కరించుకొనిజగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో మగ్దుమ్ నగర్, శ్రీనివాస్ నగర్, ఈద్గాలో, గాజులరామారం డివిజన్ పరిధిలో గల లెనిన్ నగర్ ఈద్గాలో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కృషి చేసిందని తెలిపారు. అనంతరం ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, ఈద్గాల మత పెద్దలు పాల్గొన్నారు.

గాజులరామారం డివిజన్ పరిధిలో..

లెనిన్ నగర్, దేవేందర్ నగర్, కైసర్‌నగర్‌లోని ఈద్గాల వద్ద బక్రీద్ వేడుకలకు స్థానిక కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి హాజరై ముస్లిం సోదరులతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఐక్యతతోనే శాంతి సమాజం నెలకొంటుందన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మైనార్టీ నాయకులు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలో...

గురుమూర్తి నగర్, వెంకట్రామిరెడ్డి నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో గల ఈద్గాల వద్ద బక్రీద్ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్ పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీ నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

కూన శ్రీశైలం గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయకులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ జన్మదిన వేడుకలు సోమవారం గాజుల రామారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ నాయకులు హాజరై వారిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేకాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలం గౌడ్ జన్మదినం సందర్భంగా వారికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-దుండిగల్

అభిమానాన్ని చాటుకున్న కాంగ్రెస్ నాయకులు..

కుత్బుల్లాపూర్: కూన శ్రీశైలం గౌడ్ జన్మదినాన్ని ఆయన అభిమానులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పండుగల జరుపుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గమంతా హోర్డింగ్లు, కట్ అవుట్‌లు, బ్యానర్‌లతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, అభిమానాన్ని కాంగ్రెస్ శ్రేణులు చాటుకున్నారు. ముప్పై ఏండ్లుగా శ్రీశైలం గౌడ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కూనకు నెస్ట్ హాస్పిటల్ డైరెక్టర్ బి. వెంకన్న గౌడ్, ఫ్యామిలీ మెంబర్స్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కూన కూన శ్రీశైలం గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ... సోమవారం ఆది జాంబవ అరుంధతిమాత మహా శక్తి పీఠంధిపతి గజ్జల రాజగురువు ఆశీర్వదించారు. ఇంకా ఉన్నత స్థాయి పదవులు పొందాలని ఆశీర్వదించి శాలువాతో సత్కరించారు.

నవతెలంగాణ-దుండిగల్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



నవతెలంగాణ-దుండిగల్/కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు సోమవారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళున్నట్టు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అలాగే బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు ఎమ్మెల్సీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్తల అచంచలమైన భక్తి, త్యాగ నిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందని అన్నారు. తమకు ఉన్న దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ చాటిచెబుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

త్యాగానికి ధర్మానికి ప్రతీక బక్రీద్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

త్యాగనిరతికి ధర్మ నిబద్ధతకు ప్రతీక బక్రీద్ పర్వదినం అని కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. హిందూ, ముస్లిం పండగ ఏదైనా, భారతదేశంలో మత సామరస్యానికి గొప్ప ప్రతీకలని బండి రమేష్ అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని, కూకట్ పల్లి నియోజకవర్గ ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలియ జేశారు. మూసాపేట్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు మోయిజ్ ఏర్పాటు చేసిన, విందుకు బండి రమేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మోహన్ రెడ్డి, ప్రవీణ్, అరవింద్ రెడ్డి, ఫణి కుమార్‌లతో కలిసి హాజరయ్యారు.

కళాకారులను ప్రజలు ఆదరించాలి



- జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కళా కారులను ప్రజలు ఆదరించాలి అని కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన నాయకుడు ముమ్మారెడ్డి ప్రేవమ్ కుమార్ అన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ లిమిటెడ్ వారి సౌజన్యంతో, కూకట్‌పల్లి రామాలయం సమీపంలోని భారత్ వికాస్ పరిషత్ ట్రస్ట్ వేదిక నందు శ్రీకృష్ణరాయబారం పద్య నాటకం నిర్వహించారు. తోట సత్యనారాయణ, శ్యామ్, పట్టేల మురళీధర్, కోడిదల శివకుమార్‌ల ఆద్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి, ముఖ్యఅతిథిగా మ్మారెడ్డి ప్రేమ కుమార్‌ని ఆహ్వానించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ పద్య నాటకాలు, నాటికలు పురాతన కళలని వీక్షిస్తున్న సమయంలో, తన చిన్ననాటి రోజులు గుర్తుకొచ్చాయన్నారు. ఇటువంటి నాటకాలు నాటికలు అంటే చాలా ఇష్టమని, ఎల్లప్పుడూ కళాకారులను ప్రోత్సహిస్తానని తెలిపారు. అదేవిధంగా కళాకారులను ప్రజలందరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా ఆదుకొని ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం కళాకారుల ను ఆయన శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, కలిగినిడి ప్రసాద్, వాసుదేవ రావు, అడబాల షణ్ముఖ, మోహన్, రాచకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈఎన్‌టీ వైద్యశాలలో ఫాదర్స్ డే వేడుకలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కేపీహెచ్‌బీ కాలనీలోని డాక్టర్ రావుస్ ఈఎన్‌టీ వైద్యశాలలో ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ రావుస్ ఈఎన్‌టీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేసిన చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి ఫాదర్స్ డే వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా వైద్యశాల చైర్మెన్ డాక్టర్ జి.వి.ఎస్ రావు, మేనేజింగ్ డైరెక్టర్ చైతన్య రావు, డైరెక్టర్ శ్రీ రావులు పాల్గొని చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి, ఆటపాటలతో సందడి చేశారు. చిన్నారులకు గిఫ్ట్‌లను (స్కూల్ బ్యాగ్, కంపాక్స్ బాక్స్, లంచ్ బాక్స్, పెన్సిల్లుతో కూడిన కిట్) అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు మాటలు రాకపోవడానికి ప్రధానమైన కారణం పుట్టుకతోనే చిన్నారుల చెవిలో లోపాలు ఉండడమేనన్నారు. చెవికి సంబంధించిన వైద్య పరీక్షలు చేయించి అనుభవజ్ఞులైన డాక్టర్లతో శస్త్ర చికిత్స చేయిస్తే, మాటలు రాని చిన్నారులు తిరిగి మామూలు మనుషుల్లా మాట్లాడగలుగుతారన్నారు. పిల్లల మొహాల్లో చిరునవ్వు కనిపిస్తుందని అన్నారు. మాటలు రాని చిన్నారులలో లోపాలను సకాలంలో గుర్తించి, సరైన శస్త్ర చికిత్సలు చేయించాలన్నారు. చిన్నారులకు బంగారు భవిష్యత్తును అందించాలని తల్లిదండ్రులను కోరారు. ఇప్పటివరకు వైద్యశాలలో 50 మందికి పైగా పేద చిన్నారులకు ఉచితంగా అత్యాధునిక వైద్య పరికరాలతో అనుభాగ్యులైన డాక్టర్ శ్రీ రావు పర్యవేక్షణలో శస్త్ర చికిత్సలు నిర్వహించి, వారికి తిరిగి మాటలు వచ్చేలా చేయడం జరిగిందన్నారు. వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్స సేవలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో పేదలకు మరిన్ని వైద్య సేవలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువతను కాంగ్రెస్ ఆదరిస్తుంది



- కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న యువతకు కాంగ్రెస్ పార్టీ ఆదరిస్తుందని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి పట్నం సునీత మహేందర్ రెడ్డి ఆదేశాల మేరకు.. కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సహకారంతో కూకట్‌పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు కంది శ్రావణ్‌తో చర్చించి నియోజకవర్గం స్థాయి, డివిజన్ నూతన కమిటీ వేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం యువజన ప్రధాన కార్యదర్శులుగా జేరిపటి రాజు, ఎండీ రావుఫ్, యువజన కార్యదర్శిగా వినయ్ గౌడ్, యువజన సహాయ కార్యదర్శిగా శ్రీ హరి, ఫతేనగర్ డివిజన్ యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేశ్‌లు నూతనంగా నియమించారు. అనంతరం సతీష్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్ట పడుతున్న వారికి కాంగ్రెస్ పార్టీలో యువతకు మంచి అవకాశాలు కల్పిస్తుందన్నారు. నియోజకవర్గంలో ఇంకా ఎవరైతే ఉన్నారో వారికి కూడా రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవ, మైఖేల్, మహిళ నాయకురాలు రజిత, బోజ్జమ్మ, కుమ్ము బాబు, బాలానగర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, మేడ్చల్ జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ జన్మదిన వేడుకలు సోమవారం గాజులరామారంలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు, అభిమానులు మధ్య ఘనంగా జరిగాయి. ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో పాటు పార్టీ ప్రతినిధులు ఫోన్ ద్వారా కూనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి గజమాలతో ప్రత్యేకంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో ఉంటూ రాజకీయంగా ఉన్నత పదవులు అధిరోహించాలని అన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి, కేకేఎం ట్రస్ట్ చైర్మెన్, సోదరులు కూన శ్రీనివాస్ గౌడ్, కూన కుమార్ గౌడ్ తో పాటు పలువురు రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే కూనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచనోళ్ళ లక్ష్మీ, డివిజన్ నాయకులు రహమతుల్లా, సరభారెడ్డి, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
మంగళవారం | జూన్ 18, 2024 | www.navatelangana.com



బక్రీద్ పండుగ కుల మతాలకు అతీతంగా సోదర భావాన్ని పెంపొందిస్తుందని చంపాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోపాల్ ముదిరాజ్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా సరూర్‌నగర్ మజీద్ దగ్గర నమాజ్ కార్యక్రమంలో మిత్రుడు కాజా భాయ్, ఎదిరిస్ మొయినుద్దీన్, ముస్లిం సోదరులకు గోపాల్ ముదిరాజ్ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-సంతోష్‌నగర్

సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా రాంబాబు నాయక్



నవతెలంగాణ-చైతన్యపురి

సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా అంగోతు రాంబాబు నాయక్‌ను ఏకగ్రీవంగా రాష్ట్ర కార్యాలయంలో ఎన్నుకున్నారు. సోమవారం కార్యాలయం నందు జరిగిన సన్నాహక సమావేశం లో సేవా లాల్ సేన ముఖ్యనాయకుల సలహాలు, సూచనలను అనుసరించి తాజా పరిణామాలపై త్రిసభ్య కమిటీ సమావేశమై అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి సమన్వయంతో సంఘ సిద్ధాంతాలను కట్టుబడి పనిచేయాలని సూచిస్తూ మరోసారి రాంబాబు నాయక్‌ను అనుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి అధ్యక్షులుగా నియమించినందుకు త్రిసభ్య కమిటీ సభ్యులకు, అందుకు సహకరించిన జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులకు , శ్రేయోభిలాషులకు, సేవా లాల్ సేన కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యలపై స్పందించి తగు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

సింగరేణి గుర్తింపు సంఘం నాయకులతో విశ్రాంత ఉద్యోగుల భేటీ



నవతెలంగాణ-నాగోల్

హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సోమవారం సింగరేణి గుర్తింపు సంఘ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ప్రాతినిధ్య సంఘం సెక్రెటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్‌లతో సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై భేటీ అయ్యారు. కోల్ మైన్స్ పెన్షన్ పెంచాలని, చమురు సంస్థల్లో విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చినట్టుగా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని, కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్ మెడికేర్ స్కీం(సీపీఆర్ఎస్) ప్రస్తుతం రూ. ఎనిమిది లక్షల పరిమితి నేటి వైద్య సేవలకు సరిపోవడం లేదని కావున నేటి ధరలతో అనుగుణంగా మెడికల్ పరిమితి పెంచి ఆదుకోవాలని కోరారు. హైదరాబాద్‌లో నెల వారి మందులు ఇచ్చే ఏర్పాటు చేయాలని, రెండు నెలల క్రితం జరిగిన సీపీఆర్ఎస్ ట్రస్టు బోర్డ్ సమావేశంలో జరిగిన నిర్ణయాలను అమలు పరచాలని, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కోల్ మైన్స్ పెన్షన్ చట్టం సవరించి బొగ్గు పెన్షన్ దారులకు పెన్షన్ పెంచాలని సీఎం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి, అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొని రావాలని పెన్షన్ దారులు.. సింగరేణి గుర్తింపు సంఘం దష్టికి తెచ్చారు. తక్కువ కోల్ మైన్స్ పెన్షన్ పొందుతున్న వారికి కూడా ఆసరా పెన్షన్ ఇవ్వాలని వినతి పత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన కార్మిక సంఘ నాయకులు త్వరలో కేంద్ర, రాష్ట్ర మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారికి విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పై నివేదిక ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దండం రాజ్ రామచందర్ రావు, ఉప ప్రధాన కార్యదర్శి ఆళ వందార్ వేణు మాధవ్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఆర్.సి రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఎం.బాబురావు, మాజీ డైరెక్టర్ జె.వి.దత్తాత్రేయులు, నర్సింగ్ రావు, జి.కనకయ్య, పూర్ణ ప్రకాష్, సాయిరాం గౌడ్, వెంకట రమణ, మాధవ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు వంగ వెంకట్, మోట పలుకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు

ఘనంగా బక్రీద్ వేడుకలు శుభాకాంక్షలు తెలుపున్న ముస్లిం సోదరులు





బక్రీద్ పండుగ సందర్భంగా మలక్‌పేట్ ఈద్గా పూజాలే షా అక్బర్ భాగ్ వద్ద సోమవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మలక్ పేట్ ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ మిన్హాజుద్దీన్ ఈద్గా లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈద్గా వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అందరికీ ఎమ్మెల్యే బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-మలక్‌పేట్

పైపు లైన్ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన



నవతెలంగాణ-నాగోల్

నాగోల్ డివిజన్ పరిధిలోని శ్రావణ్ శ్రీ ఎంక్లేవ్‌లో వరద నీటి సమస్య పరిష్కారానికి పైప్ లైన్ నిర్మాణ పనులకు సోమవారం నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ నాథ్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శ్రావన్ శ్రీ ఎంక్లేవ్ నుంచి బండ్లగూడ భారత్ పెట్రోల్ బంక్ వరకు సుమారు రూ. కోటి 20 లక్షల నిధులతో వర్షపునీరు వెళ్లేందుకు పైప్ లైన్ పనులను చేపట్టి శాశ్వత పరిష్కారానికి కషి చేస్తున్నట్టు తెలిపారు. నూతనంగా నిర్మించబోయే వర్షపు నీటి పైప్ లైన్ పనులు నాణ్యత పరిణామాలలో ఏ మాత్రం తగ్గకుండా, ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా, భారీ వర్షాలు రాకముందే పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కాలనీ వాసులు రామ్మోహన్ శర్మ, మాధవ రెడ్డి, నాయకులు రావుల శ్రీనివాస్ గౌడ్,నరేందర్ రెడ్డి,శ్యామ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

భారత్ నుంచి అతనొక్కడే..



నవతెలంగాణ-హాయత్‌నగర్

ఎల్‌బీనగర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ అరుదైన ఘనత సాధించాడు. సుమారు 46 దేశాలకు చెందిన పోలీసుల అధికారులతో అమెరికా (ఐవీయల్‌బీ) అంతర్జాతీయ సందర్శకుల నాయకత్వ కార్యక్రమం 2024 ఏర్పాటు చేయగా ఎల్‌బీనగర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ ఒక్కడే భారతదేశం నుంచి ఆ కార్యక్రమానికి వెళ్లాడు. సుధాకర్ 2007 బ్యాచ్‌కు చెందిన పోలీస్. మొదటగా ఇన్‌స్పెక్టర్ గా పదోన్నతి రాగానే హైదరాబాద్ నగరంలోని ఇంటలీ జెన్స్ ఇన్‌స్పెక్టర్‌గా, భువనగిరి టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా, ఎస్ఓటీ ఎల్‌బీనగర్, మల్కాజిగిరిలో విధులు నిర్వర్తించాడు. ప్రస్తుతం ఎల్‌బీనగర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సర్వీస్‌లో సుమారు 8సంవత్స రాలు టాస్క్ ఫోర్స్, ఇంటలీ జెన్స్‌లో పనిచేసిన అనుభవం తోనే అమెరికాలో జరిగిన పెద్ద పెద్ద నేరాలపై అవగాహన సదస్సుకు తాను ఎంపికైనట్టు ఆయన చెప్పారు. అమెరికా ప్రభుత్వంతో సన్నిహితంగా ఉన్న సుమారు 46 దేశాలకు చెందిన పోలీస్ అధికారులను ఆహ్వానించి సుమారు నెల రోజుల పాటు 4 రాష్ట్రాలను చుట్టి ముఖ్యంగా మానవ అక్రమ రవాణా పై నివారణ ఎలా, గంజాయి, డ్రగ్స్, నకిలీ పాస్ పోర్ట్స్, అనుమతి లేకుండా దేశంలోకి చొరబడే వారి నివారణ, నకిలీ డాక్యుమెంట్‌తో ఇతర దేశాల్లోకి వెళ్లడం, సైబర్ క్రైమ్స్, మనీ లాండరింగ్, హవాలా డబ్బు అక్రమం గా రవాణా, సరిహద్దు దేశాల నుంచి అక్రమంగా రద్దు చేసిన సరుకులు రాకుండా ఆపడం, అంతర్జాతీయ దేశాల లో సేఫ్ అండ్ సెక్యూర్ పేరుతో ప్రతి దేశంలో నేర పరిశోధన విషయమై పోలీస్ అధికారులు పరస్పర సహకార సమాచారం పొందారు. అమెరికా పర్యటన ముగించుకుని సుధాకర్ విధుల్లో చేరిన సందర్భంగా ఆదివారం నవతెలంగాణతో ఆయన మాట్లాడుతూ అక్కడ క్రైమ్ చేధనలో చాలా అడ్వాన్స్ గా ఉండడంతో పాటుగా అక్కడి ఆర్మీ, పోలీసింగ్ వ్యవస్థకు అధిక బడ్జెట్ కేటాయింపు వల్లే పోలీసుల చేతుల్లో విలువైన ఆయుధాలు ఉంటాయని తెలిపారు. మన రాష్ట్రంలో కూడా అమెరికా వాడే అడ్వాన్స్ పద్ధతిని వాడితే నేరాల నియంత్రణ సులువు అవుందనే విషయంపై తమ ఉన్నతాధికారులకు తెలియజేస్తానని చెప్పారు. తనకు ఈ అవకాశం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉందని వెల్లడించారు.

'ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు 510 జీవో ప్రకారం వేతనాలు పెంచాలి'

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు 510 జీవో ప్రకారం 4వేల మందిని వెంటనే జీవో సవరణ చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా హెల్త్ మినిస్టర్ దామోదర్ రాజనర్సింహ్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే 4వేల కుటుంబాలకు జీవో 510 వెంటనే రిలీజ్ చేయాలన్నారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వేతనం గురించి ఒక నూతన కమిటీకి శ్రీకారం చూపెడతానని మంత్రి తెలిపారు. సమాన పనికి సమాన వేతనం కూడా త్వరలో ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. అనేక రకాల ఆ రాష్ట్రాల జీవోలను బట్టి తెలంగాణ రాష్ట్రంలో ఎలా చేయాలో ఆలోచిస్తామన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు మూడు రాష్ట్రాలు రెగ్యులరైజేషన్ చేశారని మంత్రిగా దృష్టికి తీసుకెళ్లామని రాజేష్ కన్నా తెలిపారు. రాష్ట్రంలో పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషిన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ కూడా రెగ్యులరైజ్ చేయాలని మంత్రి కోరారు. ఇతర రాష్ట్రాలలో రెగ్యులర్ చేసిన యొక్క కాపీలు జీవోలు మంత్రికి అందజేశామ న్నారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్ ఆయుష్ డిపార్టుమెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే సబితా



నవతెలంగాణ-చైతన్యపురి

ఆర్కేపురం డివిజన్ సౌభాగ్యపురం కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మెన్ సుధాకర్ గుప్తా.. సబితమ్మను శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రసాదం అందచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు లిక్కి ఊర్మిళ రెడ్డి, నెలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, వెంకటేష్ గౌడ్, జై శ్రీమన్నారాయణ, మహేందర్ రెడ్డి, మాజీ యూత్ వింగ్ అధ్యక్షుడు శ్యాంగుప్త, పబ్బు శ్రీనివాస్ గౌడ్, రమేష్ , స్వప్న రెడ్డి కాలనీ వాసులు వెంకట్ రెడ్డి, సర్సింహా రెడ్డి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ దష్టిని ఆకర్షిస్తున్న యూఎస్‌కు చెందిన కంబర్‌ల్యాండ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ విద్యార్థుల కోసం స్పాట్ అడ్మిషన్‌ను నిర్వహించనుంది. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాది కొత్త గ్రాడ్యుయేషన్ కోర్సులను ప్రారంభించింది. నేటి నుంచి అమీర్‌పేటలోని అదిత్య హోటల్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనుంది. ఈ విశ్వవిద్యాలయం అధునాతన డిగ్రీ కోర్సులతో పాటు మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ అండ్ మేనేజ్‌మెంట్‌లను ప్రవేశపెట్టింది. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు కలిగిన విశ్వవిద్యాలయం కోసం హైదరాబాద్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మార్క్ హన్షా అన్నారు. తాము కొత్తగా ప్రారంభించనున్న గ్రాడ్యేయేట్ ప్రోగ్రామ్ కోర్సులు అనేక మంది విద్యార్థులతో పాటు పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రూపొందించినట్టు చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న యూనివర్సిటీ అంతర్జాతీయ సేవా భాగస్వామి అయిన యూనివర్సిటీ హబ్, రిక్రూట్‌మెంట్ ప్రయత్నాల్లో ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ రంగాల్లో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. "నాష్‌విల్లే యునైటెడ్ స్టేట్స్‌లో అత్యంత వేగంగా అభివద్ధి చెందుతున్న వ్యాపార, సాంకేతిక కేంద్రాల్లో ఒకటి" అని హన్షా తెలిపారు.

'ఉచితంగా ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు'

- సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ చైర్మెన్ ఎం.సీ.శేఖర్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

భాషా, సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ సంయుక్త ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సినిమాటోగ్రఫీ రంగాల్లో ఆరు నెలల (ఆఫ్ లైన్, ఆన్ లైన్) ఉచిత డిప్లొమా కోర్సును నిర్వహిస్తున్నామని సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ చైర్మన్ ఎం.సీ.శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోటోగ్రఫీ అభిరుచి కలిగిన వారు లేదా వృత్తిగా స్వీకరించే వారికి ప్రాథమిక ఫోటోగ్రఫీతో పాటు పిక్టోరియల్ షఉటింగ్ నైపుణ్యాలను, అధునాతన సాంకేతికతలు, కంపొజిషన్, లైటింగ్, ఫ్రేమ్మింగ్, పోసింగ్ లలో అనుభవం కలిగిన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు.ఈ ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్స్ ఫోటోగ్రఫీ పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో పట్టణ, గ్రామీణ యువతకు సహాయం చేయడమే కాకుండా ఫోటోగ్రాఫర్‌గా ఎదిగి, వృత్తిగా స్వీకరించే వారికి ఉపాధి లభిస్తుందని వెల్లడించారు.ఆరు నెలల పాటు ఈ డిప్లొమా కోర్స్ శిక్షణ తరగతులు హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించబడుతాయని, ప్రాక్టికల్స్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతాయని, ఆన్ లైన్ లో శిక్షణ పొందేవారు తప్పకుండ ప్రాక్టికల్స్ కు హాజరు కావాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ ఇప్పటి వరకు 250కి పైగా జాతీయ, అంతర్జాతీయ ఫోటోగ్రఫీ వర్క్ షాప్ లు, శిక్షణ తరగతులు విజయవంతంగా నిర్వహించిన అనుభవం ఉందని, ఈ ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్స్ జులై 15 నుండి ప్రారంభమవుతాయని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబర్లలో (8008021075, 7095692175) ఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటల లోపు సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోగలరని, వెబ్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే వారు https://sapindia.org/free-workshops లింక్ ద్వారా చేసుకోగలరని, నమోదుకు ఆఖరు తేదీ జూన్ 30వ తేది వరకు ఉంటుందని ఆయన తెలిపారు.

మూడేండ్లకు ఆర్టీసీ బస్సు పున: ప్రారంభం



నవతెలంగాణ-హయత్‌నగర్

బస్సు సౌకర్యం లేక మన్సురాబాద్ ప్రెస్ కాలనీ, సౌత్ అండ్ పార్క్, సెవెన్ హిల్స్ కాలనీ, డి.పి నగర్, చండీశ్వర్ కాలనీల్లో ఉన్న ఉద్యోగులు విధులకు వెళ్లాలన్న, విద్యార్థులు కాలేజీలు, పాఠశాలకు సమయానికి వెళ్లాలన్నా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఐదు కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు ఈ సమస్యను బండ్లగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ దష్టికి తీసుకువెళ్లగా డిపో మేనేజర్ .. కాలనీలకు, రోడ్లపై వాహనాల పార్కింగ్, కూరగాయల సంత ఏర్పాటు చేస్తుండడంతో బస్సు రాకపోకలతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని కాలనీ వాసులకు వివరించారు. కాలనీవాసులు స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసుల సహకారంతో రోడ్లపై వాహనాల అక్రమ పార్కింగ్ చేయకూడదని హెచ్చరికలు జారీ చేసేలా చేసి జరిమానా సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు. అలాగే కాలనీలలో కూరగాయల సంతను ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు డిపో మేనేజర్ చేసిన విజ్ఞప్తికి ఆర్టీసీ యాజమాన్యం స్పందించి సోమవారం ఉదయం 7:30కు కోఠి మీదుగా సికింద్రాబాద్, 8:30కు సెక్రటేరియట్‌కు.. రెండు ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు.దీంతో ఆయా కాలనీవాసులు ఆర్టీసీ యాజమాన్యానికి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇన్ కాలనీ వాసులు నాగార్జున, ఎం. లింగారెడ్డి విజయపాల్ రెడ్డి, రాంబాబు, ఎంవీఎస్ మూర్తి, విజయ రాములు, సెవెన్ హిల్స్ కాలనీ కత్తుల రాంబాబు , ద్వారకా నగర్ అరుణ్ కుమార్ కిరణ్ కుమార్, ప్రెస్ కాలనీ ఎం.యాదగిరి యాదవ్, కే నరేందర్ రెడ్డి, సుభాష్, కిషన్ ,శంకర్ గౌడ్, రంగారెడ్డి, నవీన్ ,జంగారెడ్డి ,వెంకన్న తదితరులు ఉన్నారు.

ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా బకాయి ఉన్న 20 లక్షల మంది విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పి.సాయిబాబా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. సోమవారం అశోక్‌నగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఇంజనీరింగ్, మెడిసిన్, బి-ఫార్మసీ, ఎంబీబీఎస్, కోర్సులు పూర్తయిన వారి సర్టిఫికెట్లను కాలేజీ యజమాన్యాలు ఇవ్వడం లేదన్నారు. దాంతో చాలామంది విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తెలంగాణలో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, వత్తి విద్యా కళాశాలల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. కాలేజీ యజమాన్యాలు ఫీజు చెల్లించాల్సిందిగా ఒత్తిడి తెస్తున్నారని, దాంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సుమారు రూ.7800 కోట్ల బకాయిలు కాలేజీలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తును దష్టిలో పెట్టుకుని ఫీజు రియంబర్స్ మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజగౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, యాదిగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై టాస్క్‌ఫోర్సుల దాడులు

- ఏడుగురు నిందితుల అరెస్టు

నవతెంగాణ-సిటీబ్యూరో

నగరంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్సు పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. ఈ క్రమంలో కుల్సుంపురా, ఛత్రినాఖా, ముషీరాబాద్, కాచిగూడా పలు ప్రాంతాలల్లో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. ఏడుగురు నిందితులపై కేసులు నమోదు చేసిన పోలీసులు వారి నుంచి (242 బాటిల్స్) 96.5 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1,12,000లుంటుందని తెలిపారు. నగరంలో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా వేసినట్టు డీసీపీ రష్మి పెరుమాళ్ తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కారం కోసం కృషి



- బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

నవతెంగంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్‌లోని 31వ డివిజన్ గ్రీన్ రిచ్ కాలనీలో నెలకొని ఉన్న విద్యుత్ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గ్రీన్ రిచ్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 100కేవి ట్రాన్స్ ఫార్మర్ ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంబించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు.విద్యుత్ సమస్య పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు రమాకాంత్, రవీందర్ రెడ్డి, మోహన్ కృష్ణ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళ్ హాట్ పోలీస్టేషన్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం. మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అగాపుర, దిగంబర జైన్ టెంపుల్ ఎదురుగా, అదినాథ్ రెసిడెన్సీ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వ్యక్తిని పరిశీలించారు. ఎడమ చేతికి తెలుగులో టి.బాలకృష్ణ అనే పేరు, మంచి చేతికి దుర్గ మాత టాటు(మచ్చ) ఉంది. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉంటుంది. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జాగ్రత్తగా ఉండాలి

జీహెచ్ఎంసీ, పోలీస్, వాటర్‌బోర్డు శాఖల అధికారులతో మంత్రి టెలీ కాన్ఫరెన్స్

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారీ వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ, పోలీస్, వాటర్ వర్క్స్, విద్యుత్, డిఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. సోమవారం అధికారులతో మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఎవరు నిరక్ష్యంగా ఉండకూడదని అందరూ విధుల్లో ఉండాలని ఆదేశించారు. 141 వాటర్ లాకింగ్ పాయింట్స్‌ల వద్ద సిబ్బందిని ఉంచి నీళ్ళు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. తక్కువ సమయంలో ఒకేసారి భారీ వర్షం కురియడంతో శేరిలింగంపల్లి, చార్మినార్, ఎల్బీనగర్, గోల్కొండ, ఆసిఫ్ నగర్ , షేక్ పెట్ ప్రాంతాల్లో వర్షం నమోదైందని అధికారులు తెలిపారు. ఎక్కువగా ట్రాఫిక్ ఉండే ప్రాంతాల్లో నామ మాత్రపు వర్షం పడిందని పెద్దగా ఇబ్బందులు లేవని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. చెట్లు పడిన ప్రాంతాల్లో వెంటనే వాటిని తొలగించాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ నుండి మానిటరింగ్ చేయాలని హైదరాబాద్ సీపీకి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో జీహెచ్ఎంసీ ఇంచార్జి కమిషనర్ ,డైరెక్టర్ ఈవిడిఎం ,జోనల్ కమిషనర్లు, హైదరాబాద్ కలెక్టర్ ,హైదరాబాద్ కలెక్టర్ , హైదరాబాద్ సీపీ తదితర ముఖ్య అధికారులు..



ఆరోగ్యవంతులు మూడు నెలలకోసారి రక్తదానం చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఆరోగ్యవంతులు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ శాఖ మెడికల్ క్యాంపు కో-కన్వీనర్ కల్పన దత్త అన్నారు. సోమ వారం ఆమె మాట్లాడుతూ.. 18 నుండి 55 సంవత్సరాలు లోపు వయసు ఉన్న ఆరోగ్యవంతులు ఎవరైనా రక్తాన్ని దానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. రక్త దానం చేయడం వలన బలహీన పడి, నీరశించిపోతారనే అపోహ ఉందని రక్త దానం వలన ఎలాంటి బలహీనత, నీరసం సంభవించదని ఎప్పటి లాగే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. 18 నుండి 55 సంవత్సరాల మధ్య వయస్సు గల ఆరోగ్యవంతులు ప్రతి 3 నెలలకు ఒకసారి రక్త దానం చేయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్త దానం చేసి నట్లయితే అనేక ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.

పండుగలను అందరూ కలిసి మెలిసి జరుపుకోవాలి

- ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్



నవతెలంగాణ-ముషీరాబాద్

అన్ని వర్గాల ప్రజలు అన్ని పండుగలను కలిసి జరుపుకోవాలని ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఇన్ స్పెక్టర్ నిరంజన్ అన్నారు. బక్రీద్ పండుగ సంద ర్భంగా ముషీరాబాద్ నియోజక వర్గం మైనారి టీ నాయకులు మహ్మద్ ఫారూఖ్, రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షుడు ఎం.ఎ.వాహెద్ అలీ, మహ్మద్ అబ్దుల్లా ఫారూఖ్, మహ్మద్ యాహియా మోహియుద్దీన్, మహ్మద్ ఫహీంలు సిఐ నిరంజన్‌ను కలిశారు. ఈ సందర్భంగా సిఐ నిరంజన్ మైనారిటీ నాయకులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. అలాగే ముషీరాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహను కలిసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు.

'సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సీజనల్ వ్యాధుల పట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎఫ్‌టీసీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ నర్సు బాయి అన్నారు. సోమవారం మాట్లాడుతూ.. వర్షాకాలం మొదలవడంతో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వ్యాధులతో ప్రజలు బెంబేలెత్తె అవకాశం ఉందన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధులను గురించి వివరించారు. దోమల వల్ల చికున్ గున్యా వస్తుందని ఇందులో లక్షణాలు ప్రధానంగా కీళ్లలో తీవ్రమైన నొప్పిని కలిగిస్తుందని ఎల్లో ఫీవర్ దోమల ద్వారా మాత్రమే వ్యాపిస్తుందని చెప్పారు. టైఫాయిడ్ వర్షాకాలంలో వచ్చే సాధారణ వ్యాధి అని నీర్లు లేదా కలుషితమైన, అపరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల వస్తుందన్నారు. ఇది సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుందని ఇందులో జుట్టు రాలడం, బరువు తగ్గడం, కండరాల బలహీనత వంటివి ఉండవ చ్చని శరీరంలో అధిక జ్వరం, తలనొప్పి, ఇన్ఫెక్షన్ ఉంటాయని తెలిపారు. వైరల్ జ్వరం దీనిని సీజనల్ ఫీవర్ అని అంటారని వాతావరణంలో మార్పుల కారణంగా, ప్రధానంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు దీని బారిన పడుతుంటురన్నారు. దీని ప్రధాన లక్ష ణాలు జలుబు-దగ్గు, తరచుగా తుమ్ములు, తలనొప్పి లక్షణాలు ఉంటాయన్నారు. డెంగ్యూ వ్యాధి దోమలు కుట్టడం ద్వారా వ్యాపిస్తుందన్నారు. దోమ కాటు వల్ల కీళ్ల నొప్పులు, ప్లేట్‌లెట్స్ పడిపోవడం, బలహీనత ఏర్పడతాయ న్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం

- ఈదురు గాలుల విధ్వంసం
- ఉరుములు, మెరుపులతో కూడిన వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు









నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృత్తమైంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత భారీ వర్షం కురువడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రేటర్ హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఫలితంగా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఉరుములు, మెరుపులు..

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బలమైన గాలుల దాటికి కొన్ని చెట్లు విరిగి పడ్డాయి. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, షేక్‌పేట, ఖైరతాబాద్, పంజాగుట్ట, లక్డీకపూల్, అమీర్‌పేట, రాజేంద్రనగర్, అత్తాపూర్, కిస్మత్‌పురా, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, యూసఫ్‌గూడ, లంగర్‌హౌస్, గండిపేట, శివరాంపల్లి, ఎల్బీ నగర్, మన్సూరాబాద్, నాగోల్, బీఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, కొత్తపేట, దిల్ సుఖ్ నగర్, మలక్ పేట, సంతోష్ నగర్, ఐఎస్ సదన్, ఉప్పల్, కాప్రా, మేడ్చల్, హైటెక్ సిటీ, కొండాపూర్, మియాపూర్, బీహెచ్‌ఈఎల్, సికింద్రాబాద్, బేగంపేట, ఫిలింనగర్ ప్రాంతాల్లో జోరుగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జీహెచ్ఎంసీ విపత్తు నిర్వహణ బృందం రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావద్దంటూ జీహెచ్ఎంసీ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ బల్దియా సూచించింది. వర్షం పడుతుండటంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య నెలకొంది.

విరిగిపడ్డ చెట్లు.. కరెంట్ సమస్య..

వర్షం ధాటికి చాలా ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పలు ప్రాంతాల్లో కరెంట్ సమస్య నెలకొంది. ఈదురు గాలుల కారణంగా టోలిచౌకీ-గోల్కొండ ఎండీ లైన్స్‌లో 200 ఏండ్ల నాటి వృక్షం నేల కూలింది. ఈ ఘటనలో ఒక వ్యక్తికి గాయాలు కాగా.. నాలుగు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించిన నేపథ్యంలో మరో మూడురోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

చదువుతోనే బలహీన వర్గాలకు గౌరవం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రతి ఒక్కరూ చదువుకుంటే ప్రత్యేకంగా బీసీ, ఎస్సీ, ఎస్టీల కులగౌరవం కుటుంబ గౌరవం పెరుగుతుందని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య అన్నారు. సోమవారం విద్యానగర్ బీసీ భవన్‌లో విద్యార్థులతో కలిసి బడికి పోదాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీలు తమ పిల్లలను బడికి పంపాలని కోరారు. పిల్లలు చదువుకుంటే భవిష్యత్తులో వారు డాక్టర్స్, ఇంజనీర్స్, కలెక్టర్స్, ఆఫీసర్స్ అవుతారని ఈ కులాల గౌరవం పెరుగుతుందని ఆ కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. విద్య, వైద్యం ప్రతి విద్యార్థికి ఇవ్వాలని రాజ్యాంగం ఆదేశించిన 76 సంవత్సరాల కాలంలో ఇప్పటికీ ఆ ఆశయం నెరవేరలేదన్నారు. భారతదేశంలో పటిష్టమైన వ్యవస్థల నిర్మాణానికి అనేక రకాల మూఢ నమ్మకాలు, కులాలు అవాంఛనీయ శక్తులుగా ఎదిగాయని ఈ అవాంఛనీయ శక్తులలో ప్రధానంగా కుల వ్యవస్థ మొత్తం జాతి పైన నిర్దాక్షిణ్యమైన, విచ్ఛిన్నకర ప్రభావాన్ని చూపిస్తూనే ఉందన్నారు. దీనిని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరు విద్యావంతులు కావాలని విద్యా ద్వారానే కుల నిర్మూలన జరుగుతుందన్నారు. మూఢ విశ్వాసాలు, మూఢనమ్మకాలు తొలగిపోయి అజ్ఞానం, అంధకారం, అమాయకత్వం నుంచి ప్రజలను విముక్తి చేసి ఒక విజ్ఞానవంతమైన, శాస్త్రీయ జ్ఞానంతో కూడిన సమాజంను నిర్మాణం చేయగలమని తెలిపారు.

ప్రశాంతంగా ఈద్ ముబారక్..



- మీరాలం ఈద్గాలో భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు..
- పోలీసుల బందోబస్తు..

నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీలో ముస్లిం సోదరులు సోమవారం బక్రీదు పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. బహదూరురా మీరాలం ఈద్గాలో వందలాది మంది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మీరాలం ఈద్గాలో మక్కామసీదు ఇమామ్ మౌలానా రిజ్వాన్ ఖురేషీ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో షామియానాలు, జానిమాజ్ తదితర ఏర్పాట్లు చేశారు. వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో మంచినీటిని ఏర్పాటు చేశారు. ప్రార్థనలకన్నా ముందు మౌలానా జాంర్‌పాషా హుసామి బక్రీదు పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ స్థోమతను బట్టి ఖుర్బానీ ఇవ్వాలని గుర్తు చేశారు. ఖుర్బానీలో ఒక వంతు పేదలకు, ఒక వంతు బంధువులకు, ఒక వంతు కుటుంబసభ్యులకు వినియోగించాలని సూచించారు. హజ్రత్ ఇబ్రహీం కాలం నుంచి వస్తున్న ఈ సంప్రదాయాన్ని ముస్లిం సోదరులందరూ పాటించాలన్నారు. హజ్రత్ ఇబ్రహీం (అలై), హజ్రత్ ఇస్మాయిల్ల త్యాగాన్ని గుర్తుచేస్తూ, ముస్లింలు వారి త్యాగాన్ని గుర్తుచేసుకుని నూతనోత్తేజం పొందాలన్నారు. యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతున్నార న్నారు. ముస్లింలు అల్లా, ప్రవక్తల బోధనలను శిరసా వహించాలని, వారు చూపిన మార్గంలో నడిచినప్పుడే సత్సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనలకు వచ్చేవారికి పలు ప్రయివేట్ సంస్థలు, వ్యక్తులు స్వచ్ఛందంగా మంచినీటి ప్యాకెట్లను సరఫరా చేశారు.

పోలీస్ బందోబస్తు..

బక్రీదు పండుగ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచే పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. మీరాలం ఈద్గాలో బక్రీదు ప్రార్థనలను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా పోలీసులు బాంబుస్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించారు. మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు చేసిన అనంతరం ఈద్గా మైదానంలోకి అనుమతించారు. పోలీస్ ఉన్నతాధికారులు విక్రంసింగ్ మాన్, విశ్వజిత్, వి.సత్యనారాయణ, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా తదితరులు ఈద్గా వద్ద బందోబస్తును పర్యవేక్షించారు.

సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా డా.ఆకుల నరేష్ బాబు



నవతెలంగాణ-అంబర్‌పేట

సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ ఆకుల నరేష్ బాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బర్కత్ పురలోని తెలంగాణ రాష్ట్ర ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నరేష్ బాబును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆకుల నరేష్ బాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ గురుతర బాధ్యతలు అప్పగించినందుకు సామాజిక సమరసతా వేదిక అఖిల భారత కన్వీనర్ శ్యాంప్రసాద్, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, రాష్ట్ర ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను నేరవేర్చడానికి తన శక్తిమేరకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సేవాలాల్ సేనా రాష్ట్ర కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్

- త్రిసభ్య కమిటీ రద్దు, పంచసభ్యుల కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-ముషీరాబాద్

సేవాలాల్ సేనా రాష్ట్ర కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్‌ను పూర్తి స్థాయిలో నియమించినట్లు సేనా వ్యవస్థాపక అధ్యక్షులు సంజీవనాయక్ తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉన్న త్రి సభ్య కమిటీ పూర్తిగా విఫలమైనందున ఆ కమిటీని రద్దు చేసి పంచ సభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్రి సభ్య కమిటీ రద్దయిన తరువాత ఇ న్‌చార్జీగా కొనసాగుతున్న సైదానాయక్‌ను కన్వీనర్‌గా నియమించిన ట్లు తెలిపారు. గతంలో ఉన్న రాష్ట్ర కమిటిలో కొద్ది మంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం సంఘాన్ని ఉపయోగించు కున్నందుకు పాత కమిటీని రద్దు చేశామని తెలిపారు. అంతేకాకుండా గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఏకపక్షంగా ఒక పార్టీకి మద్దతు తెలపడాన్ని రాష్ట్ర కమిటీ తప్పుపట్టి రద్దు చేశామని పేర్కొన్నారు. ఈ నెల 21న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేనా రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేవాలాల్ సేనా కన్వీనర్ మాలోత్ సైదానాయక్, వ్యవస్థాపక ధర్మ జాగరణ జాతీయ అధ్యక్షులుగా రమేష్ మహరాజ్, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా స్వరాజ్ నాయక్, ఉద్యోగ సేనా రాష్ట్ర ఇన్‌చార్జీగా మూడావత్ కృష్ణానాయక్, కోకన్వీనర్లుగా బానోత్ హుస్సేన్నాయక్, వెంకన్న నాయక్, అజయ్ నాయక్, మోతీలాల్ నాయక్, భాస్కర్ నాయక్, కొర్రా శ్రీను, రాజేష్ నాయక్, భానోత్ బాలునాయక్, శంకర్ నాయక్, హైదరాబాద్ సీనియర్ నాయకులు కళ్యాణ్ నాయక్, శశిప్రసాద్, భానోత్ కిషన్ నాయక్, రవినాయక్, రామునాయక్ తదితరులు ఏకగ్రీవంగా నియమించినట్లు తెలిపారు.

పీఏఓ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బొగ్గులకుంటలో చెల్లింపులు, ఖాతాలు(పే అండ్ అకౌంట్స్) హైదరాబాద్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షురాలిగా ఎ. శ్రీలక్ష్మి, ప్రధానకార్యదర్శిగా గంట సత్యనారాయణ, కోశాధికారిగా కె. బాలనర్సింగరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా నోమురాజ్, ఉపాధ్యక్షులుగా అరుణ కుమారి, వై. కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, సులో చన, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఫహీముద్దీన్, ప్రచార కార్యదర్శిగా క్రాంతి కుమార్, క్రీడల కార్య దర్శిగా సుధీష్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా సాయికృష్ణ, అజ్మత్లు ఎన్నికయ్యారు.

పిల్లలను ఆత్మరక్షణ శిక్షణలో తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

- బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆత్మ రక్షణ శిక్షలో ప్రత్యేక శిక్షణ అందించి ప్రోత్సహించాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ వినయ్ కుమార్ తెలిపారు. రుద్రమదేవి షోటోకన్ కరేట్ సెల్ఫ్ డిఫెన్స్ వారు గత 45 రోజులు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుకలు గాంధీనగర్ డివిజన్ లోని టీఆర్‌టీ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వినయ్ కుమార్ హాజరై సమ్మర్ క్యాంప్ శిక్షణ లో ప్రావీణ్యం పొందిన కరాటే విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. ప్రస్తుత జీవన విధానంలో జరుగుతున్న ఎన్నో అసాంఘిక కార్యకలాపాలను మనం చూస్తున్నామని వాటిని ధీటుగా ఎదుర్కునేందుకు నేటి తరం యువతకు ముఖ్యంగా ఆడపిల్లలకు ధైర్యసాహసాలతో పాటు ఆత్మ రక్షణ చాలా అవసరమన్నారు. అందుకు కరాటే లాంటి ఎన్నో విద్యలు దోహదపడతాయని, అందుకు పిల్లల తల్లిదండ్రులు ఆత్మరక్షణ శిక్షణ లో ప్రోత్సాహాన్ని అందించాలని అందుకోరకు శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిన రుద్రమదేవి షోటోకన్ కరాటే సెల్ఫ్ డిఫెన్స్ మాస్టర్ నారాయణ సౌజన్యానికి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్‌కేడిఎ ఇండియా చీఫ్ ఎగ్జామినర్ క్యోషి డాక్టర్ రవి, ఫౌండర్ షిహన్ ఎస్.లక్ష్మి, బసవరాజు, నర్సింగ్, నిజాం భాయ్, వెంకట్ పాల్గొన్నారు.

రచయిత్రి అరుంధతి రాయిపై ఉపా కేసులు ఎత్తివేయాలి



సీపీఐ (ఎం.ఎల్.) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పి.రంగారావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే.రమ, కే.సూర్యం, ఎస్ఎల్ పద్మ

నవతెలంగాణ-ముషీరాబాద్

అరుంధతి రాయ్, ప్రో.షేక్ షౌకత్ హుస్సేన్ పైన పెట్టిన అన్ లా ఫుల్ ప్రివెంటివ్ యాక్ట్ (ఉపా) పేరుతో ప్రాసిక్యూషన్ చేయడాన్ని నిలిపివేయాలని సీపీఐ (ఎం.ఎల్.) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యానగర్ లోని మార్క్స్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ (ఎం.ఎల్.) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పి.రంగారావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే.రమ, కే.సూర్యం, ఎస్ ఎల్ పద్మలు మాట్లాడుతూ 14 సంవత్సరాల కిందట కాశ్మీర్ సమస్యపై అరుంధతి రాయ్ మాట్లాడిన దాన్ని తిరగదోడి ప్రముఖ రచయిత్రి, అనేక సామాజిక అంశాలపై విశ్లేషణ చేపట్టే అరుంధతి రాయి పైన మోడీ- షాల ప్రభుత్వం ఉపా కేసు పేరుతో వేధించే చర్యలను మానుకోవాలని, మోడీ ప్రభుత్వం ప్రజాస్వామిక వాదులను, హక్కుల కోసం ఉద్యమించే వారి పైన హింసించే చర్యలను నిలిపివేయాలని కోరారు. కాశ్మీర్ సమస్య భారతదేశంలో సుదీర్ఘకాలం కాశ్మీర్ జాతి హక్కులను కాపాడటానికి జరిగిన పోరాటం, ఆ పోరాటానికి భారతదేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ కాశ్మీర్ ప్రజల పోరాటానికి, స్వయంప్రతిపత్తికి మద్దతు లభించింది. భారతదేశ పౌరులుగా ఈ దేశంలో హక్కులు హరించబడినప్పుడు మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు ఉద్యమకారులు, పార్టీలు స్పందించాయి. ఏ సమస్యపైన అయినా స్పందించి తమ గొంతును వినిపించడం, హక్కులు కాపాడాలని తెలపడం ప్రజాస్వామ్య దేశంలో సహజమైనది, సహేతుకమైనది. మోడీ, షాల ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారందరినీ వాళ్లు ముఖ్యమంత్రి అయినా, మేధావులైనా జైళ్లలో పెట్టి హింసించడం అప్రజాస్వామిక మైనది, దీనిని భారత దేశ ప్రజలందరూ, పౌరులందరూ వ్యతిరేకించాలన్నారు. దేశంలో ప్రతిష్టాత్మకమైన నీట్ ఎగ్జామ్ పేపర్ లీకేజ్ బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. అక్రమాలకు, అవినీతికి పాల్పడి లక్షల మంది కుటుంబాల ను, విద్యార్థులను ఆందోళనకు గురిచేసిన వారిపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు జడ్జిచే విచారణ జరిపించాలని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే చర్యలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని ఎవరైతే పేపర్ లీకేజీకి బాధ్యులైన వారితోనే విచారణ కమిటీ వేయడం అనేది హాస్యాస్పదమైనదని, అక్రమమైనదని వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

బీసీ కులగణనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ గొంటి విక్రమ్ యాదవ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

బీసీల కులగణన, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల పెంపుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ గొంటి విక్రమ్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ ప్రేరేపిత బీసీ సంఘాల నాయకులు గుర్తించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందన్నారు. సీఎం ఎ.రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణనకు జీవో నెంబర్-26 విడుదల చేసి రూ.150 కోట్ల నిధులను కేటాయించిన విషయాన్ని బీసీ నాయకులు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.బీసీల రిజర్వేషన్లను 33 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిన పార్టీలను వదిలి 42 శాతానికి పెంచేందుకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పార్టీపై బురద జల్లడం సిగ్గుచేటన్నారు. బీసీ జన సమితి నేత రాజారామ్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీ బీసీల రిజర్వేషన్లను తగ్గించినప్పుడు వారి అధినేతను ఎందుకు ప్రశ్నించ లేదని నిలదీశారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 50 శాతం రిజర్వేషన్లపై ఉన్న సీలింగ్ సైతం ఎత్తివేస్తానన్న రాహుల్ గాంధీ హామీని గుర్తుంచుకోవాలన్నారు. బీసీలకు ద్రోహం చేసిన బీఆర్ఎస్ పార్టీ నేతల మోచేతి నీళ్లు తాగుతున్న ఈ బీసీ ద్రోహులు, కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో 42 శాతానికి బీసీల రిజర్వేషన్ల పెంపు తర్వాతనే ఎన్నికలకు వెళ్తుందని తెలిపారు. బీసీల పట్ల చిత్తశుద్ధి ఉన్న కాంగ్రెస్ పార్టీని విమర్శించడం మానుకుని గత 10 ఏండ్లుగా బీసీలకు ద్రోహం చేసిన బీఆర్ఎస్ పార్టీకి బీసీ నాయకులు బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తున్న బీసీ నాయకులు బీసీల రిజర్వేషన్లకు గండికొట్టిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయం ఎదుట టెంట్లు వేసి దీక్ష చేయాలని సూచించారు.బీసీ కులగణన, స్థానిక సంస్థల రిజర్వేషన్ల పెంపు కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.

'ఫుట్ పాత్ లపై మొక్కలు నాటాలి'

- అధికారులకు ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ విజ్ఞప్తి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

హైదరాబాద్ మహా నగరంలో ఆక్రమణ చెరలో నలిగిపోతున్న ఫుట్ పాత్ లపై రెండు వరుసలు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ అధికారులకు విజ్ఞప్తి చేసింది. ఫుట్ పాత్‌ల ఆక్రమణలపై ఉదాసీనత కారణంగా నిజమైన ఫుట్ పాత్ లబ్ధిదారులైన పాదాచారులకు తీవ్ర నష్టం జరగడమేగాక ట్రాఫిక్ అంతరాయం జరుగుతోందని కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.సీ.హెచ్.రంగయ్య సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నగర వ్యాప్తంగా వేల కిలో మీటర్లు ఉన్న ఫుటపాత్ లపై వెంటనే మొక్కలు నాటాలని ఆయన కోరారు. ఇప్పటికే ఉన్న చెట్లు అనేక సందర్భాలలో కూలిపోతున్న నేపథ్యంలో సమీపంలోని మొక్కలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. దశాబ్దాలుగా ఆక్రమణలతో ఉన్న ఫుట్‌పాత్‌లను కాపాడాల్సిన మున్సిపల్ విభాగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ఆక్రమణదారులు పెట్రేగిపోతున్నారని మండిపడ్డారు.ఒక పక్క ఫుట్ పాప్, మరో పక్క రోడ్లు ఆక్రమణలకు గురవుతూ తీవ్ర ట్రాఫిక్ జామ్ లతో నగరాన్ని కాలుష్య కాసారంగా తయారు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పాదాచారుల హక్కుల రక్షణలో అధికారుల వైఫల్యం పలు సందర్భాలలో పాదాచారుల ప్రాణాల మీదకు వస్తుందని గుర్తు చేశారు.ఇప్పటికైనా జీహెచ్ఎంసీ కమీషనర్, పోలీస్ ఉన్నతాధికారుల సమన్వయంతో ఫుట్ పాత్ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని కోరారు.పరిస్థితుల్లో మార్పు రాకుంటే సమస్యపై తమ కౌన్సిల్ న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు ఆయన హెచ్చరించారు.

నగరంలో కుండపోత వాన











హైదరాబాద్‌లో డీసీపీల బదిలీలు

- నగర ట్రాఫిక్ డీసీపీగా రాహుల్ హెగ్డే

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సారి 28 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పలువురు డీసీపీలు బదిలీ అయ్యారు. హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా రాహుల్ హెగ్డేను, హైదరాబాద్ నార్త్‌జోన్ డీసీపీగా సాధన రష్మి పెరుమాళ్‌ను నియమించారు. నగరంలో సౌత్, ఈస్ట్ డీసీపీగా పనిచేస్తున్న జానకీ దరావత్‌ను మహబూబ్‌నగర్ ఎస్పీగా బదిలీ చేశారు.



యాదగిరి మృతి చాలా బాధాకరం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

యాదగిరి మృతి చాలా బాధాకరమని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. బేగంపేటలోని శ్యాం లాల్ బిల్డింగ్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు యాదగిరి (76) అనారోగ్యంతో బాధపడుతూ బేగంపేటలోని కిమ్స్ హాస్పిటల్ లో వారం రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందారు. విషయం తెలుసుకున్న తలసాని శ్రీనివాస్ యాదవ్ హాస్పిటల్‌కు వెళ్ళి యాదగిరి మృతదేహానికి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు. పార్టీ నాయకులు శ్రీహరి, సత్యనారాయణ, సురేష్ యాదవ్, నరేష్ తదితరులు ఉన్నారు.



'దళితులకు న్యాయం చేయాలి'

నవతెలంగాణ-కంటోన్మెంట్

మంత్రి శ్రీధర్ బాబును దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో దళితులకు న్యాయం జరుగుతుందని ముప్పిడి నవీన్ కుమార్ ఆశాభవం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం దళితులను నిర్లక్ష్యం చేసిందని చెప్పారు కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు మంత్రిని కలిసిన వారిలో శేషు,కార్తీక్,రమేష్ పవన్,రాజు శీను,పావని,రాజేష్,శేఖర్ తదితరులు ఉన్నారు.



తలసాని శంకర్ యాదవ్‌కు నివాళ్లు

నవతెలంగాణ-బేగంపేట్

తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షులు తలసాని శంకర్ యాదవ్ ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని వారి నివాసానికి చేరుకొని శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.



ఎస్సార్ నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు పరామర్శ..

అలాగే శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద ఆయనకు ఎస్ఆర్ నగర్ సీనియర్ సిటీజన్స్ కౌన్సిల్ సభ్యులు నివాళ్లర్పించారు. అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పరామర్శించారు.కౌన్సిల్ అధ్యక్షులు మానిక్ రావ్ పాటిల్, ముత్తారెడ్డి, శంకర్, పార్థసారథి, కష్టారెడ్డి, కష్ణదేవ్ గౌడ్, అరవింద్ గౌడ్, ప్రసాద్ లు పరామర్శించిన వారిలో ఉన్నారు.



బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ప్రతాప్

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ న్యూ బోయినపల్లిలో ముస్లీమ్ సోదరులు బక్రీద్ పండగను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వందలాదిమంది ముస్లీంలు ఉరేగింపుగా పెన్షన్ లైన్ ఈద్గా వద్దకు చేరుకొని సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన్న ప్రతాప్ హాజరై శుభాకాంక్షలు చెప్పారు. ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సిరాజ్, షకీబ్ హుస్సేన్, చోటు, మౌల, ఆజాం, ముక్తార్, శ్రీకాంత్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హిల్స్‌లో భారీ వర్షం



ఖైరతాబాద్ కూడలిలో రోడ్డుపై నీరు వెళ్లేలా చర్యలు చేపట్టిన ట్రాఫిక్ పోలీసులు



నవతెలంగాణ - బంజారాహిల్స్

నగరంలోని హిల్స్ ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్,బంజారాహిల్స్,మాదాపూర్, గచ్చిబౌలి, దుర్గం చెరువుతో పాటు అమీర్‌పేట్, పంజాగుట్ట, యూసుఫ్‌గూడ, బేగంపేట్ ఏరియాల్లో వర్షం పడింది. ఈ నేపథ్యంలో భారీ స్థాయిలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. అయితే జీహెచ్ఎంసీ సకాలంలో స్పందించకపోవడంతో రంగంలోకి దిగిన ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ సజావుగా సాగడానికి చర్యలు చేపట్టారు.

బక్రీద్ వేడుకల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే..



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను నియోజకవర్గ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన ముస్లిం సోదరులు కలిసి బక్రీద్ శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం వారి ఆహ్వాన మేరకు ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి సోదర సోదరీ మణుల బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి మధ్యలో బక్రీద్ వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాపింప జేయడమే బక్రీద్ అన్నారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతను, సహోదర భావాన్ని అందరూ అనుసరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వహాబ్ , నయీమ్ , తోఫిక్ గారు, రఫిక్ గారు, షమ్మీ , నాజర్, ఉదయభాను, నరేష్, వినోద్, ఎన్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ గణపతి విగ్రహ పనులు ప్రారంభం

- ఈ ఏడాది 70 అడుగుల విగ్రహం
- కర్రపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ మహా గణపతి విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సోమవారం ఖైరతాబాద్‌లో కర్రపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని ప్రత్యే పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 70 అడుగుల వినాయకుడి మట్టి విగ్రహాన్ని ఈ ఏడాది ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు. సంప్రదాయం ప్రకారం కర్రపూజ చేసి విగ్రహం ఏర్పాటు ప్రారంభించినట్టు తెలిపారు. ప్రకృతికి ఆమోదయోగ్యమైన మట్టి వినాయకుడే మళ్లీ దర్శనం ఇవ్వనున్నాడని చెప్పారు. గతంలో కంటే మెరుగ్గా ఉత్సవాలు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టు తెలిపారు. రాబోయే రెండుమూడు రోజుల్లో ఉత్సవ కమిటీలతో సమావేశమై చర్చిస్తామన్నారు.

నాణ్యమైన ఆహార పదార్థాల హబ్‌గా హైదరాబాద్



- మంత్రి దామోదర రాజ నర్సింహా


నవతెలంగాణ-బంజారాహిల్స్

నాణ్యమైన ఆహార పదార్థాలు అందించే హొటళ్ల హబ్‌గా హైదరాబాద్ మహానగరం మారిందనితెలంగాణ వైద్య ఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జూబ్లీహిల్స్‌లో సినీ నటుడు శర్వానంద్ సోదరుడు ఏర్పాటు చేసిన బీన్జ్ కాఫీ షాపును మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ రెవిన్యూ శాఖామంత్రి సత్యప్రసాద్, హీరో శర్వానంద్‌లు అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కాఫీషాప్‌లోని విభిన్న రుచులను మంత్రులు రుచిచూశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల వారు ఎవరు వచ్చినా హైదరాబాద్ ఆహారాలను రుచి చూసి అద్భుతం అంటున్నారన్నారు. కాఫీ షాపులు కాసేపు రిలాక్స్ అవడానికి హబ్బులని అన్నారు. బీన్జ్ రెస్టారెంట్‌తో ఎన్నో మెమోరీలు ఉన్నాయని, అప్పట్లో తన కాఫీ షాప్‌లో చరణ్, బన్నీ,అ ఖిల్‌తో పాటు మరికొంత మంది హీరోలంతా కలిసి రీలాక్స్ అయ్యేవాళ్ళమని హీరో శర్వా గుర్తు చేసుకున్నారు. తమ ఫ్రెండ్స్ ఎప్పుడు కలిసినా కాఫీ షాప్‌లోనే కలిసేవారిమని అన్నారు. నిర్వాహకులు అర్జున్ మైనేని మాట్లాడుతూ విభిన్న రుచులతో పాటు కాంటినెంటల్ రెసిపీలను నగరవాసులకు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ మంజుల అనగాని, డి. వంశీకృష్ణంరాజు, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కృత్రిమ మేధతో విలువలు మానవీయతకు ముప్పు

- సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నతాధికారి డాక్టర్ కె వి రమణ



నవతెలంగాణ-కల్చరల్

మనుషులను యంత్రాలుగా మార్చే కృత్రిమ మేధతో సమాజంలో కుటుంబ సంబంధాలు విలువలు మానవీ యతకు ముప్పు వాటిల్లుతుందని సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నతాధికారి డాక్టర్ కె వి రమణ అన్నారు. పిల్లలకు వారి దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమిం చేందుకు పురాణ కథలు పద్యాలుతో పాటు దైవ నామ స్మరణ ఉపయోగమని అయన వివరించారు. మాసబ్ ట్యాం క్ వద్దనున్న నఫీజ్ కాంప్లెక్స్‌లోని డాక్టర్ రమణ నివాస కార్యాలయంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బి.రామా చార్యులు రచించిన 'నామ స్మరణం మోక్ష దాయకం' సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ సంపుటి ఆవిష్కరించి ప్రసంగించారు. చిన్న సంపు టి అయినా రామాచార్యులు పలు విశేషాలు విషయాలను ఆసక్తిగా గొప్పగా పాఠకులకు అందించా"న్నారు. భగవం తుని దర్శనం కోసం తిరుమల వెళ్ళే భక్తుల సంఖ్య ఎక్కువ అవుతోందని కానీ కోరికలతో వెళ్ళేవారు అధికమని చెప్పారు. భగవత్ నామ స్మరణతో ఎందరో మహాపురుషులు సిద్ధి పొందారని వారిని ఆదర్శం గా నేటి తరం వారు తీసుకొని ముందుకు సాగాలని అట్టి వారికోసమే ఈ సంపుటి అని పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ ఇహిక బంధాల నుంచి విడివడటమే ముక్తి అని.. అట్టి ముక్తి సాధనకు నామ స్మరణం అవసరం అన్నారు. రామాచార్యులు సంపుటిలో అక్షర అర్చన చేశారని ప్రశంసించారు. సంపుటిని సమీక్షిం చిన సినీ గేయ రచయిత డాక్టర్ వెనిగల్ల రాంబాబు మాట్లా డుతూ అంతర్గత శుద్ధికి నామ స్మరణ అవసరం అని దీని వివరాలు రామాచారులు తన సంపుటిలో తెలిపారన్నారు. సాధన సాహితీ ప్రవంతి సంస్థ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో సాధన నరసింహాచార్య స్వాగతం పలుకగా కార్యదర్శి శంభునీ కుమార్ వందన సమర్పణ చేశారు.

డాక్టర్ ముజీబ్‌కు టీఎన్జీవో నాయకుల బక్రీద్ శుభాకాంక్షలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

బక్రీద్ పండుగ సందర్భంగా టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనిని(ముజీబ్) సోమవారం ఆ సంఘం హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కె. శ్రీనివాస్, పబ్లిక్ సిటీ సెక్రటరీ వైదిక్ శాస్త్ర, ఈసీ మెంబర్లు శంకర్, శ్రీధర్, అడ్వైజర్ వెంకట్‌రెడ్డిలు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకే అందించి శాలువాతో ఘనంగా సత్కారిం చి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ రాష్ట్ర ప్రజలకు, ఉద్యోగులకు పవిత్రమైన బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్వో వహీద్, కార్యవర్గ సభ్యులు మొహ్మద్, మోహన్ రావు, ఐటీఐ సత్యనారాయణ, సుదర్శన్, బాలాజీ గోస్వామి, పురుషోత్తం, మహేష్ గౌడ్, రాంబాబు, మోహన్, శ్రీనివాస్, చౌష్, రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

మహంకాళి ఆలయ పరిసరాలను పరిశీలించిన ఏసీపీ, ఇన్‌స్పెక్టర్

నవతెలంగాణ-బేగంపేట్

రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు జూలై 21, 22 తేదీలలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో మహంకాళి ఏసీపీ సర్దార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ పరశురాం, మహంకాళి ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ ఉపశంకర్‌లు పోలీస్ స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మహంకాళి



ఆలయ ఈవో మనోహ ర్‌రెడ్డితో ఏసీపీ, ఇన్‌స్పెక్టర్

కలసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ముఖ్యంగా క్యూలైన్ల ఏర్పాట్లను ఆలయ ఈవోను అడిగి తెలుసుకున్నారు. బోనాలతో తరలివచ్చే మహిళల క్యూలైన్‌లు ఎన్ని ఉంటాయి.. సాధారణ క్యూలైన్లు ఎన్ని ఉంటాయి.. ఇలా ప్రతిదీ అడిగి తెలుసుకున్నారు. బోనాల ఉత్సవాలలో అందరి సహకారంతో విజయవంతం చేస్తామని తెలియజేశారు. భక్తులకు త్వరితగతిన దర్శన మయ్యే విధంగా ఉన్నతాధికారుల సహకారంతో ముందుకు సాగుతామని వారు తెలిపారు.

ఆరోగ్యానికి పాలు లేని టీ...

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ఆరోగ్యానికి సంబంధించి మార్గదర్శకాలను ఇటీవల విడుదల చేసింది. అందులో భోజనం తిన్న తర్వాత టీ లేదా కాఫీ ఎందుకు తాగకూడదో వివరించింది. టీ, కాఫీ అనేది ప్రపంచవ్యాప్తంగా ఇష్టపడే అత్యంత ప్రజాదరణ పొందిన పానీయాలు.

భారతదేశంలో ప్రజలు టీ లేదా కాఫీ తాగడానికి ఆసక్తి చూపుతారు. కాఫీ, టీలు భోజనానికి గంట ముందు, భోజనానికి గంట తర్వాత అధిక మొత్తంలో తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందని ఐసీఎంఆర్ వెల్లడించింది.



ఐసీఎంఆర్ కొత్త మార్గదర్శకాల్లో పాలతో టీ తాగే బదులు, పాలు లేని టీ తాగడం మేలని చెప్పింది. గ్రీన్ లేదా బ్లాక్ టీ మరింత ప్రయోజన కరంగా ఉంటుందని కూడా ఐసీఎంఆర్ పేర్కొంది. నిజానికి పాలు కలపని టీలో థియోబ్రోమిన్ , థియోఫిలిన్ ఉంటాయి. ఇవి ధమనులను సడలిస్తాయి. తద్వారా రక్త ప్రసరణను ప్రోత్సహిస్తాయి. అవి ఫ్లేవనాయిడ్లు, ఇతర యాంటీఆక్సిడెంట్ పాలీఫెనాల్స్‌ను కూడా కలిగి ఉంటాయి. ఇవి కరోనరీ హార్ట్ డిసీజ్ , కోలన్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. అయితే, టీలో పాలు కలపకపోతే లేదా తక్కువ పరిమాణంలో పాలు కలిపినప్పుడు మాత్రమే ఈ ప్రయోజనాలన్నీ పొందవచ్చని ఐసీఎంఆర్ తెలిపింది.

స్వచ్ఛమైన ప్రపంచానికై...

పర్యావరణాన్ని కాపాడేందుకు నేటి తరం యువత ముందుకొస్తున్నారు. టెక్నాలజీని ఉపయోగించి కాలుష్యాన్ని నియంత్రించేందుకు తపిస్తున్నారు. అదే బాటలో నడుస్తున్నారు ఆకాంక్ష ప్రియదర్శిని. ఐయోటి-ఎనేబుల్డ్ ఇంటెలిజెంట్ సిస్టమ్ ద్వారా గాలి కాలుష్యాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్నారు. భావి తరాలకు మంచి స్వచ్ఛమైన ప్రపంచాన్ని అందించేందుకు అహర్నిశలూ తపిస్తున్న ఆమె ప్రయత్నం గురించి నేటి మానవిలో...



రక్షణ రంగానికి సంబంధించిన కుటుంబంలో జన్మించిన ఆకాంక్ష బాల్యం దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో కొనసాగింది. లూధియానా, పూణే, సిలిగురిలో చెట్లతో కప్పబడిన రోడ్లలో బాస్కింగ్ చేయడం ఆమెకు గుర్తు. ఆకాంక్ష తన ఇల్లు, పాఠశాల చుట్టూ ఉన్న పచ్చదనాన్ని ఇష్టపడేది. గాలిలో కాలుష్యాన్ని తగ్గించడానికి ఇదెంతో అవసరమని ఆమె గ్రహించింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి) రూర్కెలాలో బిటెక్ డిగ్రీ కోర్సులో చేరినప్పుడు దీని గురించి మరింత బాగా అర్థం చేసుకుంది. నగరాల్లో గాలి కాలుష్యం చాలా స్పష్టంగా ఉంది. ఆమె తల్లి ఉబ్బసం వ్యాధితో ఇబ్బంది పడేది. అలాగే తన స్నేహితులు చాలా మంది శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇంజనీరింగ్ విద్యార్థిగా ఈ సమస్యకు ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనేందుకు ఆమె తపించింది. సమస్యను పరిష్కరించేందుకు ఐయోటి-ఎనేబుల్డ్ ఇంటెలిజెంట్ సిస్టమ్ అయిన ఆరాసూర్‌ను ప్రారంభించడానికి ఇది దారితీసింది.

ఎలా ప్రారంభమైంది...

NITలో ఉన్నప్పుడు ఆకాంక్ష సీనియర్లు ఫీనిక్స్ రోబోటిక్స్‌ను స్థాపించారు. అక్కడ ఆమె కూడా ఇంటర్న్ చేయడం ప్రారంభించింది. ఇంజనీరింగ్ తర్వాత అందులోనే తన కెరీర్ ప్రారంభించింది. ఈ ప్రాంతంలో రూర్కెలా స్టీల్ ప్లాంట్ ప్రధాన పరిశ్రమ. అయితే ఈ ప్రాంతంలో పర్యావరణ నష్టాన్ని తగ్గించడంలో పెద్ద సవాళ్లను ఎదుర్కొన్న అనేక చిన్న పరిశ్రమలు ఉన్నాయని తెలుసుకుంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి) వాటిని గాలిలోకి విడుదల చేసే ముందు ఉద్గారాలను శుద్ధి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. అయితే వారికి అందుబాటులో ఉన్న ఏకైక పరిష్కారాలు చాలా ఖరీదైన యుఎస్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (యుఎస్ ఇపిఎ) సర్టిఫైడ్ పరికరాలు. 'మొత్తం సెటప్‌కు రూ .2.5-5 కోట్లు ఖర్చవుతుంది. ఇది చిన్న పరిశ్రమలకు సాధ్యంకాదు' అని ఆమె చెప్పారు.



శక్తి మహిళలకు ఉంది

ఆరాసూర్ ప్రారంభించినప్పుడు కోటి రూపాయల ఆదాయాన్ని సంపాదించింది. రెండేండ్లకే రూ .5.4 కోట్లకు చేరింది. భారతదేశంలో 150కి పైగా నగరాల్లో మోహరించడంతో పాటు బ్రెజిల్, ఆగ్నేయాసియాలోని కొన్ని ప్రాంతాలకు కార్యకలాపాలను విస్తరించాలని యోచిస్తున్నారు. ఈ ఏడాది వారికి రూ.15 కోట్ల లక్ష్యం ఉందని ఆకాంక్ష చెప్పారు. వాతావరణ సాంకేతిక పరిమితిపై పనిచేసే సంస్థలు, మంత్రిత్వ శాఖలలో నాయకత్వ బాధ్యతలో పురుషులు ఆధిపత్యం చెలాయించడం సర్వసాధారణమని ఆమె పంచుకున్నారు. అయితే ఈ సమస్యను సున్నితత్వంతో పరిష్కరించుకునే శక్తి మహిళలకు ఉందని ఆమె నమ్ముతున్నారు.

అనేక బాధ్యతలు నిర్వహించి

ఆంకాక్ష అతి తక్కువ సమయంలోనే ఫీనిక్స్ రోబోటిక్స్ ప్రధాన సభ్యురాలిగా మారారు. అక్కడ హార్డ్‌వేర్ డిజైనింగ్ నుండి దాని నిర్వహణ, కార్యకలాపాలు, సంస్థాపన, కస్టమర్లతో చర్చలు ఇలా అనేక బాధ్యతలు నిర్వహించారు. కోవిడ్-19 తర్వాత సంస్థ ఆరోగ్య సంరక్షణ, రిమోట్ కార్యకలాపాలపై తన వనరులను కేంద్రీకరించడం ప్రారంభించింది. అప్పుడు ఆకాంక్ష ura రసూర్ పేరుతో గాలి నాణ్యత, వరద నిర్వహణ ఉత్పత్తి కోసం బ్లూప్రింట్‌ను అభివృద్ధి చేశారు. 2022లో ఆ సంస్థ నుండి బయటకు వచ్చి తన సొంత సంస్థను ప్రారంభించారు. 'మేము డేటా అనాలిసిస్ ప్లాట్‌ఫామ్‌ను నిర్మించాలనే ఆలోచనతో ప్రారంభించాం. విపత్తు నిర్వహణ కోసం హార్డ్‌వేర్ పరికరాల నుండి సేకరించిన డేటాను ఉపయోగించవచ్చు. మేము ప్రభుత్వంపైనే కాకుండా వాతావరణ పరిశ్రమలను కూడా కేంద్రీకరించాం. వీటిలో నిర్మాణం, రియల్ ఎస్టేట్, భీమా, పర్యావరణ సంస్థలు ఉన్నాయి' అంటున్నారు ఆమె.

అర్థం చేసుకోడానికి

ఈ సంస్థ గూగుల్ మ్యాప్స్, ఆరాసూర్ హైపర్ లోకల్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసింది. ఇది ఉపగ్రహ-ఆధారిత సమాచారాన్ని, 95శాతం కచ్చితత్వంతో వాతావరణాన్ని అంచనా వేయడానికి విశ్లేషణాత్మక పరిష్కారాన్ని ఉపయోగిస్తుంది. 'గూగుల్‌తో మేము విస్తృతమైన ఆన్-గ్రౌండ్ డేటాను సేకరించడం ప్రారంభించాం. హాట్‌స్పాట్‌లు, అధిక కలుషితమైన ప్రాంతాలు, కాలుష్యం వెనుక ఉన్న మూలాన్ని అందించడానికి, దాని నిజ ప్రాతిపదికన ప్రాసెస్ చేయడం, అంచనా వేయడం కోసం పనిచేశాం' అని ఆకాంక్ష చెప్పారు. వాతావరణ నమూనాలను, నగరంలో లివబిలిటీ ఇండెక్స్, భీమా కోసం ఆరోగ్య ప్రభావాలు, ప్రమాద కారకాలను అర్థం చేసుకోవడానికి వారు సేకరించిన డేటాను రిస్క్ మ్యాపింగ్ చేశారు. చివరకు వారి వాతావరణ శాస్త్రవేత్తల బృందం సహాయంతో వారు పరిష్కారాలను రూపొందించారు.

తీవ్రతను గుర్తించడానికి

ప్రారంభ హెచ్చరికలతో సహా, స్థితిస్థాపకతను పెంపొందించడానికి, ఆర్థిక నష్టాలు లేకుండా పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యారు. అయితే సమస్య తీవ్రతను గుర్తించడానికి, దీర్ఘకాలికంగా అది ఆర్థికంగా ఎలా దెబ్బతింటుందో గుర్తించడానికి ఎక్కువ సంస్థలకు ఇంకా అవగాహన లేదని ఆకాంక్ష చెప్పారు.



సమస్యను పరిష్కరించడానికి సహాయపడుతుంది. 'మా పైలట్ కోసం భువనేశ్వర్‌లోని పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ నుండి మాకు మద్దతు లభించింది. ఒడిశా రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు కూడా మాకు సహాయం చేయడానికి ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టును చెన్నై, రాజ్కోట్, రంగాబాద్, నవీ ముంబైలకు విస్తరింపజేశాము' అని ఆమె చెప్పారు. ఆరాసూర్ ఐఐటి డిల్లీ, ఐఐటి ముంబై, కొలంబియా విశ్వవిద్యాలయం పరిశోధనలో సహకరించింది. ఆరసూర్, టాటా రియాల్టీ మఎల్ అండ్ టి రియాల్టీ వారు

రాయ్‌బరేలీకే రాహుల్‌గాంధీ

(మొదటిపేజీ తరువాయి)

సీటును వదులుకున్నారు. సోమవారం సాయంత్రం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో జరిగిన సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. వయనాడ్ నియోజకవర్గాన్ని రాహుల్ ఖాళీ చేయడంతో అక్కడ జరిగే ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా రాహుల్ సోదరి ప్రియాంక గాంధీని పోటీలోకి దింపాలని ఆ పార్టీ అగ్రనేతలు నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రియాంక గాంధీ ఎన్నికల రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ఇదే మొదటిసారి కానుంది. ఈ సమావేశంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ పాల్గొన్నారు. రాహుల్ గాంధీ 2019 ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని అమేథీతో పాటు కేరళలోని వయనాడ్‌లో పోటీ చేయగా అమేథీలో ఓడిపోయారు. వయనాడ్ నుంచి ఘనవిజయం సాధించారు. ఇక రాయబరేలీ నుంచి వరుసగా ఎన్నికవుతూ వస్తున్న సోనియాగాంధీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరమవు తున్నట్టు ప్రకటించారు. దీంతో అటు వయనాడ్‌తో పాటు ఇటు రాయబరేలీ నుంచి వ్యూహాత్మకంగా కాంగ్రెస్ పార్టీ రాహుల్‌ను బరిలోకి దింపింది. అందుకు తగ్గట్టే ఆయన ఈ రెండు నియోజకవర్గాల్లోనూ భారీ మెజారిటీతో గెలుపొందారు. అయితే, రెండు నియోజకవర్గాల్లో ఒక నియోజకవర్గాన్ని వదులుకోవాల్సి రావడంతో కాంగ్రెస్ సోమవారం ఈ నిర్ణయాన్ని తీసుకోవాల్సి వచ్చింది.

ప్రియాంక గెలుపు ఖాయం

వయనాడ్ నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేయనుండడంతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని కేసీ వేణుగోపాల్ తెలిపారు. కేరళ ప్రజలకు ప్రియాంక అంటే చాలా ఇష్టమని, ఆమె భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని అన్నారు.

కరెంటుపై ధరల పిడుగు

(మొదటిపేజీ తరువాయి)

ఖనిజాలను దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. గత ఏడాది 20 శాతం ధరలు పెరిగాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఒకేసారి 23 శాతం ధరల్ని అమెరికా పెంచేసింది. ఈ ప్రభావం విద్యుత్‌రంగంపై తీవ్రంగా పడింది. రాగి, అల్యూమినియం ఖనిజాలను విద్యుదుత్పత్తిలో ప్రధానంగా వాడతారు. ఈ రెండు లోహాలు వేగవంతమైన విద్యుత్ ప్రవాహకాలుగా పనిచేస్తాయి. టర్బైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు సహా అన్నింటికీ రాగి, అల్యూమినియం వినియోగం తప్పనిసరి. అలాగే ఇండ్ల కరెంటు వైరింగ్‌లోనూ ఈ లోహాల వినియోగం అధికంగా ఉంటుంది. పరిశ్రమలు, భారీ కర్మాగారాల్లోనూ ఈ రెండు లోహాల వినియోగం తప్పనిసరి. మొత్తం విద్యుత్ పరిశ్రమ ఈ రెండు లోహాలపైనే ఆధారపడి ఉంది. దీనిపై అగ్రరాజ్యం అమెరికా అవకాశం చూసి దెబ్బకొట్టింది. ప్రపంచవ్యాప్తంగా అత్యవసరమైన విద్యుత్‌రంగాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది. భారతదేశంలోని విద్యుత్ ప్రాజెక్టులపై ఈ ప్రభావం తీవ్రంగా పడింది. థర్మల్ కేంద్రాల వినియోగాన్ని క్రమేణా తగ్గిస్తూ, పునరుత్పాదక ఇంధన వినియోగం వైపు దేశం అడుగులు వేస్తున్నది. దానికోసం అధికంగా సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహిస్తున్నది. సోలార్ ప్రాజెక్టుల్లో వినియోగించే ఫోటోవోల్టాయిక్ (పీవీ) ఫ్రేమ్‌లు, పరికరాలు సూర్యరశ్మిని గ్రహించి విద్యుత్ శక్తిగా మారుస్తాయి. ఈ పీవీల తయారీలో రాగి, అల్యూమినియంతోనపాటు ఇతర ధాతువులను వినియోగిస్తారు.

ఒకప్పుడు సోలార్ విద్యుత్ ఒక్క యూనిట్ ధర రూ.23 నుంచి రూ.18 వరకు ఉండేది. ఇప్పుడు సాంకేతికత అభివృద్ధి చెందడంతో యూనిట్ రేటు రూ.2.80 పైసల నుంచి రూ.2.40 పైసలకు తగ్గిపోయింది. సోలార్ చౌకైన విద్యుత్‌గా అందుబాటులోకి వస్తున్న తరుణంలో వాటిపై కాపర్, అల్యూమినియం ధరల పెంపు భారం పడింది. థర్మల్ కేంద్రాలతో ఇప్పటికే చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై (పీపీఏ) ఈ ప్రభావం భారీగానే పడుతుంది. ప్రాజెక్టుల వ్యయ అంచనాలు పెరగడంతో సరఫరాదారులు తమ క్లయింట్‌లతో నిబంధనలను మళ్లీ సవరించాలని కోరుతున్నారు. దీనివల్ల విద్యుత్కేంద్రాల నిర్మాణంలో జాప్యం జరుగుతుంది. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల బ్యాలెన్స్ ఆఫ్ సిస్టం (బీఓఎస్) ధర ఇప్పటికే దాదాపు 3.5 శాతం పెరిగిందని ఎనర్జీ ప్రొక్యూర్‌మెంట్ అధికారులు చెప్తున్నారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల్లోని పరికరాల్లో రాగి ముఖ్యమైన పదార్థం. సోలార్ ప్రాజెక్టుల నిర్మాణంలో ఒక మెగావాట్‌కి దాదాపు ఐదు టన్నుల రాగి అవసరమవుతుందని అంచనా. అలాగే పవన విద్యుత్ (విండ్)లో ఆన్‌షోర్, ఆఫ్‌షోర్ విండ్ ఫామ్‌లకు ఒక్కో మెగావాట్‌కు 4.3 టన్నుల నుంచి 9.6 టన్నుల కాపర్ కంటెంట్ అవసరమవుతుందని విద్యుత్ ఇంజినీర్లు చెప్తున్నారు. రాగి ధాతువు ఉత్పత్తి దక్షిణ అమెరికాలో కేంద్రీకృతమై ఉంది. ముఖ్యంగా చిలీలో ప్రపంచం తవ్విన రాగి సరఫరాలో మూడింట ఒక వంతు వాటా ఉంది.దానికి తోడు పొరుగు దేశాలపై అమెరికా వాణిజ్య ఆంక్షల ప్రభావం కూడా ఈ ఉత్పత్తులపై ఆర్థిక భారాన్ని పెంచుతున్నాయి.

భారం ఇలా...

ఉదాహరణకు గృహ అవసరాల కోసం 1 మెగావాట్ త్రీ ఫేజ్ రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకోవాలంటే టీజీరెడ్కో నిర్ణయించిన ప్రాజెక్ట్ కాస్ట్ రూ.83,700 అవుతుంది. దీనికి దరఖాస్తు రుసుం, నెట్‌మీటరింగ్ చార్జీలు అదనం. ప్రభుత్వం రూ.14,588 సబ్సిడీగా ఇస్తుంది. వినియోగదారుడు మొత్తంగా రూ.73,242 ఆర్థికభారాన్ని భరించాల్సి ఉంటుంది. కాపర్, అల్యూమినియం ధరల పెంపుతో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ మొత్తాన్ని తగ్గించాలని యోచిస్తుంది. దానితో పాటు ఇంటి వైరింగ్ ఖర్చు పెరుగుతుంది. ఇవన్నీ కలుపుకుంటే అదనపు ఆర్థికభారం మరో రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు పడే అవకాశం ఉన్నట్టు సోలార్ ఏజెన్సీలు చెప్తున్నాయి.

ఇది కేవలం వ్యక్తిగత గృహాలకు సంబంధించిన లెక్క మాత్రమే. రాష్ట్రావసరాల కోసం ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్లపై ఈ భారం మరింత ఎక్కువగా ఉంటుంది.

గుడిసెవాసులపై దాడులు ఆపాలి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనగామ జిల్లా బచ్చన్నపేటలోని గుడిసెల కేంద్రాన్ని గత రెండు రోజులుగా పోలీసులు చుట్టుముట్టారనీ, వాటిని ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సీపీఐ(ఎం) పేర్కొంది. ఈ చర్యలను తీవ్రంగా ఖండించింది. గుడిసెవాసుల మీద పోలీసుల నిర్బంధాన్ని ఆపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని 19 జిల్లాల్లోని 69 పోరాట కేంద్రాల నాయకుల సమావేశాన్ని సోమవారం హైదరాబాద్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ గుడిసె వాసుల పరిస్థితులను సమావేశంలో సమీక్షించామని చెప్పారు. ఈమధ్యే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన సందర్భంగా, ఈ విషయాన్ని ప్రస్తావిస్తే ప్రభుత్వ భూముల్లో పేదలు నిర్మించుకున్న గుడిసెలను తొలగించటం తమ ప్రభుత్వ విధానం కాదంటూ స్పష్టం చేశారని అన్నారు. అయినప్పటికీ స్థానిక అధికారులు రియల్ ఎస్టేట్ బ్రోకర్లతో కుమ్మక్కై, గుడిసెవాసులపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే జగిత్యాల, కోరుట్ల, మహబూబాబాద్ కేంద్రాలతోపాటు వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల్లో ఒక్కొక్క కేంద్రాన్ని ధ్వంసం చేశారని చెప్పారు. వందలాదిమంది మీద అక్రమ కేసులను పోలీసులు బనాయించారని అన్నారు. మళ్లీ గుడిసెలు వేయొద్దంటూ బెదిరిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు బచ్చన్నపేటలో మరోసారి దాడికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. గుడిసెవాసుల మీద ఇలాంటి దాడులను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణం వారిపై నమోదు చేసిన కేసులను రద్దు చేసి, ఇండ్ల స్థలాలకు పట్టాలివ్వాలనీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు జి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లలేవీ..?

- సీజన్ సమీపిస్తున్నా ఇంకా పిలవని టెండర్లు.. మత్స్యకారుల్లో ఆందోళన
- చేప పిల్లల సేకరణకు రెండు నెలల సమయం
- రాష్ట్రంలో గతేదాది 86.5 కోట్ల చేప పిల్లల పంపిణీ
- ఉచిత పిల్లల పంపిణీతో ఆదాయం, ఉపాధిని కల్పిస్తున్న చేపల పెంపకం
- ప్రభుత్వం సాయం చేయాలని మత్స్యకారుల డిమాండ్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదాయం, ఉపాధిని కల్పిస్తూ శరవేగంగా అభివృద్ధి చెందిన మత్స్య పరిశ్రమకు సర్కార్ సాయం ఎంతైనా అవసరం. వేలాది మత్స్య సొసైటీల్లో లక్షలాది మంది వృత్తిదారులు జీవనోపాధి పొందుతున్నారు. ప్రాజెక్టుల నిర్మాణం వల్ల నీటి వనరులు పెరగడంతో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ఉచిత పిల్లల పంపిణీ వల్ల చేపల పెంపకం లాభసాటిగా మారింది. కానీ ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయమూ తీసుకోకపోవడం మత్స్యకారుల్లో గందరగోళానికి తెరలేపింది. చేప పిల్లల్ని వదిలే సమయం సమీపిస్తున్నా టెండర్లు కూడా పిలవకపోవడంతో వృత్తిదారులు ఆందోళన చెందుతున్నారు. ఉచిత పిల్లలు కాకపోయినా సొసైటీలకు సర్కార్ నేరుగా ఆర్థిక సహాయం అందించాలని వృత్తిదారులు కోరుతున్నారు.

రాష్ట్రంలో 23,748 నీటి వనరుల్లో చేపలు పెంచుతున్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 4.5 లక్షల టన్నుల వరకు ఏటా చేపల ఉత్పత్తి జరుగుతోంది. ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తే ఇది మరింత లాభసాటిగా మారుతుందని మత్స్యకారులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5112 మత్స్య సంఘాలేర్పడగా వీటిల్లో సుమారు 4 లక్షల మంది వృత్తిదారులున్నారు. సిద్దిపేట జిల్లాలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయకమ్మ సాగర్‌కు నీటిలభ్యత బాగానే ఉంది. సంగారెడ్డి జిల్లాలో సింగూరు జలాశయం, మెదక్ జిల్లాలో నవదుర్గ వంటి ప్రాజెక్టుల అభివృద్ధితో వేల సంఖ్యలో చెరువులు, కుంటలు, వాగులు ఇతర నీటి వనరులకు నీటి లభ్యత పెరిగింది. వీటిల్లో మత్స్యకారులు చేపల్ని పెంచుకుని జీవనోపాధి పొందుతున్నారు. నీటి వనరులు పెరిగినందున ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సంఖ్య పెరిగింది. 642 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలుండగా, 50 వేల మంది వరకు వృత్తిదారులు సభ్యులుగా ఉన్నారు. ఏటా 60 వేల టన్నుల వరకు చేపల ఉత్పత్తి జరుగుతుంది. మత్స్యకారుల ఆదాయాన్ని పెంచేందుకు గత ప్రభుత్వం



ఉచితంగా చేప పిల్లల్ని పంపిణీ చేసింది. ప్రస్తుత ప్రభుత్వం చేప పిల్లల పంపిణీపై ఏ నిర్ణయమూ తీసుకోలేదు.

గతేదాది 86.5 కోట్ల చేప పిల్లల పంపిణీ

గతేడాది ఇదే సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లోని సుమారు 5112 మత్స్య సొసైటీలకు రూ. 82 కోట్ల వ్యయంతో 77 కోట్ల బొచ్చ,

రవ్వ, బంగారుతీగ వంటి రకాల చేప పిల్లల్ని అందజేశారు. లాభసాటిగా ఉండేందుకు రూ.22 కోట్లతో 9.5 కోట్ల రొయ్య పిల్లల్ని కూడా పంపిణీ చేశారు. మొత్తం రూ.104 కోట్ల వ్యయంతో 86.5 కోట్ల చేప పిల్లల్ని మత్స్య సంఘాలకు పంపిణీ చేసి చెరువుల్లో వదిలారు.

నేరుగా ఆర్థిక సాయం..?

చేప పిల్లల పంపిణీ కోసం ప్రతి ఏటా ఏప్రిల్ నెలలో ప్రభుత్వం మత్స్య శాఖ ద్వారా టెండర్లు పిలిచేది. గతేడాది ఏప్రిల్‌లో టెండర్లు పిలిచి జూన్ వరకు ఖరారు చేసి చేప పిల్లల సరఫరాకు ఆదేశాలిచ్చింది. జూన్, జులై మాసాల్లో వర్షాలు పడి చెరువులు నిండినందున చేప పిల్లల్ని పంపిణీ చేశారు. చేప పిల్లల్ని ఉత్పత్తి కేంద్రాల నుంచి సేకరించి సొసైటీలకు అప్పజెప్పి చెరువుల్లో వదిలేందుకు కనీసం రెండు నెలల సమయమన్నా పడుతుంది. ప్రస్తుతం జూన్ మాసం సగం పూర్తయినా ఇంకా టెండర్లు కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతిలో ఉచితంగా చేప పిల్లల్ని పంపిణీ చేయాలని భావించట్లేదని అధికారులు చెబుతున్నారు. నేరుగా మత్స్యకారులకే ఆర్థిక సహాయం అందించే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.

ముంచుకొస్తున్న సీజన్.. కురుస్తున్న వర్షాలు

ఈ ఏడాది నైరుతి ఋతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున జూన్, జులైలో చేప పిల్లల్ని వదిలితే మంచి సైజు పెరుగుతాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇప్పటికే వానాకాలం వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది జూన్‌లో సంగారెడ్డి జిల్లాలో సాధారణ వర్షాపాతం 58.4 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటికే 93.6 మి.మీ వర్షం పడింది. మెదక్‌లోనూ 61.5 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం కాగా ఇప్పటికే 77.2 మి.మీ వర్షపాతం నమోదైంది. సిద్దిపేట జిల్లాలో 55.0 సాధారణ వర్షపాతం కాగా ఇప్పటికే 56.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దాంతో చెరువుల్లో నీటి మట్టం పెరుగుతుంది. జులై వరకు చేప పిల్లల్ని వదిలితే ఉత్పత్తి ఆశించిన మేరకు వస్తదని వృత్తిదారులు అంటున్నారు.

చేప పిల్లల పెంపకానికి ఆరు నెలల కాలం

చేపలు కనీసం కిలో సైజు పెరగాలన్నా ఆరు నెలల సమయమైనా పడుతుంది. 40 రోజుల వయసున్న 35-40 ఎంఎం సైజు చేప పిల్లలు, లేదంటే 75 రోజుల వయసున్న పెద్ద సైజు పిల్లలు (80-100 ఎంఎం) సరఫరా చేసేది. వాటిని పెంచితేనే ఆరు నెలలు పట్టేది. ఇప్పుడు ఆలస్యమైతే అంతకంటే ఎక్కువ సైజు పిల్లల్ని చెరువుల్లో పోసుకోవాల్సి వస్తది. అందుకు పిల్లల ధర భారం కూడా పెరుగుతుందని పెంపకందార్లు అభిప్రాయపడుతున్నారు. కనీసం జూన్, జులై, ఆగస్టు నెలల్లో చేప పిల్లల్ని చెరువుల్లో వదిలితే అవి పెరిగాక జనవరి నుంచి మార్చి వరకు చేపల్ని పట్టుకునేందుకు వీలుంటుందని, ఆలస్యమైతే ఎండల తీవ్రత వల్ల చేపలు చనిపోతాయని మత్స్యకారులు అంటున్నారు.


బెంగాల్‌లో ఘోర రైలు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

నుండి దూర ప్రాంతాలకు నడిచే రైళ్ల రాకపోకలపై కూడా ప్రభావం పడింది. రైలు ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని నరేంద్ర మోడీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మరోవైపు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఘటనా స్థలానికి చేరుకొని సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. అధికారులు, వైద్యులు, అంబులెన్సులు, విపత్తు నిర్వహణ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాయి. ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

అంతా క్షణాల్లో జరిగిపోయింది

ప్రమాదం జరిగిన సమయంలో ఏం జరిగిందో అర్థం కాలేదని ప్రయాణికులు తెలిపారు. తాను బీ-1 బోగీలో ఉన్నానని, అకస్మాత్తుగా రైలు ప్రమాదానికి గురైందని, తనకు తలపై పెద్ద గాయమైందని, కిందికి దిగి చూస్తే వెనుక నుండి గూడ్స్ రైలు ఢీకొట్టినట్లు అర్థమైందని ఓ ప్రయాణికుడు చెప్పాడు.



విభజన చట్టంలోని అన్ని అంశాలపై సీఎం నజర్..

- ప్రత్యేక నివేదికనివ్వాలంటూ ఆర్థిక శాఖకు ఆదేశాలు
- ఏపీ నుంచి ఉద్యోగుల బదిలీలపై ఎలాంటి నిర్ణయం తీసుకోని సర్కార్
- తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దంటున్న ఉన్నతాధికారులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదేండ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఈనెల రెండు నుంచి తెలంగాణకు మాత్రమే రాజధానిగా మారిన నేపథ్యంలో...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీతో ముడిపడిన ఇతరత్రా అంశాలపై దృష్టి సారించారు. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన ఆఫీసులు, భవనాలతోపాటు విభాగాల వారీగా విభజన చట్టంలోని అన్ని అంశాలపై ప్రత్యేక నివేదిక రూపొందించాలంటూ ఆయన ఆర్థికశాఖకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ, ఏపీ మధ్య గత పదేండ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ఆయన ఉన్నతాధికారులతో ఆరా తీశారు. ఇందుకు సంబంధించి ఇటీవల పలు కీలక సమావేశాలను సీఎం నిర్వహించినట్టు తెలిసింది. అయితే రెండు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి కొత్త నిర్ణయమూ తీసుకోలేదు. తెలంగాణ ఏర్పడిన రెండేండ్లలోనే ఈ ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చిన సంగతి విదితమే. అయితే ఉద్యోగుల విభజన సమయంలో ఆప్షన్లు, పోస్టుల లభ్యత ఆధారంగా తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగుల్లో కొందరు ఏపీకి, ఏపీకి స్థానికత ఉన్న వారిలో కొందరు తెలంగాణకు పంపిణీ అయ్యారు.

వైద్యావసరాలు, భార్యాభర్తలు ఉద్యోగులుగా ఉండటం, పిల్లల చదువులు, సొంతిల్లు ఉన్నాయనే కారణాలతో కొందరు ఉద్యోగులు ఈ పంపిణీ జరిగిన తీరుతో ఇబ్బందులు పడ్డారు. మానవీయ కోణంలో తమ బాధను అర్థం చేసుకోవాలంటూ వారు పలుమార్లు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. అదే సమయంలో తమ సొంత రాష్ట్రానికి వెళ్లేందుకు అవకాశమివ్వాలని కోరుతూ తెలంగాణకు పంపిణీ అయిన 1,369 మంది ఉద్యోగులు సమ్మతిని తెలిపారు. 2021లో తెలంగాణ ప్రభుత్వం ఆయా ఉద్యోగుల వివరాలను సేకరించింది. వారి అభ్యర్థనల మేరకు ఏపీకి పంపేందుకు అభ్యంతరం లేదని పేర్కొంటూ 'నో అబ్జక్షన్'ను ఇచ్చింది. ఆ మేరకు ఒక సర్క్యులర్‌ను కూడా జారీ చేసింది.

ఇదే తరహాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అక్కడి నుంచి తెలంగాణకు వచ్చేందుకు సిద్ధమైన 1,808 ఉద్యోగుల వివరాలను సేకరించింది. ఇక్కడకు వచ్చేందుకు వీలుగా వారు ఆప్షన్లు ఇచ్చారు. దీంతో శాశ్వతంగా తెలంగాణకు వెళ్లేందుకు సమ్మతి తెలిపిన జాబితాను ఇక్కడి ప్రభుత్వం తయారు చేసింది. 2022 సెప్టెంబరు 23న అప్పటి సీఎస్ సమీర్ శర్మ.. ఆనాటి తెలంగాణ సీఎస్ సోమేశ్‌కుమార్‌కు ఇదే అంశంపై లేఖ రాశారు. ఉద్యోగుల అభ్యర్థనను మానవీయ కోణంలో చూడాలని ఆ లేఖలో కోరారు. రెండు రాష్ట్రాల్లో అప్పటికే ఆప్షన్లు ఇచ్చిన ఉద్యోగుల పరస్పర బదిలీలకు తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. వాస్తవ పరిస్థితి ఈ విధంగా ఉండగా ఇటీవల ఈ అంశంపై కొన్ని పుకార్లు షికార్లు చేశాయి.

ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్ తాజాగా స్పందించింది. ఉద్యోగుల బదిలీల వ్యవహారం గత ఎనిమిదేండ్లుగా నానుతున్న క్రమంలో విభజన చట్టంలోని అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య సమావేశాలు జరిగినప్పుడల్లా ఇది చర్చకొస్తోందని తెలిపింది. కానీ ఉద్యోగుల పరస్పర బదిలీలకు సంబంధించి ఇప్పటి వరకూ రెండు రాష్ట్రాలు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని తేల్చి చెప్పింది. అయితే కొందరు ఉద్యోగులు ఏపీ నుంచి తెలంగాణకు వస్తున్నట్టు ప్రచారం జరగటంతో సీఎం ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మొద్దనీ, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ఆ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు.

24 నుంచి ఏపీ అసెంబ్లీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు వీటిని నిర్వహించనున్నారు. నిజానికి 19 నుంచే సమావేశాలు జరగాల్సి ఉండగా, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ బక్రీద్ సందర్భంగా సెలవులపై ఉండటంతో అసెంబ్లీ సమావేశాల తేదీల్లో మార్పు చోటుచేసుకుంది. 24న ప్రొటెం స్పీకర్‌ను ఎన్నుకున్న తర్వాత, నూతనంగా ఎన్నికైన శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం జరగనుంది.

5 రోజుల్లో 3 మ్యాచులు!



సూపర్8లో టీమ్ ఇండియాకు కఠిన షెడ్యూల్

బ్రిడ్జ్‌టౌన్ : ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా గ్రూప్ దశ మ్యాచులు ముగిశాయి. గ్రూప్-ఏలో మూడు విజయాలు సహా ఓ మ్యాచ్ రద్దు కావటంతో ఏడు పాయింట్లతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఓటమెరుగని రికార్డుతో సూపర్8కు చేరుకుంది. గ్రూప్ దశలో మ్యాచ్‌కు మధ్య విరామం దక్కించుకున్న రోహిత్‌సేనకు సూపర్8లో అటువంటి అవకాశం లేకుండా పోయింది. సెమీఫైనల్లో చోటు సాధించేందుకు కీలక సూపర్8లో ఆడాల్సిన మూడు మ్యాచులను ఏకంగా ఐదు రోజుల వ్యవధిలోనే ఆడాల్సి ఉంది. ఈ మేరకు భారత్‌కు కఠిన షెడ్యూల్ ఎదురైంది. మూడు మ్యచులకు మధ్య విరామం అతి తక్కువగా ఉండటంతో నాకౌట్ మ్యాచులకు పేసర్ల ఫిట్‌నెస్‌పై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం కనిపిస్తోంది!.

సూపర్8లో భారత్ గ్రూప్-1లో నిలిచింది. ఇదే గ్రూప్‌లో అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్ సహా ఆస్ట్రేలియా సైతం చోటుచేసుకుంది. సూపర్8లో భారత్ తొలుత అఫ్గనిస్థాన్‌తో తలపడనుంది. ఆ తర్వాత బంగ్లాదేశ్, ఆస్ట్రేలియాలతో తాడోపేడో తేల్చుకోనుంది. కీలక సూపర్8 కావటంతో ఏ మ్యాచ్‌ను తేలిగ్గా తీసుకునే అవకాశం లేకుండా పోయింది. స్పిన్‌కు అనుకూలించే కరీబియన్ పిచ్‌లపై అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్‌లను ఎదుర్కొవాల్సి రావటం టీమ్ ఇండియాకు సవాల్‌తో కూడకున్నదే. గురువారం బ్రిడ్జ్‌టౌన్ వేదికగా (జూన్ 20) అఫ్గనిస్థాన్‌తో , శనివారం (జూన్ 22) నార్త్‌సౌండ్ వేదికగా బంగ్లాదేశ్, సోమవారం (జూన్ 24) గ్రాస్‌ఐలెట్ వేదికగా ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. సూపర్ 8 మ్యాచుల కోసం టీమ్ ఇండియా ఇప్పటికే అమెరికా నుంచి కరీబియన్ దీవులకు చేరుకుంది.

సూపర్ షకిబ్

నేపాల్‌పై బంగ్లాదేశ్ ఘన విజయం
సూపర్8కు చేరుకున్న బంగ్లా టైగర్స్



కింగ్స్‌టౌన్ : బంగ్లాదేశ్ టైగర్స్ గర్జించటంతో ఆ జట్టు ఐసీసీ టీ20 ప్రపంచకప్ సూపర్8కు అర్హత సాధించింది. నేపాల్‌పై 21 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన బంగ్లాదేశ్ గ్రూప్-డిలో రెండో స్థానంలో నిలిచి సూపర్8 దశకు చేరుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 19.3 ఓవర్లలో 106 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో విజయానికి అడుగు దూరంలో ఆగిపోయిన నేపాల్.. బంగ్లాదేశ్‌పై సైతం సంచల5 రోజుల్లో 3 మ్యాచులు!

న విజయంపై కన్నేసింది. బంగ్లాదేశ్‌ను 106 పరుగులకే కుప్పకూల్చి ఆ దిశగా ఓ అడుగు ముందుకేసింది. బంగ్లాదేశ్ తరఫున షకిబ్ అల్ హసన్ (17, 22 బంతుల్లో 2 ఫోర్లు), మహ్మదుల్లా (13, 13 బంతుల్లో 2 ఫోర్లు), జేకర్ అలీ (26 బంతుల్లో 12), లిటన్ దాస్ (10, 12 బంతుల్లో 1 ఫోర్) రెండెంకల స్కోరు అందుకున్నారు. ఆఖర్లో రిషద్ హుస్సేన్ (13, 7 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), టస్కిన్ అహ్మద్ (12 నాటౌట్, 15 బంతుల్లో 2 ఫోర్లు) ధనాధన్‌తో బంగ్లాదేశ్ వంద పరుగుల మార్క్ దాటింది. నేపాల్ బౌలర్లలో సోంపాల్ (2/10), దీపేంద్ర సింగ్ (2/22), రోహిత్ (2/20), సందీప్ (2/17) రెండేసి వికెట్లతో మెరిశారు. ఇక ఊరించే స్వల్ప ఛేదనలో నేపాల్ చతికిల పడింది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ షకిబ్ (4/7), ముస్తాఫిజుర్ రెహమాన్ (3/7), షకిబ్ అల్ హసన్ (2/9) వికెట్ల వేటలో విజృంభించారు. 19.2 ఓవర్లలో నేపాల్‌ను 85 పరుగులకే కుప్పకూల్చారు. టాప్ ఆర్డర్‌లో ఆసిఫ్ షేక్ (17) సహా మిడిల్ ఆర్డర్‌లో కుశాల్ మల్ల (27, 40 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్),దీపేంద్ర సింగ్ (25, 31 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించినా.. సహచర బ్యాటర్లు చేతులెత్తేశారు. అనిల్ (0), రోహిత్ (1), సందీప్ (1), గుల్షన్ (0), సోంపాల్ (0), సందీప్ (0 నాటౌట్) తేలిపోయారు. బంగ్లాదేశ్ పేసర్ షకిబ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. ఈ మ్యాచ్‌తో గ్రూప్-డి మ్యాచులు సైతం ముగిశాయి. గ్రూప్-డి నుంచి దక్షిణాఫ్రికా నాలుగు విజయాలతో అగ్రస్థానం సాధించగా.. బంగ్లాదేశ్ మూడు విజయాలతో రెండో స్థానం సాధించి సూపర్8కు చేరుకుంది. మూడు పరాజయాలతో నేపాల్ చివరి స్థానంతో సరిపెట్టుకుంది.

శ్రీలంక ఓ విజయంతో!

- నెదర్లాండ్స్‌పై 83 పరుగులతో గెలుపు
- ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024



గ్రాస్‌ఐలెట్ : ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో లంకేయులు ఎట్టకేలకు ఓ విజయం సాధించారు. గ్రూప్-డిలో నేపాల్‌తో మ్యాచ్ వర్షార్పణం కావటంతో నిరాశజనకంగా మొదలైన శ్రీలంక వేట.. ఆ తర్వాతి రెండు మ్యాచుల్లోనూ పరాజయం చవిచూసింది. సూపర్8 ఆశలు ఆవిరి చేసుకున్న శ్రీలంక గ్రూప్ దశలో చివరి మ్యాచ్‌లో ఊరట విజయం సాధించింది. సోమవారం గ్రాస్‌ఐలెట్‌లో జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై 83 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 6 వికెట్లకు 201 పరుగుల భారీ స్కోరు చేసింది. చరిత్ అసలంక (46, 21 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. కుశాల్ మెండిస్ (46, 29 బంతుల్లో 5 ఫోర్లు), ధనంజయ డిసిల్వ (34, 26 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), ఏంజెలో మాథ్యూస్ (30 నాటౌట్, 15 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) దంచికొట్టారు. ఇక భారీ ఛేదనలో నెదర్లాండ్స్ చతికిల పడింది. ఓపెనర్ మైకల్ లెవిట్ (31, 23 బంతుల్లో 2 ఫోర్లు 3 సిక్స్‌లు), స్కాట్ ఎడ్వర్డ్స్ (31, 24 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మినహా డచ్ శిబిరం నుంచి ఎవరూ అంచనాలను అందుకోలేదు. శ్రీలంక బౌలర్లలో నువాన్ తుషార (3/24), వానిందు హసరంగ (2/25), మతీశ పతిరణ (2/12) వికెట్ల వేటలో మెరిశారు. 16.4 ఓవర్లలో 118 పరుగులకే నెదర్లాండ్స్ కథ ముగిసింది. 83 పరుగుల భారీ తేడాతో శ్రీలంక ఘన విజయం సాధించింది. శ్రీలంక బ్యాటర్ చరిత్ అసలంక 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.



ముగిసిన ఐటీఎఫ్ జాతీయ పోటీలు

హైదరాబాద్ : భారత ట్రయథ్లాన్ సమాఖ్య (ఐటీఎఫ్) జాతీయ సబ్ జూనియర్, జూనియర్, పారా చాంపియన్‌షిప్స్ 2024 పోటీలు సోమవారం ముగిశాయి. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన పోటీల్లో పలు విభాగాల్లో అథ్లెట్లు సత్తా చాటారు. తెలంగాణ అథ్లెట్ జోహన షిజు సబ్ జూనియర్ గర్ల్స్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ట్రయథ్లాన్ సంఘం అధ్యక్షుడు మదన్ మోహన్, ఇతర ఆఫీస్‌బేరర్లు పాల్గొన్నారు.

ఓపెన్ కబడ్డీ విజేత సాయ్



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ ఓపెన్ కబడ్డీ పోటీల విజేతగా సాయ్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) జట్టు నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్లో శక్తి క్రీడా మండల్‌పై 41-35తో సాయ్ జట్టు మెరుపు విజయం నమోదు చేసింది. రంగారెడ్డి, సూర్యాపేట జట్లు సెమీఫైనల్లో పోరాడి ఓడాయి. తెలంగాణ కబడ్డీ సంఘం కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ విజేతగా నిలిచిన సాయ్ జట్టుకు ట్రోఫీ అందజేశాడు.


నవచిత్రం

డిసెంబర్ 6న పుష్ప-2 : ది రూల్


అల్లు అర్జున్

అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబోలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'పుష్ప 2: ది రూల్'. ఈ చిత్ర టీజర్‌తో పాటు ఇటీవల విడుదలైన 'పుష్ప..పుష్పరాజ్', టైటిల్ సాంగ్, కపుల్ సాంగ్‌గా విడుదలైన రెండో లిరికల్ సాంగ్ 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి వుంటాడే నా సామీ..' మంచి రికార్డులు క్రియేట్ చేశాయి. అయితే మొదట ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకు తీసుకవస్తున్నామని ప్రకటించిన ఈ చిత్రాన్ని డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు మేకర్స్ సోమవారం ప్రకటించారు. షూటింగ్ పార్ట్‌తో పాటు, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఇంకా పూర్తి కాకపోవడం, క్వాలిటీ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా, టెక్నికల్‌గా మరింత అత్యున్నత విలువలతో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో సినిమా విడుదల తేదిని మార్చినట్లు మేకర్స్ పేర్కొన్నారు. అల్లు అర్జున్, రష్మిక మందన్న, ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నిర్మాతలు: నవీన్ ఏర్నేని, వై.రవిశంకర్, సినిమాటోగ్రాఫర్: మిరోస్లా క్యూబా బ్రోజెక్, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, లిరిసిస్ట్: చంద్రబోస్.

నో డైలాగ్స్ ఓన్లీ యాక్షన్


రవితేజ

రవితేజ, డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబోలో రాబోతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ బచ్చన్'. సోమవారం మేకర్స్ షో రీల్ వీడియోని రిలీజ్ చేసి ప్రమోషన్స్ ప్రారంభించారు.
ఇందులో ఎలాంటి డైలాగ్‌లు లేకుండా షోరీల్‌ని కంప్లీట్ యంగేజింగ్‌గా కట్ చేశారు హరీష్ శంకర్. రవితేజ స్టైలిష్, మాస్ క్యారెక్టర్‌లో పరిచయం కాగా, జగపతి బాబు ఓల్డ్ ఫెరోషియస్ మ్యాన్‌గా కనిపించారు. రవితేజ గెటప్ క్లాస్‌గా ఉంటూ యాక్షన్స్ ఎక్కువగా మాస్‌ను ఆకట్టుకునేలా ఉన్నాయి. అమితాబ్ బచ్చన్‌ను రవితేజ ఇమిటేట్ చేసే చివరి సీన్ అందరీ అలరిస్తోంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ నటిస్తుండగా, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇద్దరూ షోరీల్‌లో కనిపించారు. అయనంక బోస్ అందించిన ఎక్స్‌ట్రార్డినరీ కెమెరా వర్క్, మిక్కీ జె మేయర్ అందించిన అప్‌లిఫ్టింగ్ స్కోర్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ టాప్ క్లాస్ ప్రొడక్షన్ వాల్యూస్ అద్భుతంగా ఉన్నాయి. షోరీల్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచింది అని చిత్ర బృందం తెలిపింది.
పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్ ఈ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ప్రొడక్షన్స్ వర్క్స్ పూర్తి కావస్తున్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ని త్వరలోనే అనౌన్స్ చేయనున్నారు.

మహారాజకి రెస్పాన్స్ సూపర్



విజయ్ సేతుపతి నటించిన లేటెస్ట్ సినిమా 'మహారాజ'. నితిలన్ సామినాథన్ దర్శకత్వంలో ప్యాషన్ స్టూడియోస్, ది రూట్ బ్యానర్స్ పై సుధన్ సుందరం, జగదీష్ పళనిసామి నిర్మించారు. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ హౌస్ ఎన్‌వీఆర్ సినిమా ఈ మూవీని ఏపీ, తెలంగాణలలో మ్యాసీవ్‌గా రిలీజ్ చేసింది. విజయ్ సేతుపతి 50వ సినిమాగా ఈనెల 14న విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ థ్యాంక్యూ మీట్‌ని నిర్వహించింది.
హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ, "మహారాజకి వస్తున్న అద్భుతమైన రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. సినిమా గురించి అందరూ గొప్ప మాట్లాడటం వింటుంటే చాలా ఆనందంగా, ఎమోషనల్‌గా ఉంది. మా సినిమాని ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు. 'తెలుగు ఆడియన్స్ అందరికీ థ్యాంక్స్. కథ, స్క్రీన్ ప్లే, పెర్ఫార్మెన్స్ గురించి ప్రేక్షకులు ప్రత్యేకంగా మాట్లాడటం చాలా సంతోషాన్ని ఇచ్చింది' అని డైరెక్టర్ నితిలన్ సామినాథన్ అన్నారు. డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ,'కలెక్షన్స్‌తో తెలుగు ప్రేక్షకులు విజయ్ సేతుపతికి బ్రహ్మరథం పట్టారు. మొదటి రోజు నుంచే స్క్రీన్ పెంచుతూనే ఉన్నాం. రిపీట్ ఆడియన్స్ వస్తున్నారు. ఈ ఏడాదిలో 'హనుమాన్' తర్వాత ఇంతపెద్ద హిట్ ఈ సినిమానే అని నమ్ముతున్నాను' అని తెలిపారు.

ఇట్లు.. మీ సినిమా రిలీజ్‌కి రెడీ

లిటిల్ బేబీస్ క్రియేషన్స్ పతాకంపై నోరి నాగ ప్రసాద్ నిర్మాతగా, దర్శకుడు హరీష్ చావా రూపొందిస్తున్న చిత్రం 'ఇట్లు... మీ సినిమా'. అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్, కృష్ణ, మంజుల హీరో హీరోయిన్లుగా, ప్రదీప్, అమ్మ రమేష్ ప్రధాన పాత్రలలో నటిస్తున్నారు. నలుగురు యువకులు తమకున్న ప్యాషన్‌తో సినిమా రంగానికి వచ్చి ఎదుర్కొన్న సవాళ్ల ఏంటి?, వాళ్ళు సినీ ఇండస్ట్రీలో సక్సెస్ అయ్యారా లేదా అనే కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా ఈనెల 21న థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.
ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని మేకర్స్ సోమవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు.


అభిరామ్, వెన్నెల

దర్శకుడు హరీష్ చావా మాట్లాడుతూ,' చిత్ర పరిశ్రమలోకి రావాలనుకుంటున్న వారు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారు అనేది మేం ఈ కథలో చూపించాం. ప్రేక్షకులందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని అన్నారు.
'మా మూవీకి శ్రీనివాస్, రామారావు అని ఇద్దరు మిత్రులు మాకెంతో సపోర్ట్ చేశారు. ఈ మూవీతో ఒక మంచి ప్రయత్నం చేశాం. చిత్ర పరిశ్రమలో కొత్త వాళ్ల పడే ఇబ్బందులను ఆసక్తికరంగా ప్రేక్షకులకు నచ్చేలా చూపించాం. అన్ని ఎమోషన్స్ కలిపిన చిత్రమిది' అని నిర్మాత నోరి నాగ ప్రసాద్ చెప్పారు.
హీరోయిన్ వెన్నెల మాట్లాడుతూ, 'ఒక మంచి మూవీలో భాగమవడం సంతోషంగా ఉంది' అని అన్నారు. 'ఈ సినిమాలో కొత్త నటీనటులు అని మాత్రమే చూడకండి. కేవలం కంటెంట్ చూసి మా మూవీ చూసేందుకు రమ్మని కోరుతున్నా' అని హీరో అభిరామ్ చెప్పారు.

ఒక నేనే.. నాకు చుట్టూ నేనే..


ప్రభాస్

ప్రభాస్ నటిస్తున్న తాజా సినిమా 'కల్కి 2898 ఏడి'.
ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ ఒక నేనే..నాకు చుట్టూ నేనే.. అంటూ సాగే 'భైరవ అంథమ్'ని మేకర్స్ సోమవారం రిలీజ్ చేశారు. ప్రేక్షకులు, ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ పాటలో ప్రభాస్, దిల్జిత్ దోసాంజ్ అదరగొట్టారు.
దేశంలోని బిగ్గెస్ట్ స్టార్స్‌ని ఒక్కచోటికి చేర్చిన సినిమా ఇది. కామిక్-కాన్ శాన్ డియాగోలో తనదైన ముద్ర వేసిన మొదటి భారతీయ చిత్రంగా చరిత్ర సృష్టించింది.
యానిమేటెడ్ ప్రిల్యూడ్ ప్రజెంట్ చేసిన మొట్టమొదటి ఇండియన్ మూవీ ఇది. 4-టన్నుల ఫ్యూచరిస్టిక్ వెహికల్ 'బుజ్జి' ప్రస్తుతం ఇండియాలో టూర్ చేస్తోంది. నార్త్, సౌత్ ఇండియా కల్చర్ రిచ్‌నెస్‌ని ఒక అంథమ్‌తో బ్లెండ్ చేయడం ద్వారా ఈ సినిమాపై మేకర్స్ మరింతగా అంచనాలు పెంచారు.
మ్యూజిక్ వీడియో కాశీ డార్క్, ఫ్యూచరిస్టిక్ వరల్డ్‌లో సెట్ చేయబడిన ఒక విజువల్ మార్వెల్. దిల్జిత్ దోసాంజ్, విజయ నారాయణ్ పాడిన ఈ పాటకు కుమార్ లిరిక్స్ అందించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందించిన ఈ పాటకు పోనీ వర్మ కొరియోగ్రాఫ్ చేశారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకొణె, దిశా పటానీ వంటి హేమాహేమీలతో ఈ చిత్రాన్ని నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది.
ఈ చిత్రం ఈనెల 27న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

నింద సక్సెస్ ఖాయం



వరుణ్ సందేశ్ హీరోగా 'నింద' అనే చిత్రాన్ని ది ఫెర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజేష్ జగన్నాథం నిర్మిస్తూ, దర్శకత్వం వహించారు.
కాండ్రకోట మిస్టరీ అనే క్యాప్షన్‌తో యదార్థ సంఘటనల ఆధారంగా ఈ మూవీని నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 21న రాబోతోంది. మైత్రీ మూవీస్ ఈ సినిమాను నైజాంలో రిలీజ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ నిర్వహించిన ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హీరో నిఖిల్ సిద్దార్థ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,'నా కెరీర్‌లో 'స్వామిరారా, కార్తికేయ' ఎలా పడిందో.. 'నింద' అనేది వరుణ్ కెరీర్‌కు ఓ మైల్ స్టోన్‌లా మారాలి. ఈ మూవీని అందరూ చూసి ఎంజాయ్ చేస్తారు. దర్శక, నిర్మాత రాజేష్ గురించి అందరూ మాట్లాడుకుంటారు. చాలా క్వాలిటీతో తెరకెక్కించారు' అని తెలిపారు. 'నా మనసుకు ఎంతో దగ్గరైన చిత్రమిది. రాజేష్ తన ప్యాషన్‌తో ఈ సినిమాను నిర్మించి, దర్శకత్వం వహించారు. ఆయనకు తన కథ మీద చాలా నమ్మకం ఉంది. ఎంతో గట్స్, కాన్ఫిడెన్స్‌తో నిర్మించారు. ఈ సినిమాను ఇండస్ట్రీలోని కొంత మందికి చూపించాం. ఆ తరువాత మాలో మరింత పాజిటివిటీ పెరిగింది' అని వరుణ్ సందేశ్ చెప్పారు.
దర్శక, నిర్మాత రాజేష్ జగన్నాథం మాట్లాడుతూ, 'ఈ మూవీ అవుట్ పుట్ చూశాక నాకు చాలా సంతృప్తి కలిగింది. అదే నేను సాధించిన విజయం అనిపించింది. వరుణ్ సందేశ్ ఈ మూవీతో కమ్ బ్యాక్ ఇస్తాడు. ఈ మూవీతోనే దానికి నాంది పడుతుంది' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.